# మదిలేని కథ

'సింహవాసిని'



విద్య ఏడుస్తోంది.

ఒడిలో నిర్జీవంగా పడిఉన్న పాప బుగ్గలు, తల, ఒళ్ళు అంతా తడిమి తడిమి ఏడుస్తోంది. కట్టతెగిన చెరువులా పొంగివస్తోంది దుఃఖం!

ఎవరూ తీర్చలేని బాధ అది!

---

*1983 చక్రపాణి రెండవ అవార్డు పొందిన నవల*

---

మహేశ్‌కి ఏం చేయడానికి తోచకుండా ఉంది.

విద్య దుఃఖాన్ని చూడలేకుండా ఉన్నాడు అతను. ఇప్పుడే కాదు. ఎప్పుడయినా అంతే: ఆమె ఎప్పుడూ సంతోషంగా ఉండాలనే అతడు కోరుకుంటాడు.

విద్యను చూస్తే అతని గుండె తరుక్కుపోతోంది.

ఫోన్‌లో సత్యమూర్తికోసం ఉదయంనుంచీ ప్రయత్నిస్తున్నాడు. ఈ సమయంలో అతను, విద్య పక్కనుంటే తనకు ఎంతో ధైర్యంగా ఉండేది.

సాయంత్రానికి గానీ, బొంబాయిలో అతని ఆచూకీ దొరికింది కాదు. అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని విషయాన్ని వివరించాడు. సత్యమూర్తి ఎంత షాక్ అయాడో అతని మౌనమే సూచించింది.

మరో మూడు గంటలు అవుతుంది అతను బెంగుళూరు చేరుకోవడానికి. ఆ మూడుగంటలే మూడు యుగాల్లా గడుస్తున్నాయి.

ఉదయంనుంచీ ఎంత ప్రయత్నించినా, విద్యచేత ఒక కప్పు కాఫీ అయినా తాగించలేకపోయాడు.

సత్యమూర్తి వచ్చేలోపల విద్య నీరసంతో సొమ్మసిల్లి పడిపోతుందేమోనని భయంగా ఉంది మహేశ్‌కి.

ఆఫీసునుంచీ ఒక్కొక్కరే వచ్చి చూసి, కాస్సేపు ఆగి వెళుతున్నారు. ఎవరు పలకరించినా జవాబియ్యగల స్థితిలో లేదు విద్య.

సత్యమూర్తి బొంబాయి ప్రయాణానికి, బయలుదేరేందుకు, కొన్ని నిముషాలక్రితం యాక్సిడెంట్ అయింది.

ఇంటిముందర తోటలో ఆడుకుంటున్న బేబీ ఎప్పుడు నిశ్శబ్దంగా గేట్ దాటి వీధిలోకి వెళ్ళిందో ఎవరికీ తెలియదు.

లైసెన్స్ లేకుండా కారు నడుపుతున్న ఒక అబ్బాయిగారి ఫాన్సీ స్పీడ్‌కి, బ్రేకులు లేకుండా అయాయి.

ఒళ్ళంతా దెబ్బలతో రక్తసిక్తం అయి ఉన్న బేబీని హాస్పిటల్లో చేర్చి, తనకు ఫోన్‌చేశాడు సత్యమూర్తి.

పాపను, విద్యను చూసుకొమ్మని అప్పజెప్పి వెళ్ళిపోయాడు. అతను ప్రయాణం కాన్సిల్‌చేసుకుంటే బావుండేది అని మహేశ్‌కి అప్పుడే అనిపించింది. కానీ అదేమాట నోటితో అనలేకపోయాడు.

ఎలా అనగలడు? సత్యం పాపకు కన్నతండ్రి. తను ఎవరని అతనికి తన బాధ్యత గుర్తుచేయగలడు?

'ఏమయినా సత్యానికి గుండెనిబ్బరం ఎక్కువ' అనుకున్నాడు మహేశ్. అతను అలా అనుకోవడం ఇది మొదటిసారి కాదు.

బయట కారు ఆగిన చప్పుడయింది.

కారు దిగి హడావిడిగా లోపలికి వస్తున్న సత్యమూర్తి వెనకాలే మహేశ్ లోపలికి నడిచాడు.

ఒక్కక్షణంపాటు, విద్య ఒడిలో ఉన్న పాపను చూస్తూ నిశ్శబ్దంగా నిలుచున్నాడు సత్యమూర్తి.

మరుక్షణం వెళ్ళి, విద్యపక్కన కూచుని, ఆమె భుజాలచుట్టూ చేతులు వేసి దగ్గరికి తీసుకోబోయాడు.

ఉబికివస్తున్న దుఃఖం ఏమయిందో, నిర్లిప్తంగా ముఖాన్ని పక్కకు తిప్పుకుంది విద్య, అయిష్టంగా.

అక్కడినుంచీ తప్పుకుని, వరండాలోకి దారితీసాడు మహేశ్. సత్యమూర్తి వయిపు విద్య చూసిన చూపు అతని కేమిటో భయాన్ని కలిగిస్తోంది. ఎప్పుడు, ఎలా మొదలయిందో కానీ, వీళ్ళిద్దరిలోనూ చాలా మార్పువస్తోంది అనుకున్నాడు.

ఒకప్పుడు పది సంవత్సరాలక్రితం ఎలా ఉండేవాళ్ళు? ఇప్పుడు....... ఎందుకు? ఎందుకిలా జరుగుతోంది?

సత్యం విద్యను నిర్లక్ష్యం చేస్తున్నది కనిపిస్తోంది. కానీ తప్పంతా అతనిదే అనటానికి మనసు ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే సత్యానికిప్పుడు ఒళ్ళు తెలియటం లేదు. విద్య నేమిటి, తన్ను తానే నిర్లక్ష్యం చేసుకుంటున్నాడు అతను.

ఈ విషయంలో ఆ ఇద్దరి ఆత్మీయుడిగా తను చేయగలిగిందేమీ లేదు?.... అరె! ఇదేమిటిలా ఆలోచిస్తూ కూర్చున్నానే- అని ఉలికిపాటుతో లేచాడు మహేశ్. పాప దహనసంస్కారాలకి అవసరమైన ఏర్పాట్లు చేయొద్దూ?....

*　　*　　*

ఉదయం ఎనిమిదిగంటలు దాటితేకానీ, సిటీ రోడ్లలో ట్రాఫిక్ పుంజుకోదు. అందుకనే, ఉదయం ఇంటినుంచీ త్వరగా బయలుదేరటాన్ని ఇష్టపడతాడు సత్యమూర్తి.

ఒకగంట ప్రయాణం చేసి సరిగ్గా ఎనిమిదింటికి 'జనార్దన్ టవర్' ముందర కార్లోంచి దిగి లోపలికి నడిచాడు సత్యమూర్తి.

లిఫ్ట్‌లోకెక్కి నాలుగవ అంతస్తుకు వెళ్ళాడు. లిఫ్ట్ తలుపులు దాటి కుడి

వయిపుగా నాలుగడుగులు వేయగానే, ఎదురుగా ద్వారం, దానిప్రక్కనే తెల్లటి గోడలోకి పొదిగినట్లుగా అమర్చబడిఉన్న 'శ్రీవిద్యా అడ్వటయిజింగ్ అసోసియేట్స్' అన్న లోహపు అక్షరాలు దర్శనమిచ్చాయి. అవి శుభ్రంగా మెరుస్తున్నాయా లేదా అని ఒక్క క్షణం పరిశీలిస్తూ నిలుచున్నాడు. అవంటే అతనికి చాలా ఇష్టం. వాటిని ప్రత్యేకం, కలకత్తాలో ఒక కంపెనీకి ఆర్డర్ ఇచ్చి తయారు చేయించి, తెప్పించాడు. వాటిని రోజూ తుడిచి, నెలకొకసారి పాలిష్‌చేసేపని, ఆఫీసు అటెండర్లు ఎనిమిది మందిలో ఇద్దరికి అప్పగించాడు.

ముఖద్వారాన్ని దాటుకుని కారిడార్‌లో కొంచం ముందుకు నడిచాడు. చివరనున్న చిన్న ద్వారం నేరుగా అతని రూముకు దారితీస్తుంది. కోటుజేబులో ఉన్న తాళంచెవితో ఆ తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు. ముఖ్యద్వారం, మిగతా గదుల తలుపులు అన్నీ తొమ్మిది గంటలకి తెరవబడతాయి.

డబుల్‌కాట్ అంత విశాలంగా ఉన్న మైకాటాప్ టేబిల్ నిండుగా ఫైళ్ళు, కాయితాలు, పెన్‌స్టాండ్, నీట్‌గా సర్ది ఉన్నాయి.

మూడురోజులు ఊళ్ళోలేనందుకు పేరుకుపోయిన కాగితాలమీదికిప్పుడు దాడిచేస్తే, మధ్యలో మరే ఆటంకం కలగకపోతే, మధ్యాహ్నానికి క్లియర్ అవుతాయి అవి.

కోటువిప్పి, కఫ్ బటన్స్ విప్పి, స్లీవ్స్ కొద్దిగా మడుచుకుని కుర్చీలో కూర్చున్నాడు.

మరుక్షణమే ఫోన్ రింగవటం మొదలయింది. తన పి. ఏ. పూర్ణిమ వచ్చేదాకా కాల్స్ తనే నేరుగా అందుకోవలసిందే.

కాయితాల మీదినుంచి దృష్టి మళ్ళించకుండానే, చేతిలో పెన్ క్రింద ఉంచకుండా, రిసీవర్‌తీసి 'హలో' అన్నాడు.

ఎవరో తనకు ముఖంచూడా గుర్తుతెలీని పరిచయస్థుడు. అయినా అతను అందించే సానుభూతి వచనాలు అందుకోవలసిందే. ఆ వ్యక్తికీ, తనకూ మధ్య ఎప్పుడే అవసరాలు వస్తాయో తెలీదు.

"సత్యమూర్తిగారేనా? గుడ్‌మాణింగ్ సార్! ఈ ఉదయమే తెలిసింది నాకు. అయామ్ వెరీసారీ! ఏక్సిడెంట్ అయిందట కదూ? అసలెలా జరిగిందండీ! పాపవెంట ఎవరూ లే...?"

సత్యమూర్తికి చిరాకుగా ఉంది. మాట్లాడకుండా రిసీవర్ చెవి కానించుకుని ఉండిపోయాడు.

"మా మిసెస్ నిన్నంతా మీ ఇంటికి చాలాసార్లు ఫోన్ చేసిందట. ప్రతిసారీ మిస్టర్ మహేశ్ అనుకుంటూ తీసింది. మీతో మాట్లాడనియ్యనేలేదట. అతను మీ సేల్స్‌మేనేజర్ కదూ?"

ఒళ్ళు మండిపోయింది సత్యమూర్తికి.

"మహేశ్ సేల్స్‌మేనేజర్ మాత్రమే కాదు. అతను నాకు అన్న, తమ్ముడు, స్నేహితుడు, బంధువు-అన్నీ అతనే" అని గట్టిగా అరవాలనిపించింది.

కొన్ని సంవత్సరాల క్రితం అయితే ఆ పని చేసేవాడు. కానీ ఇప్పుడు మాత్రం, "థాంక్ యూ వెరీ మచ్" అనేసి ఫోన్ పెట్టేశాడు.

కళ్ళకు ఎదురుగా కనిపిస్తున్న ఉత్తరాలవేపు పరుగు తీయించాడు. అది 'రాయల్ ఫర్నిషర్స్' నుంచీ వచ్చిన ఉత్తరం. గాంధీబజారులో కొత్త షోరూం ప్రారంభించబోతున్నారట. పబ్లిసిటీ కాంపెయిన్ తయారుచేసి పంపమని కోరుతున్నారు.

నిజానికిప్పుడు 'శ్రీవిద్య' నేషనల్ అడ్వర్టయిజింగ్ స్థాయికి ఎదిగిపోయింది. క్రొత్తగా అయితే లోకల్ పబ్లిసిటీ ఏడ్స్ తయారుచేయదు. కానీ 'రాయల్ ఫర్నిషర్స్', 'శ్రీవిద్య'కి చాలా పాత ఖాతాదారులు. వాళ్ళకున్న అవసరాలకి మరోచోటికి వెళ్ళరు. అందుకనే, సత్యమూర్తి వాళ్ళని కాదనలేడు.

చిన్న సంతకం పెట్టి 'కాన్సెప్షన్' సెక్షన్‌కి వెళ్ళే ట్రేలో పడేశాడు.

రెండోది ఒక లోకల్ ప్రింటింగ్ కంపెనీ నుంచీ వచ్చిన ఉత్తరము. వాళ్ళ ప్రైస్‌లిస్ట్, (ధరలపట్టిక) దానిలో ఉన్న రేటల వివరాలను, తాము ఆర్డర్స్ ఇచ్చే మూడు ప్రింటింగ్ కంపెనీల ధరలతో పోలుస్తూ అకౌంటెంట్ తయారుచేసిన లిస్ట్ కూడా కలిపి, జతచేసి ఉంచి.

దాన్ని నిదానంగా పరిశీలించవచ్చునని ప్రక్కనుంచాడు సత్యమూర్తి.

మళ్ళీ ఫోన్ రింగవటం మొదలయింది.

ఒకసారి అలసటగా కళ్ళు గట్టిగా మూసి, తెరిచి, రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు.

మరో ముఖపరిచయం మాత్రమే ఉన్న స్నేహితుడు, సానుభూతి మాటలతో ఊదరగొడుతున్నాడు.

ఇలాంటివే మరో నాలుగు ఫోన్‌కాల్స్ అందుకునేలోపల, సత్యమూర్తి

మూడ్ అంతా పాడయిపోయింది. దేన్నయితే మరుపుకు తెచ్చుకుని గుండె రాయి చేసుకోవాలనుకున్నాడో, ఆ జ్ఞాపకాన్నే కెలుకుతున్నారు అందరూ.

దుఃఖంలో ఉన్నవారికి సానుభూతి వచనాలు చెప్పటం మామూలు పద్ధతే. తనూ ఎందరికో ఎన్నోసార్లు అలా చెప్పాడు. కానీ వాటిని అందుకోవటం ఇంత బాధాకరంగా ఉంటుందని ఇప్పుడే తెలుస్తోంది. ఇంట్లో ఉండగా మహేశ్ పుణ్యాన ఆ బాధని తప్పించుకున్నాననుకున్నాడు.

పూర్ణిమ వచ్చేలోపల తలపగిలిపోతుందేమో అనిపించింది సత్యమూర్తికి.

మరో అయిదు నిముషాలకి పూర్ణిమ లోపలికి వచ్చి, 'గుడ్‌మార్నింగ్' చెప్పగానే, "మధ్యాహ్నందాకా ఎవరు ఫోన్‌చేసినా, నువ్వే ఏదో ఒక జవాబు చెప్పెయ్యి. నన్ను డిస్టర్బ్ చేయద్దు. ఇవాళ అపాయింట్‌మెంట్స్ ఏవయినా ఉంటే కాన్సిల్ చెయ్యి. రేపు చూద్దాం" అని చెప్పిపంపేసి, ఊపిరి పీల్చుకున్నాడు.

పాడయిన మూడ్‌వల్లనేమో, ఏ పనీ చేయలేకుండా ఉన్నాడు. చదివింది అర్థంగాకుండా ఉంది.

అక్కడనుంచీ ఎక్కడికయినా పరుగెత్తిపోదామా అనిపించింది. కానీ ఎక్కడికి వెళ్ళాలి?

ఇంట్లో ఉండలేకే ఇక్కడికి వచ్చాడు.

ఇంట్లో అడుగుపెట్టినప్పటినుంచీ విద్య తనతో ఒక్కమాట కూడా ఆడలేదు. చూపులయితే తనను దోషిగా నిలబెడుతున్నాయి. పాప తనకు కూతురే. తనకు మాత్రం బాధ లేదా? అత్యవసరమయిన పనికాబట్టే కదా, మనసెంత లాగుతున్నా తను ఆవేళ బొంబాయి వెళ్ళాడు? ఆ విషయం ఆమెకు ఎందుకు అర్థంకాదు?


రెస్ట్ [illegible] లేకుండా [illegible] డాక్టర్ బలవంతాన రెండు నిద్రమాత్రలు మింగిస్తే [illegible] ఉదయం ఆమె లేవకముందే తను తప్పించుకుని వచ్చేశాడు. [illegible]

సిగరెట్ ఒకటి తీసి వెలిగించుకున్నాడు.

తలుపు తీసిన చప్పుడయింది. పూర్ణిమ కాబోలు అనుకుని, మళ్ళీ [illegible] తలెత్తిచూశాడు సత్యమూర్తి.

వచ్చింది మహేశ్. చేతిలో ఏదో కాయితం ఉంది.

"రా మహేశ్ కూర్చో" అన్నాడు మామూలుగా.




"ఇవాళ ఆఫీసుకొస్తావనుకోలేదు. సౌమ్యకి ఎలా ఉంది? పొద్దుట్నుంచీ రెండుసార్లు ఫోన్ చేసినా తీయలేదు."

"నిద్రపోతూ ఉంటుంది. స్లీపింగ్‌డోస్ ఇచ్చాడు డాక్టర్.... మధ్యాన్నం వీలయితే వెళ్ళి పలకరించు. నాతో అసలు మాట్లాడటంలేదు."

వాళ్ళిద్దరి పోట్లాటలకి మహేశ్ మధ్యవర్తిగా వ్యవహరించడం కొత్త విషయంకాదు. అయినా, ఇవాళ ఎందుకో ఆ మాటలు అంటున్న సత్యం స్వరం కొద్దిగా జీరబోవటం గమనించాడు మహేశ్.

చేతిలో ఉన్న టెలిగ్రాంని అతని ముందుంచాడు.

"యువర్ ఆఫర్ ఓకే స్టాప్ ఆర్డర్ ఫాలోస్ విత్ అడ్వాన్స్" అని ఉంది. దీనికోసమే తను బొంబాయి వెళ్ళింది.

పెద్ద వ్యాపారసంస్థ. వాళ్ళదగ్గరికి లెక్కలేనన్ని ఆఫర్లు వచ్చాయి. అంత పోటీలో, ఆర్డర్ తమకే రావాలని కొన్ని నెలలుగా పోరాడుతున్నాడు. ఆఖరి నిముషంలో వెళ్ళడం మానేస్తే, ఆర్డర్ ఇంకొకను కొట్టేయడం ఖాయం. అందుకే తను పరుగెత్తి వెళ్ళింది. అయిదు సంవత్సరాల కాంట్రాక్ట్‌లో, కొన్ని లక్షలు ఆదాయం వచ్చే ఆర్డర్ ఇది.

టెలిగ్రాం చూసినా ఎందుకో సత్యమూర్తికి సంతోషం కలగలేదు. "క్రెడిట్ అంతా నీదే మహేశ్. నీవు ఎంకరేజి చేసుండకపోతే, నే నీ ఆఫర్ ఇచ్చేవాణ్ని కాదు. యూ ఆర్ ఎ రియల్ సేల్స్‌మాన్" అన్నాడు, నవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

"థాంక్‌యూ, థాంక్‌యూ వెరీ మచ్" అంటూ లేచి నిలుచున్నాడు మహేశ్.

"సిగరెట్లు తెచ్చుకోవడం మరిచా. నీ దగ్గరున్నాయా?" అడిగాడు సత్యం.

జేబులోంచి సిగిరెట్టు పెట్టెతీసి టేబిల్‌మీదుంచి అతని వయిపుగా తోసి, మౌనంగా బయటికి నడిచాడు మహేశ్.

*                    *                    *

ఫోన్ మోగుతోంది.

నొప్పిగా ఉన్న తలను, కణతలను నొక్కుకుంటూ రిసీవర్ చేతికి తీసుకున్నాడు సత్యమూర్తి. అతనికి బాగా దగ్గరి స్నేహితులు మాత్రమే, నేరుగా అతనికే డయల్ చేయగల ప్రత్యేకమయిన ఫోన్ అది. ఆ నంబరు అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు.

"హలో.... నేను.... సులభను మాట్లాడుతున్నది."

ఆ పేరు వినగానే, ఎడారిలో ఎర్రటి ఎండలో గంటలకొలదీ ప్రయాణం చేసి, ఒయాసిస్సు ఎదురొచ్చిన బాటసారిలా అయింది సత్యమూర్తి ముఖం.

"ఇంకా రెండ్రోజులు ఆఫీసుకి రారేమో అనుకున్నాను."

"రావలసి వచ్చింది."

"ఒయామ్ వెరీసారీ సత్యం. విషయం తెలిసినప్పటినించీ, బుర్ర పేర లైజ్ అయినట్లుగ ఉంది. ఏమయినా సరే, మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని చూడాలనీ, విద్యగారిని పలకరించాలనీ అనిపించింది... కానీ ఎందుకో...."

"ఫోన్లే మంచిపని చేశావ్...."

"బిజీగా ఉన్నారా? ఎప్పుడు కలుస్తారు?"

"ఏమో! చాలా అలసటగా ఉంది తల పగిలిపోయేలా నొప్పి...."

"పోనీ ఇంటికెళ్ళి రెస్ట్ తీసుకోరాదూ!"

"హుఁ ఇల్లు.... ఇంకా ఎక్కువే అవుతుందేమో!"

"........................"

"ప్లీజ్ సులభా.... షో మీ సం ప్లేస్.... కొన్ని గంటలు ఏ డిస్టర్బెన్స్ లేకుండా నేను విశ్రాంతిగా ఉండగల చోటు."

"నే నొక మాట చెబుతా వింటారా? నేరుగా నా ఫ్లాట్‌కి వెళ్ళిపోండి. అడ్రస్ తెలుసుగా! మీరు వెళ్ళేది మా ఆఫీసు ముందునుంచే కదా! బయట మెయిన్‌గేట్ దగ్గరికి తాళంచెవి ఇచ్చి ఎవర్నయినా పంపుతాను. మీరు కార్లోంచే అందుకుని అటునుంచి అటే వెళ్ళచ్చు. ఇంకేం ఆలోచించకండి. మీకిప్పుడు రెస్ట్ అవసరం.... కిచెన్‌లో వెతికితే ఏదో ఒక తిండి దొరుకుతుంది. కాస్త కడుపుకి వేసుకుని నిద్రపోండి. నేను మా ఆడిటర్స్ పార్టీ ఒకటి ఉంది.

దానికి వెళ్ళి ఆలస్యంగా వస్తాను. వెళ్ళదలచుకుంటే తాళంవేసి వెళ్ళిపోండి.... సరేనా.... ఓకే అనండి."

సత్యమూర్తిని ఆలోచించుకోనివ్వకుండా ఫోన్ పెట్టేసింది. "లాంగ్వేజ్ కోఆర్డినేటర్స్ ఇంటర్నేషనల్" సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సులభ.

వ్యాపారరీత్యా అయితే సులభ సత్యమూర్తికి ఐదారేళ్ళుగా పరిచయమే. కానీ వాళ్ళిద్దరిమధ్య స్నేహం వృద్ధిఅయిందీ మధ్యే. ఇద్దరూ చాలా మటుకు పార్టీల్లో కలుసుకుంటారు. అప్పుడప్పుడు ఏ హోటల్లో అయినా కలిసి భోంచేయటమో, కాఫీ తాగడమో జరుగుతుంది. ఇద్దరికీ ఒకేసారి బొంబాయి ప్రయాణం పడితే, కలిసి వెళతారు. ఒకే హోటల్లో బసచేస్తారు.

సులభతో మాట్లాడుతున్నప్పుడు ఆమె ఒక స్త్రీ అన్న భావం గుర్తుండదు సత్యమూర్తికి. తన వ్యాపార విషయాలు, సమస్యలను గురించి చర్చిస్తే, అర్థం చేసుకోగల, తనతో సమాన స్థాయిలో ఉన్న ఒక వ్యక్తిగా మాత్రమే కనిపిస్తుంది.

టై సరిజేసుకుని కోట్ వేసుకుని, ఇంటర్‌కమ్‌లో పూర్ణిమతో చెప్పి బయలుదేరాడు.

సులభ ఇంటికి సత్యమూర్తి వెళ్ళటం ఇదే మొదలు. ఎప్పుడూ వెళ్ళవలసిన అవసరము రాలేదు. ఆమె ఎప్పుడూ ఆహ్వానించనూ లేదు. ఇలా ఆమె పరోక్షాన ఆమె ఇంటికి వెళ్ళవలసిరావటం చిత్రంగా ఉంది అతనికి.

కారు 'హై పాయింట్' అపార్ట్‌మెంట్స్ చేరుకోగానే, కారు పార్క్ చేసిన తర్వాత డ్రైవర్ని వెళ్ళిపొమ్మని చెప్పి లిఫ్ట్‌వైపు నడిచాడు. మూడవ అంతస్తులో 39 నంబరు ఫ్లాట్ తలుపుమీద మిస్. సులభ అన్న అక్షరాలు పొదిగిన చిన్న నేమ్‌ప్లేట్ అతికించి ఉంది.

తలుపులు తీయగానే ఎరుపు కనిపించే గళ్ళో బూడిదరంగు కార్పెట్ పరచి ఉంది. గోడలకీ అదే రంగు వేయబడి ఉన్నాయి. ఒకవైపున్న గోడకి దగ్గరగా చిన్న టేబిల్‌మీద ఒక పోర్టబుల్ టీవీ సెట్ ఉంది. దానికి ఎదురుగా ఒకటి, అటూ ఇటూ రెండు ఫోమ్ కుషన్డ్ లెదర్ సోఫాల సెట్ వేసిఉంది.

సోఫామీద కూర్చుని బూట్లు విప్పుకున్నాడు సత్యమూర్తి. ఎందుకో అలా కూర్చున్నప్పుడు మధ్యాహ్నం భోంచేయలేదని గుర్తొచ్చి ఆకలేసింది అతనికి.

కోటూ, షర్ట్ విప్పి ఒకపక్కగా పడేసి వంటగదిలోకి వెళ్ళాడు. ఒక మూల చిన్న డైనింగ్‌టేబిల్, దాని పక్కనే రిఫ్రిజిరేటర్ ఒకటి, గదికి మరో వైపు గోడ వెంబడి కుకింగ్ రేంజ్ ఉంది. టేబిల్‌మీద పాకెట్‌లో బ్రెడ్

ఉంది. ఫ్రిజ్‌లోంచి జామ్, ఆపిల్‌పండు, వెన్న తీసుకుని టేబిల్ ముందర కూర్చున్నాడు.

రెండు స్లైసెస్ బ్రెడ్ తినగానే చాలనిపించింది. విద్య ఏంచేస్తూందో అనుకున్నాడు. వంటమనిషి వంట చేసేఉంటాడు. కానీ తను ఏమీ తినుండదని తెలుసు.

అతనికి ఉదయం, మహేశ్ నొకసారి తన ఇంటికి వెళ్ళమని చెప్పింది గుర్తులేదు. అందుకనే తను సులభఇంట్లో ఆమె డ్రాయింగ్‌రూంలో సోఫా మీద విశ్రాంతిగా పడుకుని ఉన్నప్పుడు, అదే సమయంలో మహేశ్ తన ఇంట్లో విద్యతో బలవంతంగా కొద్దిగా మజ్జిగన్నం తినేలా చేసి, ఆమె కెదురుగా కూర్చొని మాట్లాడుతున్నాడని తెలియదు.

పక్కనే టీపాయ్‌మీదున్న మేగజైన్లు చేతికి తీసుకున్నాడు. అందులో ఒకటే ఇంగ్లీష్‌ది ఉన్నది. మిగతావి ఫ్రెంచ్ ఫాషన్ మాగజైను, రష్యన్ సైంటిఫిక్ మాగజైను ఒకటి, రెండు తమిళం, మరొకటి హిందీ ఉన్నాయి. సులభకు ఆరు భారతీయ భాషలతోపాటు ఇంగ్లీషు కాక ఫ్రెంచ్, రష్యన్ భాషలుకూడా వచ్చు. అనర్గళంగా మాట్లాడగలదు, చదవగలదు, వ్రాయగలదు. ఎన్నోసార్లు ఢిల్లీకి ఫారిన్ వి.ఐ.పి.లు వచ్చినప్పుడు మినిస్టర్లకి ఇంటర్‌ప్రెటర్‌గా ఆహ్వానంమీద వెళుతూ ఉంటుంది. జెపనీస్ కూడా నేర్చుకోవాలని ప్రయత్నిస్తోంది.

'స్మితోస్సోనియన్' మాగజైను మాత్రం చేతికి తీసుకుని మిగతావి అక్కడే ఉంచాడు.

పుస్తకంలో ఆసక్తి కలిపించిన వ్యాసం చదువుతూ ఉండగా ఎప్పుడు నిద్రపట్టిందో అతనికి గుర్తులేదు.

ఎప్పుడో ఫోన్ మోగుతున్న శబ్దానికి మెలకువ వచ్చి కళ్ళు తెరిచి చూశాడు. గదంతా చీకటి పరచుకుని ఉంది. ఫోన్ ఎక్కడ ఉన్నదీ తెలీదు అతనికి.

లేచి తడుముకుంటూ వెళ్ళి లైట్ వేసాడు. గదంతా తెల్లటి కాంతి పరచుకుంది. అప్పుడు కన్పించింది కార్నర్ స్టూల్‌మీదున్న ఫోను. సత్యమూర్తి కింకా మత్తు వదల్లేదు. అలాగే రిసీవర్ తీసుకుని 'హలో' అన్నాడు.

సులభ మాట్లాడుతున్నది. "ఎంబ్యాసడర్, మీ రింకా నిద్రపోతున్నారా? ఇక్కడ పార్టీలో బోరుగా ఉంది. మీరింకా మేల్కొని ఉంటానంటే వచ్చేస్తాను. రమ్మంటారా?"



"సరే! అలాగే ఉంటాను."

అప్పుడు చూసుకున్నాడు టయిం. తొమ్మిదయింది. "అబ్బ! ఇన్ని గంటల సేపు నిద్రపోయానా!" అనుకున్నాడు.

సిగరెట్టొకటి వెలిగించుకుని, మళ్ళీ సోఫాలో కూర్చున్నాడు.

సత్యమూర్తి బాత్‌రూంలో ముఖం కడుగుతూ ఉండగా వచ్చింది సులభ.

తలుపు తీయగానే, ఎదురుగా పాంట్‌మీద బనియనులో కనిపిస్తున్న సత్యం వయసు కొత్తగా చూస్తూ లోపలికొచ్చింది సులభ.

"బాగా నిద్రపోయారులా ఉంది."

"మీ సలహాకు థాంక్స్. ఇప్పుడెంతో తేలికగా ఉంది మళ్ళీ రాత్రిఅంతా పనిచేయవలసివచ్చినా సమస్య లేదు."

"మధ్యాహ్నం ఏమయినా తిన్నారో లేదో, భోంచేస్తారా?"

"వెళుతూ ఏ హోటల్లోనో తింటాలే"

"ఎందుకూ? మీకు ఏం కావాలో చెప్పండి. అరగంటలో చేసి పెడతాను. వేసుకుని ఉన్న జీన్స్‌లో నుండి, పొడవాటి కాటన్ మాక్సీలోకి దూరి, వంట గదిలోకి దూరింది.

సులభ చేసిపెట్టిన చపాతీలు, ఎగ్ కర్రీ తినేసి టీతాగి డ్రస్ చేసుకోబోయాడు సత్యమూర్తి.

"అరెరె పాంటు చాలా నలిగిపోయిందండీ. ఒక్క నిముషం.... ఇదుగో ఈ లుంగీలోకి మారిపొండి. ఇస్త్రీ చేసిస్తాను"

అది సులభ ఉపయోగించే హాండ్‌లూమ్ ప్రింటెడ్ లుంగీ. సిగ్గుగా దాన్ని అందుకుని కట్టుకున్నాడు.

అయిదు నిముషాల్లో పాంటు రెడీ అయింది.

"లేట్‌గా వస్తానని ఇంటికి ఫోన్ చేసి చెప్పారా?"

"ఉహూ. ఫరవాలేదు. లేట్‌గా రావటం ఇంట్లోవాళ్ళకి అలవాటే."

"మళ్ళీ ఎప్పుడు......" అలా అంటున్నప్పుడు, సులభ కళ్ళలో మునుపెన్నడూ చూడని భావం ఏదో కనిపించింది సత్యమూర్తికి. ఆ చూపు అతనికి, ఆమె ఒక స్త్రీ అని గుర్తుచేస్తోంది

అందుకనే, 'బై' అనటానికిముందు, అలవాటు ప్రకారం ఆమె చేతిని పట్టుకోలేకపోయాడు.

"మళ్ళీ మీకు, నాకూ టయిం దొరికినప్పుడు......" అన్నాడు.

ఇంగ్లీషులో ఉన్న సౌలభ్యం ఇవాళ తెలిసివచ్చింది. ఇంగ్లీషులో నువ్వు మీకు రెండింటికీ ఒక్కటే పదం కాబట్టి సమస్య ఉండదు. సులభతో తను వ్యాపార రీత్యా కలిసినా, ఫోన్‌లో మాట్లాడినా, సాధారణంగా సంభాషణ ఇంగ్లీషులోనే ఉంటుంది. కానీ ఇవాళ ఇంట్లో అవటంవల్ల తెలుగులోనే మాట్లాడుకున్నాము.

భాష ఏదయినా, కొంత స్నేహం అంటూ ఏర్పడిన తర్వాత, తనకంటే బాగా వయసులో పెద్దవాళ్ళయితే తప్ప, మిస్టర్ అనీ మీరు అనీ, గారనీ గౌరవించటం మానేస్తాడు సత్యమూర్తి. వ్యక్తిగత సంబంధాల్లో అయినా, వ్యాపార వ్యవహారాల్లో అయినా ఏకవచన సంబోధన, స్నేహశీలత్వం, మంచి ఫలితాల నిస్తాయని అతనికో నమ్మకం.

తన ఆఫీస్‌లో చప్రాసీ మొదలు, తన తరవాత నంబర్ టూ మాన్ అయిన, వైస్ ప్రెసిడెంట్-సేల్స్, మహేశ్ వరకూ, అందర్నీ ఒకే రకంగా గౌరవిస్తాడు, పలుకరిస్తాడు. అందుకనే వాళ్ళందరికీ ఇతనంటే భయం కన్నా భక్తి ఎక్కువ.

* * *

పాప పోవడంతో, విద్య జీవిత విధానమే మారిపోయింది.

ఉదయం లేచింది మొదలు, రాత్రి అయేదాకా ఎలా టయిం గడపాలో అర్థంకాకుండా ఉంది. అంతటా శూన్యంగా కనిపిస్తుంది.

సత్యమూర్తి మీద కోపం తగ్గిపోయింది, కానీ మునుపటిలాగా అతనికి చేరువకాలేకపోతోంది.

అతను స్నానం చేస్తే బట్టలు అందించడం, భోంచేస్తే దగ్గరుండి వడ్డించడం, అతను నిద్రలో దగ్గరికి తీసుకుంటే ప్రతిఘటించకుండా, దగ్గరవటం- అన్నీ ఒక బాధ్యతలా మాత్రమే చేస్తోంది.

భర్త పక్కనే ఉన్నా, విద్య మనసుకు ఒంటరితనమే మిగులుతోంది. పాప పోయినప్పుడు డాక్టర్ ఇచ్చిన నిద్రమాత్రలు, ఇప్పుడు అలవాటుగా మారిపోయాయి. రోజూ రాత్రి ఒకటయినా మింగితే తప్ప నిద్రరాదు.

ఆవేళ అలాగే ఒకటి మింగి పడుకుంది. అర్ధరాత్రి అయినా నిద్రపట్టక, తలనొప్పి ప్రారంభం అయింది.

సత్యమూర్తి ఇల్లు చేరుకునేసరికే, ఉన్న ఊపిరి అంతాపోయి వస్తాడేమో ఒళ్ళెరగకుండా నిద్రపోతాడు పక్కనే పిడుగు పడినా అతనికి మెలకువరాదు.

ఒక తలనొప్పి బిళ్ళ, రెండు నిద్రమాత్రలు వేసుకుని పడుకుంది.

అదే నిద్ర. ఉదయం లేచేసరికి తొమ్మిదయింది.

సత్యమూర్తి అఫీసుకు వెళ్ళిపోయాడు.

ఉదయం వీలయినంత త్వరగా ఇంట్లోనుంచి బయటపడటం, రాత్రి

పిలయినంత ఆలస్యంగా ఇల్లు చేరుకోవటం- ఇవి ఇవాల్టిది కాదు. కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నది.

బేబీ ఉంటే తన కివన్నీ తెలిసేవి కాదు. దానితో ఆడుతూ, పాడుతూ, రోజులు క్షణాల్లా గడిచిపోయేవి.

ఎంత సేపూ బిజినెస్, ఆదాయము, ఆఫీసు- ఇవే అతని లోకం అయిపోయాయి.

ఒకప్పుడు, "ఇదేమిటి నువు బిజినెస్‌మాన్ మాత్రమే కాదు, ఒక గృహస్థువి, భర్తవి, తండ్రివి అని పూర్తిగా మర్చిపోతున్నావ్........ కనీసం, నీ ఆరోగ్యంకోసం అయినా కాస్త పని తగ్గించుకో సత్యం" అని మందలించేది.

"అలా అనుకుంటె ఎలా మరి... ఒకరి దగ్గర ఉద్యోగం చేస్తున్నప్పుడయితే, గంట కొట్టగానే పరిగెత్తి రావచ్చు. స్వంతంగా అంతా మనదే అయినప్పుడు, బాధ్యతలు వదిలించుకోవటం ఎలా కుదురుతుంది? ఇక ఇల్లంటావా? ఇక్కడ సర్వాధికారివి నీవు. నాదేముంది. నీవు దయతలచి అన్నం పెడితే తింటాను, ప్రేమ చూపిస్తే, ఒళ్ళో తలపెట్టుకుని నిద్రపోతాను" అని నవ్వేసేవాడు. ఇప్పు డదీలేదు.

సాధారణంగా అతను వెళ్ళే పార్టీలు, డిన్నర్లు విద్యకి నచ్చవు. అక్కడి మనుషులు, మాటలు, వేషభాషలు అన్నీ కృత్రిమంగా కనిపిస్తాయి ఆడా మగా కలిసి ఒళ్ళు తెలియకుండా డ్రింక్స్ పుచ్చుకోటం చూస్తే ఆమెకు అసహ్యంగా ఉంటుంది.

"వీళ్ళంతా ఎందుకిలా ముఖాలతో బాటు, మాటలకి కూడా రంగులు పులుముతారు?" అని విద్య అంటే,

"అదంతేలే విద్యా! అదొక పద్ధతి. డబ్బుగలవాళ్ళు ఎవరయినా, ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీలు ఇవ్వటం సంప్రదాయంగా వస్తున్నది. నలుగురితో కలిసి ఫ్రీగా మూవ్ అవటానికీ, కొత్త పరిచయాలు ఏర్పరచుకోవడానికీ, ఇలాంటి పార్టీల్లో మంచి అవకాశం ఉంటుంది తెలుసా? దానివల్ల నాలాంటి పబ్లిసిటీమెన్‌కి చాలా ఉపయోగం" అనేవాడు సత్యమూర్తి.

తాగుడు, జూదం, రేసుల్లాగా 'బిజినెస్' అన్నది కూడా ఒక వ్యసనం ఏమో అనిపిస్తుంది విద్యకు.

తనకు చిన్నప్పటినుంచీ తెలిసిన సత్యం వేరు. ఇప్పటి సత్యమూర్తి వేరు. అతను, మహేశ్, తను ఒకే ఈడువాళ్ళు. ఒకే బడిలో చదువుకున్నారు.

సన్నగా, పీలగా, తనకన్నా పొట్టిగా, ఒట్టి భయస్తుడిలా ఉండేవాడు సత్యం పదిసంవత్సరాల వయసులో. కానీ చదువులో మాత్రం ఎప్పుడూ ఫస్టే.

మహేశ్ బాగా అల్లరిచేస్తుండేవాడు. ఎప్పుడూ స్కూలు ఎగ్గొట్టి, ఏ తోటల్లోనో, చెట్లమీదో ఉండేవాడు తను. సత్యం కలిసి వెళ్ళి అతన్ని వెతికి పట్టుకుని తెచ్చి క్లాస్‌లో కూర్చోబెట్టుకునేవారు

పరీక్షలంటూ వస్తే సత్యం కాపీ కొట్టనివ్వాలి. మహేశ్ పాస్ అవాలి. అదీ తంతు. తను మాత్రం ఎలాగో తంటాలుపడి అత్తెసరు మార్కులతో బండి లాగించేది.

* * *

విద్య, సత్యం, మహేశ్ ముగ్గురూ ఒకచోట కలిసారంటే టయిం ఎలా గడిచేదీ తెలిసేది కాదు.

స్కూల్లో లెక్కల మాష్టారు విద్య తండ్రి. కొద్దిగా మాత్రం స్వంత వ్యవసాయం గల ఒక చిన్న రైతు కొడుకు సత్యం.

మహేశ్ కొక ముసలితాత తప్ప ఎవరూ లేరు. బ్రతుకుతెరువు కోసం జంతికలు, చిన్న బిస్కెట్లు, పిప్పరమెంట్లు తట్టలో ఉంచుకుని తన స్కూలు దగ్గరే అమ్ముకునేవాడు.

లెక్కల మాష్టారు ఈశ్వరయ్యగారి దగ్గర సత్యం ట్యూషన్ చెప్పించుకునేవాడు. మహేశ్ తాతమీద దయతో, మాష్టారు మహేశ్‌కి సత్యం జతలో పాఠం చెప్పేవారు.

చీకటిపడగానే భోంచేసి, పెందారాళే మాష్టరు ఇల్లుచేరేవారు స్నేహితులిద్దరూ. వాళ్ళతోపాటు విద్య కూడా కూచునేది. మరో పదిమందిదాకా వేరే క్లాసు పిల్లలు కూడా వచ్చేవారు. తనకన్నా తక్కువక్లాసు పిల్లలందరికీ చాలా మటుకు సత్యమూర్తితోనే పాఠాలు చెప్పించేవాడు. తను చదువులో దిట్ట అని అతనికి బాగా గర్వం. కానీ మహేశ్, విద్యల దగ్గర మాత్రం అలాంటిదేమి చూపకుండా కలిసిపోయేవాడు.

రాత్రి పాఠాలు అయిన తర్వాత అందరూ వెళ్ళినా, మహేశ్, సత్యం వెళ్ళరు. విద్యతో చేరి ఇంటిముందర వసారాలో కబుర్లాడుతూ కూర్చునేవారు. సత్యం మంచి కథలు చెప్పేవాడు. కథల పుట్టలాగా అతనికి రోజుకొక కథ ఎక్కడినుంచి వచ్చేదో! ఇంక మహేశ్ ఆవేళ తను చేసిన అల్లరి తన వీర

సాహసకృత్యాలు, తిన్న దెబ్బలు- వీటిసి గురించి చిలవలుపలవలుగా వర్ణించి చెప్పేవాడు.

కళ్ళు పెద్దవిగా చేసి, చెవులు దోరగించి, వాళ్ళ మాటలు వినే విద్యకి, ఇంట్లోనుంచి పదుకుందువుగాని రమ్మని అమ్మా నాన్నా వేసే కేకలు ఎక్కడ వినిపిస్తాయి?

సత్యం నాన్నో, మహేశ్ తాతయ్యో లాంటరు పట్టుకుని వీళ్ళని వెతుక్కుంటూ వస్తే తప్ప ఆ కబుర్లకి అంతం అంటూ ఉండదు.

చిన్నప్పటినుంచి ఎరిగున్న నమ్మకం వల్లనేమో, విద్య యుక్తవయసుకు వచ్చినా, మగపిల్లలతో స్నేహం ఏమిటని అమ్మ అడ్డుచెప్పినా నాన్న కొట్టి పారేసేవారు. తమ స్నేహానికే ఆటంకం కలగలేదు.

నిజానికి మహేశ్ తెలివితక్కువవాడేం కాదు. ఏస్సెల్సీలోకి వచ్చిన తర్వాత ఇంక మాస్టార్ల దయతో పాస్అయే వీలులేదని తెలుసుకున్నాడు. అదయినా పరీక్షలకి నెలరోజుల ముందు, అంతదాకా పుస్తకం తాకిన పాపాన పోలేదు. అసలు అతనికి తాత పుస్తకాలు అవీ సవ్యంగా కొనేవాడు కాదు. ఆ వయసులో మనవడికీ, తనకూ రెండుపూట్ల భోజనం అమర్చుకోవటమే అలవి కాని పని ఆయనకు.


ఏమైనా ఎస్సెల్సీ ఫెయిల్ అవకూడదని మహేశ్‌కి మనసులో బాగా పడింది. ఎందుకంటే, ఇంటర్మీడియట్ కోసం సత్యం టౌన్‌కి వెళ్ళిపోతాడు. పాస్ అయితే తనూ ఎలాగో తంటాలుపడి అతనివెంట వెళ్ళిపోవచ్చు.

మాస్టర్లందరినీ అడిగి ప్రతి సబ్జక్ట్‌లో ముఖ్యమయిన కొన్ని ప్రశ్నలు వ్రాయించుకున్నాడు. సత్యం దగ్గరున్న నోట్సులతో, ఆ ప్రశ్నలకి జవాబులు తెలుసుకుని నెలరోజులు పూర్తిగా బట్టీయం వేసాడు.

సత్యానికి ఫస్ట్‌క్లాస్, విద్యకూ, మహేశ్‌కీ సెకండ్ క్లాస్ వచ్చింది. ఇంట్లో మొండితనంచేసి ఒప్పించుకుని వాళ్ళిద్దరివెంట తనూ అనంతపురం కాలేజీలో చేరింది.

అక్కడ అమ్మాయిలకి ప్రత్యేకం హాస్టల్ లేదు. అందుకని మాస్టారు ఒక చిన్న రూం అద్దెకు కుదుర్చుకుని, ఒక ముసలి అవ్వను మటుకు కుదిర్చి కూతుర్ని దిగవిడిచి వచ్చారు.

తమ ఊరినుండీ వచ్చిన మహేశ్, సత్యమూర్తి ఇద్దరూ ఆమెను జాగ్ర



త్తగా చూసుకోగలరన్న నమ్మకంతోనే, ఆయన పాతుర్ని అంత ధైర్యంగా టవునులో విడిచి పెట్టాడు.

మహేశ్‌కి సోషల్ వెల్‌ఫేర్ హాస్టల్లో సీటు దొరికింది.

రెండేళ్ళు ఎలా గడిచిపోయాయో తెలీదు. కాలేజీలో మిగతా అబ్బాయిలు మహేశ్, సత్యాలని విద్యకి బాడీగార్డ్స్ అని ఎగతాళి చేస్తుండేవారు.

ఒకసారి ఒక రౌడీ కుర్రవాడు, తన వెంటబడి అల్లరి పెట్టటం చూసి, సత్యం వాణ్ణి కొట్టిన దెబ్బలు తలచుకిప్పటికీ గుర్తే. అతనికి అంత కోపం రాగల దనీ, అసలు అన్ని దెబ్బలు కొట్టగల బలం ఉన్నదనీ అప్పుడే తెలిసింది. బడిలో ఉన్నప్పటి అర్భకపు సత్యం కాదనీ, పౌరుషంగల మగవాడు అయ్యాడనీ గుర్తిం చింది.

విద్యకి స్నేహం వరకూ మహేశ్, సత్యం ఇద్దరూ ఒకటే. కానీ సత్య మూర్తిపట్ల ఆమె మనసులో ఏ మూలో కొంత ఆరాధనా భావం ఉండేది. దానికి తోడు వయసు పెరుగుతున్నకొద్దీ కొత్తరకం ఆకర్షణ ఏదో ఏర్పడింది అతనంటే.

కాలేజీలో చేరిన తర్వాత మహేశ్ దుడుకుతనం కొంత తగ్గింది. చదువు మీద ఆసక్తి పెంచుకున్నాడు. ముగ్గురు ఏ రోజయినా విద్య గదిలో కలిస్తే, ఎక్కువగా కాలేజీ, చదువు, లెక్చరర్లు, పాఠాలువంటి విషయాలే చర్చించుకునే వారు.

తమ క్లాసులో తమతోబాటు చదువుకునే అమ్మాయిలను చూడగానే

వంకర్లు తిరిగిపోతూ, వయ్యారాలు పడిపోయే అబ్బాయిలని చూసి చిరాకుపడే వాడు మహేశ్.

ఒకసారలాగే, ఒకబ్బాయి మరో అమ్మాయిని పుస్తకమో, నోట్సో, ఏదో అడగడానికి అష్టవంకర్లు తిరగడం చూసి, ఆ అమ్మాయి నటు వెళ్ళనిచ్చి అబ్బాయిని కసురుకున్నాడు మహేశ్. "అరే! ఆ అమ్మాయి నిన్ను మింగేస్తుందా ఏమిట్రా అలా కంగారుపడిపోతున్నావ్" అని.

"నీకేమోయ్. పెద్ద చెప్పొచ్చావు. నువ్వు, నీ స్నేహితుడు ఇద్దరికీ కలిపి ఒకే గర్ల్‌ఫ్రెండ్ దొరికింది. మీ కింకెవరూ కనిపించరు" అన్నాడు నోరు జారి. అంతే! భూమి, ఆకాశం ఏకం అయిపోయాయి.

"రాస్కెల్! కనిపించిన ప్రతీ అమ్మాయీ, స్నేహంచేసిన ప్రతి ఆడపిల్ల గర్ల్‌ఫ్రెండేనట్రా. అసలు నీకు స్నేహానికి అర్థం తెలుసా! విద్య అంటే.... నేను ఎలాచూస్తానో చెప్పినా అసలు నీ కేమి అర్థమవుతుందిరా," అంటూ, ఆ అబ్బాయిని పడతోసి పిడిగుద్దులతో శాస్తిచేశాడు.

కొస్త ముందుకు నడిచి వెళుతూఉన్న తనూ, సత్యం వచ్చి విడిపించక పోతే, ఆ కోపంలో అతనింకా ఏం చేసిఉండేవాడో!

* * *

మహేశ్ భోజనప్రియుడు. మంచి భోజనం కోసం ఎంతదూరమయినా వెళ్ళడానికి వెనుకాడడు.

ఆవేళ బాగా ఆకలిగా ఉందని, ఆఫీస్‌నుండి అయిదుమైళ్ళ దూరంలో ఉన్న హోటలుకివెళ్ళి చికెన్ బిర్యానీ తినివచ్చాడు.

ఆఫీసులో ఉన్న అన్నిగదుల్లోకీ పెద్దది మహేశ్‌కు కేటాయించబడింది. సత్యమూర్తి గదికన్నా చక్కగా, అందంగా, ఖరీదయిన ఫర్నిషింగ్‌తో అలంక రింపబడి ఉంటుంది. అలా ఉండటం వ్యాపారరీత్యా అవసరం కూడా.

కంపెనీకి వచ్చే కస్టమర్లు, కంపెనీ నుండి ఆర్డర్లు తీసుకునే పార్టీలలో ముఖ్యమయినవారు ఎవరొచ్చినా కలిసేది మహేశ్‌నే. సాధారణంగా, వాళ్ళకు నేరుగా సత్యమూర్తిని చూసితీరాల్సిన అవసరం చాలా తక్కువగా ఉంటుంది. హోదారీత్యా తనతో సమానస్థాయిలో ఉన్నవారిని, ఎక్కువ విలువగల ఆర్డర్లు ఇచ్చే పెద్దకంపెనీల అధిపతులను మాత్రమే అతను ఏ ఫైవ్‌స్టార్ హోటల్లోనో డిన్నరో, పార్టీయో ఏర్పాటుచేసి కలుసుకుంటాడు.

అందుకని ఆఫీసు మొత్తానికి మహేశ్‌గది 'షోవిండో' లాంటి దన్న

మాట. మహేశ్ కూడా ఆ గదిలో, తన స్థలంలో ఇమిడిపోయే విధంగా ట్రిమ్‌గా తయారవుతుంటాడు.

అతని గదిని రెండు భాగాలుగా విభజిస్తే, ఒక వైపు అతని రైటింగ్ టేబిల్సు స్వివెల్‌ఛేర్, టేబిల్‌కి రెండోవైపు మూడు కుర్చీలుంటాయి. రెండో భాగంలో, రౌండ్ టేబిల్ ఒకటి దానిచుట్టూ, కూచుంటే లోపలికి కూరుకుపోతాయా అనిపించేంత మెత్తని కుర్చీలు అయిదు ఉంటాయి. మహేశ్ అతిథులు వస్తే మాట్లాడేదీ, కూల్ డ్రింకో, కాఫీయో ఇచ్చి మర్యాదచేసేది ఇక్కడే.

బిజీ లంచ్‌టయిం ట్రాఫిక్‌లో అయిదుమైళ్ళు మోటర్ సైకిల్‌మీద ప్రయాణంచేసివచ్చాడేమో, చల్లగా ఉన్న ఏ.సి. రూంలో రౌండ్ టేబిల్‌మీదున్న కుర్చీ ఒకదాంట్లో, టేబిల్‌కిందగా కాళ్ళుచాచుకుని కూచుంటే హాయిగా ఉందని పించింది మహేశ్‌కి. సిగరెట్‌తీసి వెలిగించుకున్నాడు. తనకు ఖరీదయిన సిగరెట్ల రుచి నచ్చదు. అందుకనే, తన బ్రాండ్ ఒకటి, అతిథులు లేక సత్యమూర్తి అడిగితే ఇవ్వటానికి మరొరకం ఒకటి బల్లదగ్గిర పాకెట్లు ఎప్పుడూ ఉంటాయి.

కుర్చీలో జారగిలబడి కూచుని, కళ్ళుమూసుకుని, సిగరెట్టు పొగపీలుస్తూ, లోకాన్నే మరిచిపోయినవాడిలా, మౌనిలా, యోగిలా కూర్చుని ఉన్న మహేశ్‌ని ఫోన్‌మోత ఈ లోకంలోకి తీసుకొచ్చింది.

నింపాదిగా లేచి తన టేబిల్‌దగ్గరికి వెళ్ళి ఫోన్ అందుకున్నాడు. గ్రీన్ లాండ్ కాఫీ కంపెనీ, రీజినల్ మేనేజర్ మాట్లాడుతున్నాడు. మామూలు 'హలో హౌ ఆర్ యూ, ఫైన్ థాంక్‌యూలు' అయిన తర్వాత, "'మన్ పసంద్' ఏడ్స్, వచ్చేవారంలో పత్రికల కివ్వాలనుకున్నాం కదా? లేఅవుట్స్ రెడీ అయితే మా అప్రూవల్‌కి పంపించండి"

ఆ ఫైలు ఆ ఉదయమే మహేశ్ టేబిల్‌మీదికి వచ్చింది. అంతే లేఅవుట్స్ రెడీ అయినాయన్నమాట – అనుకుని, "అబ్బే! పంపించడ మేవిటి సార్.... నేనే స్వయంగా తీసుకొస్తాను. ఇదుగో మరోగంటలో బయలు దేరుతున్నా" అని మాట ఇచ్చేశాడు అవతలి మనిషికి.

ఫోన్ పెట్టెయ్యగానే 'మన్‌పసంద్' ఫోల్డర్ దగ్గరికి లాక్కున్నాడు. ఇంగ్లీషులోకి, హిందీ, తెలుగు, తమిళం, మళయాళం, కన్నడం మొత్తం ఆరు భాషల్లో తయారుచేసిన లేఅవుట్స్ ఉన్నాయి అందులో.

దేశంలో పెద్ద కాఫీ కంపెనీల్లో ఒకటయిన గ్రీన్‌లాండ్ కంపెనీవారు కొత్తగా కాఫీబిళ్ళలు తయారుచేస్తున్నారు. అవి మరో నెలరోజులకి మార్కెట్లోకి

వస్తాయి. వస్తువు మార్కెట్లోకి రాకముందే, దాని పేరునీ, లక్షణాలనీ, ప్రత్యేకతనీ, అమ్మటం ప్రారంభించాలి అన్నది మహేశ్ పాలసీ. ఇలా చేయటంవల్ల, కష్టమరే కొత్త ప్రాడక్ట్‌కోసం ఎదురుచూస్తుంటాడు కానీ, మార్కెట్‌లోకి వెళ్ళిన ప్రాడక్ట్ కొనేవాడికోసం, షాపు అరల్లో వేచివుండనక్కరలేదు అని అతని నమ్మకం. ఆ అడ్వర్‌టయిజ్‌మెంట్ ద్వారా అమ్మటాన్ని, అసలు అమ్మకం కన్నా చాలారోజులు ముందుగా ప్రారంభించాలి - అన్నది మహేశ్ తమతో వ్యాపారంచేసే ప్రతి కష్టమర్‌కి ముందుగా ఇచ్చే గట్టి సలహా.

ప్రతీ లేఅవుట్‌లో, ఆయా భాషల్లో పత్రికల్లో వచ్చే అడ్వటయిజ్‌మెంట్ ఎలా ఉండాలో సూచించబడి ఉంది.

తెల్లని గ్లాసీషీట్ మీద మధ్య 'మన్‌పసంద్' కాఫీబిళ్ళల పాకెట్ ఫోటో అతికించి ఉంది. పాకెట్ డిజైను తయారుచేసిందీ 'శ్రీవిద్య'లోనే. దానికి పైనా కిందా, 'మన్‌పసంద్' అని పెద్ద అక్షరాల్లో పేరు; "మీకు నచ్చే, మీరు మెచ్చేకాఫీ రుచి; ఇప్పుడు బిళ్ళల్లో దొరుకుతుంది; ఒక్కొక్క బిళ్ళ 10 పైసలుమాత్రమే; దేశంలో ప్రప్రథమంగా, గ్రీన్‌లాండ్ కాఫీ కంపెనీవారు తయారుచేసిన కాఫీ బిళ్ళలు; మీకోసం ప్రత్యేకం; 'మన్‌పసంద్' అని పేరుచెప్పి అడగండి-" అని అర్థం వచ్చేలా, ఆయా భాషల్లో ప్రింట్‌వేసిన అక్షరాలని కత్తిరించి, ఫోటోకి పైనా కిందా ఒక పద్ధతిలో అమర్చారు.

ఫోల్డర్ తెరవగానే కనిపించిన ఇంగ్లీష్ లేఅవుట్ చదవగానే మహేశ్ కనుబొమలు ముడివడినాయి.

ఆ కాయితాన్ని ఫోల్డర్లో మార్చి, విసురుగా దాన్ని చేతిలోకి తీసుకుని లేచి నిలుచున్నాడు. తలుపు తీసుకుని కారిడార్ అవతలున్న 'కాపీ సెక్షన్'కి వెళ్ళాడు. డజను టేబిళ్ళు, వాటిదగ్గర మనుషులు పనిచేసుకుంటున్నా ఇరుకు అనిపించని హాలు అది.

మహేశ్‌కి ఏ అవసరం వచ్చినా, కింది ఉద్యోగులను తన గదిలోకి పిలిచి మాట్లాడే అలవాటు లేదు. తనే ఏ సెక్షన్‌లో పనిఉంటే అక్కడికి నేరుగా వెళ్ళిపోతాడు. దీనివల్ల అతను కలుసుకునే ఆయా ఉద్యోగులకి కొన్ని ఇబ్బందులున్నాయి. అందులో ఒకటి, ఖర్మగాలి అతని కోపానికి గురికావలసివస్తే, అక్కడే మరో పదిమంది ఉద్యోగులముందు తిట్లుతినాల్సి రావటం.

పెద్ద పెద్ద అంగల్తో, బూట్లుశబ్దం చేస్తూ వస్తూన్న మహేశ్ రాకని గమనించి లేచి నిలుచున్నాడు కాపీసెక్షన్ హెడ్ కామరాజు.

"నువ్ ఎన్నేళ్ళనుంచీ కాపీరైటింగ్ చేస్తున్నావు?" ఉరిమినట్లుగా అడిగాడు. భయంతో వణికిపోతున్నాడు కామరాజు.

"మనసులోనే గుణించుకుని పన్నెండు సంవత్సరాలు అయింది సార్."

"అయితే ఈ కాపీలని కళ్ళుమూసుకుని అప్రూవ్ చేశావా?" అంటూ ఫోల్డర్ టేబిల్ మీదికి విసిరాడు.

అతను ఫోల్డర్‌లో ఉన్న షీట్లు అన్నీ తీసి టేబిల్ నిండుగా పరచుకుని ఆదుర్దాగా పరిశీలిస్తున్నాడు.

ఛెయిరొకటి లాక్కొని కూలబడ్డాడు మహేశ్. హాల్లో అంతటా నిశ్శబ్దంగా ఉంది. మిగతా టేబిల్స్ దగ్గరున్న ఆశా, సు... అంతా ఎవరిపనులు వారు చేసుకుంటున్నట్లు కనిపించినా, అందరి చెవులూ ఇటే ఉన్నాయి.

"ముందు కూచో చెబుతాను తప్పులకోసం వెతుకుతున్నావు కదూ? అసలు కాన్సెప్టే తప్పుగా ఉందయ్యా."

కాయితాల మీదినుంచీ దృష్టి మళ్ళించి, కళ్ళు పెద్దవిగా చేసి, మహేశ్ వయిపు చూశాడు కామరాజు మామూలుగా సీనియర్ కాపీరైటర్లు ఎవరికయినా ఉండే దళసరి కళ్ళద్దాలనే అతనూ ధరిస్తాడు. వాటిలోంచి అతని కళ్ళు మరీ పెద్దవిగా కన్పించి, మహేశ్‌కి కోపంపోయి, నవ్వు వచ్చింది.

"చూడు కామరాజూ! నీ కున్నన్ని క్వాలిఫికేషన్లు నాకు లేవు నాకు చదవగానే విషయం వెంటనే అర్థంకానంత స్టాండర్డు ఇంగ్లీషులో నువ్వు కాపీ వ్రాయిస్తే, మరే ప్రొడక్టో అయితే చాలా సంతోషించి ఉండేవాణ్ణి. ఇవి పది పైసలకొకటి అమ్మే కాఫీబిళ్ళలయ్యా బాబూ. వీటి నుపయోగించేది నువ్వు, నేను కాదు."

"అవి ఎవరికోసం నిర్దేశింపబడ్డాయో, ఆ క్లాస్ మనుషులను గుర్తులో ఉంచుకుని, వారికి అర్థంఅయే భాషలో వ్రాస్తే గదా, అసలు మెసేజ్ వాళ్ళకి అందేది?–

"మరి ఇంగ్లీషులో...."

"అదా? నేను ముందే చెప్పాను వాళ్ళకి, ఇంగ్లీషులో ఏడ్ రిలీజ్ చేయటమే వేస్ట్ అని. వాళ్ళు ఒప్పుకోలేదు. పేరుప్రఖ్యాతులున్న కంపెనీ కదూ? ఇంగ్లీషు పత్రికల్లోకి ఏడ్ వెళ్ళకపోతే బాగుండదుట. పోనీ మనమేం చేస్తాం? ఖర్చయేది వాళ్ళ సొమ్మే గద. ఇదుగో నువ్ మాత్రం ఈ లేఅవుట్ల సంగతి పూర్తిగా మర్చిపోయి, ఫ్రెష్‌గా సులభంగా అర్థంఅయ్యే విధంగా కాపీ తయారు

చేయించు .. ఇదుగో ఇక్కడ తెలుగు మాట్లాడేవాళ్ళెంతమంది ఉన్నారయ్యా" అని హాల్లో మిగతావాళ్ళ వైపు తిరిగాడు మహేశ్.

[illegible]ముందు పిలిపిలిగా నలుగురు లేచి నిలుచున్నారు. "ఊఁ ఒక్క సారికి మీ పద్ధతి మార్చుకోండి. 'కాపీ' ఇంగ్లీష్‌లో వద్దు. మీ నలుగురూ కలిసి కూర్చుని తెలుగులో రాయండి. చదువుకుంటే సింపుల్‌గా, క్లుప్తంగా ఉండాలి. దాన్ని ఆధారంగా పెట్టుకుని మిగతా అయిదు భాషల్లోకి ట్రాన్స్లేషన్ జరగాలి. ఓకే.... మీరు ఎలా చేస్తారో ఏమో నాకు తెలీదు. రేపు ఉదయం నేను వచ్చేసరికి లేఅవుట్స్ నా టేబుల్‌మీద ఉండాలి" అనేసి అక్కడినుంచి కదిలాడు మహేశ్.

జరుగుతున్న ఆలస్యానికి క్షమాపణ చెప్పుకుందుకు, గ్రీన్‌లాండ్ ఆఫీస్ నంబరు డయల్‌చేశాడు.

* * *

అది స్టూడియో సెక్షన్లో ప్రొజెక్షన్ రూం.

పేరుకు గది అంటమే గానీ అక్కడ ఇరవయిమంది దాకా కూచుని ఎదురుగా ఉన్న 16 మిల్లిమీటర్ల స్క్రీన్‌మీద ప్రొజెక్ట్ అయే ఫిల్మ్ చూడవచ్చును


చివరి వరసలో ఉన్న కుర్చీల్లో సత్యమూర్తి, మహేశ్ కూర్చుని ఉన్నారు. అంతకుముందే స్టూడియో మేనేజర్ జలాలుద్దీన్ తెప్పించి అందించిన టీ కప్పులు ఇద్దరి చేతుల్లో ఉన్నాయి.

ఇద్దరి దృష్టి ఎదురుగా తెల్లటి స్క్రీన్‌మీద ఉంది.

'అడ్వర్టయిజ్‌మెంట్ షార్ట్' మొదలయింది. ఎదురుగా స్క్రీన్‌మీద బొమ్మ, దానివెంట సంగీతం, మాటలు కూడా వస్తున్నాయి.

మొదటి షాట్‌లో, చంటిబిడ్డకు పాలిస్తున్న తల్లి పాలరాతి విగ్రహం, కెమెరా బొమ్మ కుడివైపు యాంగిల్‌నుంచి క్లోజ్‌గా చూపి, సుందరి ముఖాముఖి వచ్చేస్తుంది. అంతదాకా సంగీతం వస్తూ ఒక స్త్రీ తీయని స్వరంలో మాటలు "మీ బిడ్డకు తల్లిపాలకన్నా మించిన శ్రేష్ఠమయిన ఆహారం మరేదీ లేదు" అంటుంది.

రెండవ షాట్‌లో బొద్దుగా ముద్దుగా ఉయ్యాలలో ఊగుతున్న పాప. పక్కన ఉయ్యాల ఊపుతూ, వాత్సల్యంతో ప్రేమగా చూస్తున్న అందమయిన తల్లి. చక్కని సంగీతం వినిపిస్తుంటుంది.



మూడవ షాట్‌లో తల్లీ, బిడ్డ లిద్దరి క్లోజప్‌లు వేర్వేరుగా. "తానీ పెరిగే మీ పాపకు.... ." అని వినిపిస్తుంది.

నాలుగవ షాట్‌లో, తల్లి బిడ్డను చేతుల్లోకి తీసుకుంటుంది. "మీ దగ్గర పాలు సరిపోనప్పుడు " సంగీతం తీవ్రత ఎక్కువవుతుంది.

ఐదవ షాట్‌లో. 'మధురా' మిల్క్ పౌడర్ డబ్బాలు రెండు సైజుల్లో, చాలా దూరంలో ఉండి, కెమెరా దగ్గరిక క్లోజప్‌లోకి వస్తాయి. సంగీతం అదే తీవ్రస్థాయిలో "'మధుర ' ఉపయోగించండి" అని వినిపిస్తుంది. 'మధురా' అన్న పదం స్పష్టంగా, మృదువుగా వినిపిస్తుంది.

ఆరో షాట్‌లో. పైన ఉయ్యాలలో చూపిన పాప మంచంమీద తల్లి ఒడిలో పడుకుని ఫీడర్‌లోంచి పాలు తాగుతూ ఉంటుంది. సంగీతం వేగం తగ్గుతుంది. "ప్రొటీన్లు, విటమిన్లు సమృద్ధిగా గల పాలపొడితో, మీ పాప ఇష్ట పడే రుచిలో పాలు"

అదే షాట్‌లో కెమెరా ఆ గదిలోనే మూలగా ఒక టేబిల్‌మీదున్న 'మధురా' పాలపొడి డబ్బామీదికి వెళుతుంది. "తల్లిపాల తర్వాత అత్యుత్తమ మయినది 'మధురా'"

చివరి షాట్‌లో పాలుతాగి సంతృప్తిగా నవ్వుతున్న పాప క్లోజప్. మళ్ళీ కొద్దిగా సంగీతం తీవ్రత హెచ్చి ఆగిపోతుంది.

సరిగ్గా ఒక్క నిముషంలో 'షార్ట్' అయిపోయింది.

"ఫోటోగ్రఫీ సెట్స్ అరేంజిమెంట్ ఫరవాలేదు. బాగున్నాయి కదూ" అన్నాడు మహేశ్. అతనీ 'ఫిల్మ్'ని తయారు అయే దశల్లోనే రెండుసార్లు అయిన తరువాత మూడుసార్లు చూశాడు. ఇవాళొచ్చింది సత్యమూర్తికి చెంపెనీగా.

"ఇంకోసారి స్టార్ట్ చేయించేదా సర్" అడుగుతున్నాడు జలాలుద్దీన్.

సత్యమూర్తి వాచీ చూసుకుంటూ "వద్దులే" అని అతనికి చెప్పి లేచి నిలుచుంటూ "ఏమిటో మహేశ్, మనం ఇట్లా హైక్లాస్ పోష్ సెట్టింగ్స్‌తో షూట్ చేస్తాంగానీ నిజానికి ఈ పాలపొడి డబ్బాలు ఎక్కువగా కొని ఉపయోగించేది మధ్యతరగతివాళ్ళు" అన్నాడు.

"మనం అలా చెబితే క్లయింట్స్ ఊరుకోరయ్యా. బాక్‌గ్రౌండ్‌లో ఏ మాత్రం అందం, మోడల్‌కి ఏ మాత్రం అలంకరణ తగ్గినా ఫిలిం తిప్పికొడతారు. ప్రేక్షకులయినా అంతే. ఈ స్టైల్లోనే 'ఏడ్స్' చూడటం వాళ్ళకి అలవాటుగా మారిపోయింది. మరో విధంగా ఉంటే చూసేదెవరు?"

ఇద్దరూ కలిసి సత్యమూర్తి గదిలోకి వెళ్ళారు.

అక్కడ మామూలుగా సత్యమూర్తి ఆ సమయంలో ఆఫీసులో తీసుకునే కాఫీ రెండు కప్పుల్లో తయారుగా ఉంది.

ఇద్దరూ చెరొకటి తీసుకున్నారు. 'అడ్వటయిజ్‌మెంట్ ఏజన్సీ' ఆఫీసుల్లో కాఫీ, టీలకి హద్దు ఉండదు. సిగరెట్లకి నిషేధం ఉండదు.

ప్రతి నిముషం సత్యం వాచీ చూసుకోవటం గమనించాడు మహేశ్. అప్పుడే చూశాడు, సత్యం వేసుకున్నది మామూలు బిజినెస్ సూట్ కాదు. కొద్దిగా ఫర్‌ఫ్యూమ్ వాసన కూడా వస్తోంది.

"విద్య షాపింగ్‌కి కాబోలు వెళ్ళాలని చెప్పింది. కాస్త నువెళ్ళి తీసుకెళ్ళు మహేశ్. పూర్ణిమను వెళ్ళమందామంటే, ఆ అమ్మాయి ఈ రోజే ఏదో పనుందని ముందే వెళ్ళిపోయింది."

జేబుల్లో తడిమి చూసుకున్నాడు. "సిగిరెట్లు ఉన్నాయా?"

తన దగ్గరున్న పాకెట్ తీసి సత్యమూర్తికి అందించాడు మహేశ్, అతను కారు తాళాలు మహేశ్ చేతికిస్తూ "నువు కారు తీసుకెళ్ళు" అన్నాడు.

'ఇంకా ఉంటే అసలింత హడావిడిగా నువ్వు ఎక్కడికి వెళుతున్నావ్?' అని, మహేశ్ ఎక్కడ అడుగుతాడో అని భయపడుతున్నవాడిలా "నే వస్తా" అంటూ బయటికి నడిచాడు సత్యమూర్తి

మహేశ్ కప్పు ఇంకా ఖాళీ అవలేదు. అందుకని అక్కడే కూచున్నాడు.

ఫోన్ రింగయింది. విద్య కాబోలు అనుకుని రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు.

"హలో సత్యం.... మీరేనా? ఏమిటింత ఆలస్యం? నేను మీ కోసం ఎంతసేపట్నించీ ఎదురుచూస్తున్నానో తెలుసా?"

మౌనంగా వింటున్నాడు మహేశ్. అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

"ఏమిటి మాట్లాడరే.... నేను సులభను సార్.... ఇవాళ నా బర్త్ డే అనీ మిమ్మల్ని మాత్రమే పార్టీకి ఆహ్వానించానని గుర్తుందా అసలు."

"సత్యానికి ఆహ్వానాలు మరచిపోయే అలవాటు లేదు మేడమ్. అతనిప్పుడే బయలుదేరాడు" అని తాపీగా చెప్పి ఫోన్ పెట్టాడు.

ఎవరీ సులభ? తనకు తెలియకుండా సత్యమూర్తి కింత స్నేహితురా లెప్పుడయింది ?

మామూలుగా ఆఫీసులోనో, బయటో ఏదయినా పనిలో బిజీగా ఉన్నప్పుడు, విద్య ఎటయినా వెళ్ళాలంటే, ఆమెకు తోడుగా పూర్ణిమనో, మహేశ్‌నో కోరటం మామూలే.

కానీ తనకు తెలిసినంతవరకు అతను బిజీగ ఏం లేడీరోజు. పైగా ఈవిడెవరో బర్త్‌డే పార్టీ అంటోంది. అందులో ఈయన్ను మాత్రమే ఆహ్వానించిందట. ఈ 'ఇంటిమెసీ'ని ఏమనుకోవాలి? అర్థంకాకుండా ఉంది మహేశ్‌కి.

సులభ.... ఎక్కడో విన్నట్లుగా ఉందీ పేరు.... ఏమో గుర్తు రావటం లేదు స్వరం చూడబోతే ప్రౌఢ యువతిదిలాగుంది. ఆమెగారితో ఈయన స్నేహం ఎలాంటిదో.... సమయం చూసుకుని అడగాలి.

ఏమంటాడో! కోపం వస్తుందేమో! నన్ ఆఫ్ యువర్ బిజినెస్ అంటాడా? అననీ అలా అయినా అసలు గుట్టు బయటికొస్తుంది. విద్యకు అన్యాయం జరుగుతుంటే మాత్రం తను చూస్తూ ఊరుకోలేడు.

*　　　*　　　*

ఆవేళ శనివారం.

సులభ బర్త్‌డే తర్వాత వచ్చిన నాలుగో శనివారం అది.

ప్రతీ శనివారం సాయంత్రం, ఆఫీస్‌నుండీ నేరుగా సులభ దగ్గిరికి వెళ్ళటం అలవాటుగా మారిపోయింది, సత్యమూర్తికి.

అప్పటిదాకా సాయంత్రం ఇద్దరూ కలిసి చూసిన 'గాడ్‌ఫాదర్' సినిమా

గురించే మాట్లాడి, అప్పుడే నిద్రపోయింది సులభ. పక్కనే, ఆమె చేతిని తన మెడచుట్టూ వేసుకుని పడుకుని, ఆలోచిస్తున్నాడు సత్యమూర్తి

సులభది గొప్ప అందమేమీ కాదు. ఎక్కువ అలంకరణకూడా చేసుకోదు. అయినా ఏదో ఆకర్షణ ఉంది ఆమెలో.. అదే తన నిలా ఆమెకు దగ్గరచేసింది.

తను స్నేహం ఇంతదూరం వెళుతుందని అతను ఊహించనేలేదు. సులభ చిన్నపిల్లేంకాదు. కానీ పెళ్ళికావలసిన యువతి.... అటువంటి ఆమెకు ఈ పిచ్చి ఏమిటో !

అసలు కథ, ఆమె బర్త్‌డేరోజు ఆరంభమయింది

సాయంత్రం అయిదింటికి సత్యమూర్తి సులభ ఫ్లాట్ చేరుకున్నాడు. ఆ ఉదయం ఆమె నిద్రలేచేసరికి, తన తరఫున పెద్ద పూలగుచ్ఛం ఒకటి ఆమెకు అందేలా ఏర్పాటు చేసిఉంచాడు.

అతను వెళ్ళేసరికి సులభ ఆ పూవులను అమర్చిన వేజ్‌వంక చూస్తూ కూర్చుని ఉంది.

"హాపీ బర్త్‌డే టు యూ" అని అతను ఆమె చేయి పట్టుకుని అంటే, "మీరు పంపిన పూవులు చాలా బాగున్నాయి" అన్నది చిరునవ్వుతో.

"ఏదేమిటి పార్టీ ఇలాగేనా చేసుకునేది?"

"అంతే! ఈ సారి మీరున్నారు. మామూలుగా ప్రతీ ఏడు ఒక్కదాన్నే కూర్చుని కేక్‌కోసేస్తాను. ఒకోసారి పుట్టినరోజుని పూర్తిగా మరచిపోతానుకూడా."

"నిజంగా.. "

"అంతే. అంతా పరిచయస్థులే తప్ప, స్నేహితులు లేరు. బంధువులు లేరు. ఏం చెయను మరి?... మా అమ్మ ఎలా ఉంటుందో నాకు తెలీదు. నాదీపోయి అయిదు సంవత్సరాలు అయింది."

"అయామ్ సారీ" అన్నాడు సులభ కళ్ళలో నీళ్ళు చూసి.

అంతలోనే మూడ్ మార్చుకుని "రండి. ముందు కాఫీ తీసుకుందురు. తర్వాత కేక్ కోయుద్దురు గాని ..." అని హుషారుగా అతని చేయిపట్టుకుని వంట గదిలోకి దారితీసింది.

ఇవాళ మొదటిసారిగా ఆమెను చీరలో చూస్తున్నాడు సత్యమూర్తి. మామూలుగా ఆఫీస్‌లో అయితే సెల్వార్ కమీజో, జీన్సో, మిడీ ఫ్రాకో వేసుకుని ఉంటుంది.

ఆమె ఇచ్చిన కాఫీ సిప్‌చేస్తూ, "అయితే నీకు చీరకట్టుకోవడం కూడా వచ్చా?"



"ఏం? నే నంబు చీరలే కట్టుకోననుకున్నారా? భలేవారే!"

కేక్ కోసి, ఒక ముక్క అతని నోటికి అందించింది. తనూ ఒక ముక్క తీసి ఆమెకు తినిపించాడు.

"ఇప్పుడు చెప్పండి నాకు బహుమతి ఏం తెచ్చారో?"

అప్పుడే గుర్తొచ్చినవాడిలా, జేబులోంచి చిన్న బాక్స్ ఒకటి బయటికి తీసాడు సత్యమూర్తి. మూత తీసి ఆమెకు చూపించాడు. అందులో ఉన్నది ఒకే ముత్యం పొదిగిన ఉంగరం.

అసంకల్పితంగా వేళ్ళని అతనిముందుకు చాచింది.

కాని అతనుమాత్రం బాక్స్‌ని ఆమెచేతికి అందిస్తూ, "ఉహూ, ఉంగరం పెట్టవలసింది నేను కాదు," అన్నాడు చిరునవ్వుతో.

ఎందుకో ఆమె ముఖం ముడుచుకుపోవటం గమనించాడు సత్యమూర్తి. మౌనంగా లేచి వెళ్ళి, బాక్స్‌ని లోపల బీరువాలో ఉంచేసి వచ్చింది. కోపం వచ్చిందేమో, లేకపోతే తనే తీసి వేలికి పెట్టుకోవచ్చు గదా? అనుకున్నాడు.

"డిన్నర్‌కి టేబిల్ బుక్‌చేయమని ఫోన్‌చేయనా సులభా. షిర్డికి చేద్దామా?"

"ఉహూ, వద్దు."

"పోనీ ఈస్ట్‌వెస్ట్?"

"వెస్టెండ్, శ్రీరామా కూడా వద్దు.... నేనొక చోటికి తీసికెళతాను రండి... కొంచెం దూరం అయినా ప్రశాంతంగా ఉంటుంది."

"నీ ఇష్టం.... అంతవరకూ ఏం చేద్దాం?"

"మీకోసం ఐస్‌క్రీమ్ తయారుచేసి ఉంచాను. కాసిని ఫ్రూట్స్ వేసుకుని దానివెంట కాస్సేపు కబుర్లతో ఛోంచేద్దాం."

ఆమెవెంటే వంటగదిలోకి వెళ్ళి డైనింగ్ టేబిల్‌ముందు కూచున్నాడు.

ఆపిల్ తీసుకుని చెక్కుతీస్తున్న సులభవయిపు చూస్తూ కూర్చున్నాడు. లేత బూడిదరంగుమీద నలుపురంగు పువ్వులున్న అమెరికన్ క్రేప్ చీర, నలుపు రంగు బ్లవుజ్‌లో, మామూలుకన్నా కొంచం బొద్దుగా కనిపిస్తోంది. మెడనుంచీ కొద్దిగా క్రిందిదాకా మాత్రమే ఉండే బాబ్‌చేసిన జుట్టును కుదురుగా దువ్వి, రబ్బర్ బేండ్లతో బిగించి చిన్నముడిలా వేసుకుంది. ముఖంలో కొత్త సంతోషం ఏదో కనిపిస్తోంది. అదే సత్యమూర్తికి అర్థంకాకుండా ఉంది.

"బిజినెస్ ఎలా ఉంది?"

"మాకేమండీ. మీ ఏడ్ కంపెనీలు బాగా జరుగున్నంతసేపు, మాకు ఢోకా లేదు."

"ఈ మధ్య ట్రాన్స్లేషన్ రేట్లు పెంచినట్లున్నారు కదూ మీ కంపెనీలో."

"పెంచక తప్పలేదు సార్. ట్రాన్స్లేటర్లకి డిమాండ్ పెరిగిపోతోంది. ఎక్కువ సేలరీలు డిమాండ్ చేస్తున్నారు. కొత్తవాళ్ళని. ఫ్రెష్ గ్రాడ్యుయేట్లవీ తీసుకుని చచ్చీ, చెడీ ట్రెయినింగ్ ఇస్తే, వాళ్ళు మరో లాంగ్వేజి ఫర్మ్‌కో మరోచోట కాపీరైటర్లగానో పరిగెత్తి పోతున్నారు. అందుకని కొత్త పద్ధతొకటి మొదలుపెట్టాంలెండి."

"ఒక పదిమంది దాకా పార్ట్‌టైమ్ ట్రాన్స్‌లేటర్లని తీసుకున్నాను. అంతా వేరేచోట్ల మరో జాబ్ చేసేవాళ్ళు ఉదయమో సాయంత్రమో, ఎవరి అనుకూలాన్నిబట్టి వాళ్ళు వచ్చేఏర్పాటు చేశాను."

ఆ మాటలు సత్యమూర్తిలో పాతజ్ఞాపకాలేవో బయటికి తీశాయి. ఒకప్పుడు, అతనూ అలా ఒక ఏడ్ ఏజన్సీలో, పార్ట్‌టైం ట్రాన్స్‌లేటర్‌గా చేసింది గుర్తొచ్చింది.

"మొత్తానికి గట్టివారే మీరు 'మలయ' మోటర్స్‌వారి చిన్నకారు ప్రాజక్ట్ సంపాదించారు. కాపీలు కొంచెం త్వరగా తయారుచేయించి పంపమని మీ కాపీ సెక్షన్‌కి డైరెక్షన్ ఇవ్వండి. మీ వాళ్ళకి ఎప్పుడూ, ఆలస్యంగా కాపీలు ఇచ్చి, అర్జంటుగా ట్రాన్స్‌లేషన్లు కావాలని గొంతుకమీద కూచోవటం అలవాటు."

"బాబోయ్ అటాక్ నా మీదికి తిప్పారా? పోనీ నెలరోజులు టయిం ఇమ్మని చెబుతాను, సరేనా?"

"ఏం ఒద్దు. అన్నిరోజులు టయిం యిస్తే, మా వాళ్ళు వీటి తలలమీద పెద్ద పెద్ద పేపరువెయిట్లు పెట్టేసి, వాటిసంగతి మరిచిపోతారు" అని అంటున్న సులభ తీరుచూసి హాయిగా నవ్వేశాడు సత్యమూర్తి.

"నీ కిట్లా ఆఫీస్ బయటా ఇంట్లో కూడా వ్యాపారవిషయాలే చర్చించటం బోర్‌కొట్టదా?" అని అడిగాడు.

"బోరా? ఎందుకు? మనం రోజుకు యాభయిశాతం పయిన గడిపేది బిజినెస్ ప్రపంచంలో మిగతా సమయంలో వాటిని గురించి మాట్లాడకుండా ఎలా ఉంటాం?"

వెంటనే ఆమెను విద్యతో పోల్చి చూడకుండా ఉండలేకపోయాడు సత్యమూర్తి. ఇంట్లో ఆఫీసు విషయాలు మాట్లాడితే నచ్చదు విద్యకు. "ఎప్పుడూ ఆ ఆలోచనలేనా? వేరే ఏదయినా చెప్పండి" అంటుంది విసుగ్గా. దానివల్ల, ఇద్దరిమధ్యా ఒకోసారి చెప్పుకునేందుకు మాటలే మిగలవు. ఆ విషయంమీద ఇంట్లో ఎన్నో కోల్డ్‌వార్లు జరిగాయి.

తర్వాత ఇద్దరూ సులభకార్లో బయలుదేరారు.

అశోక, విండ్సర్‌మేనర్ హోటల్స్ దాటుకుని, గుట్టహళ్ళి మీదుగా, మేఖ్రీ సర్కిల్‌లో ఉన్న ఒక రెస్టారెంటు దగ్గరికి తీసుకెళ్ళింది.

ఊరి అవతలున్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కి వెళ్ళాలంటే సిటీలో ఏ భాగం నుంచీ అయినా ఈ సర్కిల్ మీదుగా వెళ్ళాల్సిందే. సత్యమూర్తి ఎన్నోసార్లు

ఇటుగా వెళుతూనే ఉంటాడు. కానీ ఇక్కడ ఇలాంటి రెస్టారెంట్ ఒకటుందని అతను ఎప్పుడూ గమనించలేదు.

అది బార్ అండ్ రెస్టారెంటు.

మెనూ సులభ చేతికిచ్చి, ఎదురుగా బార్ షెల్ఫుల్లో కన్పిస్తున్న రకరకాల సీసాల వయిపు చూస్తూ కూర్చున్నాడు సత్యమూర్తి.

బేరర్ రాగానే లెమన్ ఆర్డర్ ఇచ్చింది సులభ మాట్లాడకుండా కూర్చున్న సత్యాన్ని చూసి "డ్రింక్ ఏమీ తీసుకోరా?" అడిగింది.

ఆశ్చర్యంగా చూశాడు సత్యం.

"నాకేం అభ్యంతరం లేదు. మీరు మితిమీరి తాగరనీ, అనేక అలవాటేం కాదనీ నాకు తెలుసు" అన్నది.

ఐయిస్ ముక్కలు, సోడా నురగలు ఉరకలేస్తున్న తన డ్రింక్ గ్లాసుని, సులభకోసం వచ్చిన కోలా గ్లాసుకు తాకి 'ఛీర్స్' చెప్పుకున్నారు.

డిమ్‌గా ఉన్న నీలిరంగు లయిట్ల వెలుతుర్లో జనం చాలా పలచగా ఉన్న ఆ హోటల్లో, ఒక చివర టేబిల్ దగ్గర కూచుని ఉన్నారు ఇద్దరూ. అలా కూచుని సులభతో కబుర్లుచెబుతూ ఉంటే హాయిగా మరేదో లోకంలో ఉన్నట్లుంది సత్యమూర్తికి. అతని కిప్పుడు విద్య గుర్తురావటంలేదు.

సడన్‌గా మాటలు ఆపేసి, కొద్దిగా ఎర్రబారిన సత్యమూర్తి కళ్ళలోకి చూస్తూ కూర్చుంది సులభ. కరెంటు పోయింది. మరునిముషంలో టేబిల్స్‌మీద కాండిల్స్ వచ్చేసాయి.

దాంతో ఏదో మత్తు ఆవహించినట్లయింది సులభకు.

టేబిల్‌మీద ఆనించిన అతని చేతిని అందుకుని, "నే నొకటి అడుగుతాను ఏమీ అనుకోరుగా?" అన్నది తలవంచుకుని

"చెప్పు సులభా! ఏమిటి?" సత్యమూర్తిలో ఆత్రుత.

"ఈ రాత్రికి నాతోనే ఉండిపోవాలి" అతని కళ్ళల్లో చూపులు కలిపి చూస్తూ.

"సులభా! ఆర్ యూ క్రేజీ?"

"అవును.. ఐ యామ్ క్రేజీ అబౌట్ యూ."

"...... ... ... ..."

"మీ కమిట్‌మెంట్స్ అన్నీ నాకు తెలుసు. నేను మరో బరువుగా మారను. నాకు మీ స్నేహం, ప్రేమ, సాన్నిహిత్యం కావాలి. అంతే సత్యం ఇలా కోరు

కోవడం తప్పేమో నాకు తెలీదు. మీకు నేనంటే ఇష్టంలేకపోయినా, అసహ్యం లేదని తెలుసు అందుకనే అలా అడగగలిగాను" సులభ స్వరం జీరబోతోంది.

"ఛీ! ఎం మాటలవి. నువంటే నా కెంత ఇష్టమో నీకేం తెలుసు. పద పోదాం అని లేవదీశా"

సులభ చేతిలో చేయి కలిపి కారు దగ్గరికి నడిపించాడు.

ఈ సారి సులభ డ్రైవింగ్‌సీట్లో కూర్చోలేదు.

సత్యమూర్తి డ్రైవ్‌చేస్తోంటే, అతని పక్కన అతని భుజానికి తల ఆన్చుకుని కూర్చుంది సులభ. మాటలేవీ ఎక్కువగా సాగలేదు. ఇద్దరి మన సుల్లో ఉన్న సంభ్రమం, వారి పెదవులు దాటి మాటల్ని రానివ్వకుండా లోపలే అదిమిపెడుతోంది.

సత్యమూర్తి కిది విచిత్రంగా ఉంది.

నిజానికి మనసు బయటపెట్టి అడిగింది సులభే అయినా తన మనసులో ఇన్నాళ్ళూ ఉన్న భావం అదేనేమో అనిపిస్తోంది. ఏమీ లేనిదే ఆమె కింత సన్ని హితంగా వచ్చిఉండేవాడు కాదు!

అపార్ట్‌మెంట్ తలుపులు తీసుకుని లోపలికి వెళ్ళగానే సులభని దగ్గరికి తీసుకుని ఆమె పెదాలను ముద్దుపెట్టుకున్నాడు సత్యమూర్తి. ఆమె వేసుకున్న లిప్‌స్టిక్ వాసన, రుచీ తెలిసి తమాషాగా అనిపించింది. విద్యకి లిప్‌స్టిక్ అలవాటు లేదు.

"ఇందుకోసం ఎన్నాళ్ళుగా పిచ్చెక్కిపోతున్నానో తెలుసా!" అంది. అతని భుజాలచుట్టూ ఉన్న చేతులు తీయకుండా అలాగే చూస్తూ నిలుచుండి పోయింది

హఠాత్తుగా, "ప్రామిస్! సత్యం . ఈ విషయం ఎవ్వరికీ తెలియ నివ్వను" అని ఒకరకంలో తన చేతి నుంచి అన్నది సులభ

"ఏమిటీ? నేను నిన్ను ముద్దుపెట్టుకున్న విషయమా?" అన్నాడు సత్యం చిలిపిగా నవ్వుతూ.

"కాదులే, ఉండు ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళి. సాయంత్రం దాచిఉంచిన ఉంగరం బాక్స్‌ను తీసుకొచ్చింది.

"దీన్ని పెట్టాల్సింది మీరే గానీ పెట్టెయ్యండి" అని దాన్ని అతనికి అందించింది.

అతను ఉంగరం ఏన వేలికి తొడిగిన తర్వాత, "దీన్ని గాంధర్వ వివాహం అంటారు కదూ మన పురాణాల్లో" అని నవ్వింది.

* * *

సత్యమూర్తి ఊళ్ళో లేడు,

విద్య నొకసారి పలకరించుదామని ఇంటికి వెళ్ళాడు మహేశ్.

అప్పుడే నిద్రలేచినట్లుగా ఉంది విద్య ముఖం. జుట్టు, బట్టలు నలిగి పోయి ఉన్నాయి. డ్రాయింగ్ రూంలో కూచుని కాఫీ తాగుతోంది. మహేశ్‌ని చూడగానే ఆమె ముఖం వికసించింది.

"రా మహేశ్" అని ఆహ్వానించింది. టిఫిన్, కాఫీ తెమ్మని పనిమనిషికి పురమాయించింది.

ఆమె ముందరున్న టీపాయ్‌మీద నాలుగైదు మాగజైన్లు, కాయితాలూడి చిరిగిపోయినవి పడిఉన్నాయి.

మహేశ్ ఆశ్చర్యంగా వాటివయిపు చూడటం గమనించి, "నేనే చింపే సాను. కోపం వచ్చి విసిరేశాను" అన్నది విద్య ఎటో చూస్తూ.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? సగం పుస్తకంనిండా అడ్వటయిజుమెంట్లు. మిగతా సగాన్ని చెత్తతో నింపుతారు. నాలుగు మాగజయిన్లు చదివితే, నాలుగింట్లో ఒకే రకం బోరు కథలే, తలనొప్పి వచ్చేసింది అవి చదివి, అందుకని...."

"అందుకని నిద్రమాత్ర వేసుకుని నిద్రపోయావు కదూ?"


"అవును.... నీ కెట్లా తెలుసు? అదే వేసుకోకుంటే నిద్ర రాదు. నిద్ర రాకుంటే ఏంచేయాలో తోచదు. ఇంట్లో పనివాళ్ళను మాన్పించి నేనే చేసు కుంటానంటే సత్యం ఒప్పుకోడు. అది నామీద ప్రేమో, వాళ్ళమీద అభి మానమో నాకు మాత్రం తెలీదు."

"అది సరే నీ కసలు మాత్రలెలా దొరుకుతున్నయి?"

"డాక్టరు రాసిస్తాడు. షాప్‌లో అమ్ముతారు. తెప్పిస్తాను" అదేమంత పెద్ద విషయం కాదన్నట్లు తేలిగ్గా అన్నది విద్య

"ఈ ఇంట్లో ఒక్కదాన్ని ఉండి ఉండీ విసుగ్గా ఉంది. కాస్సేపు ఎటు అయినా తీసుకెళ్ళు మహేశ్."

ఒక్క క్షణం ఆలోచించి, "ఓకే! త్వరగా తయారవు. లాల్‌భాగ్‌కి పోదాం."




విద్య అయిదు నిముషాల్లో తయారయి వచ్చింది.

లేత ఆకుపచ్చరంగు లతలు ఎంబ్రాయిడరీ చేసిన తెల్లని ఆర్గండీ చీర, లేత ఆకుపచ్చ జాకెట్ వేసుకుని అంతదాకా ముడేసిఉన్న జుట్టుని జడగా అల్లుకుని వచ్చింది. కారు తాళాలు మహేశ్ చేతికి అందించింది.

సాయంత్రపు బిజీ ట్రాఫిక్‌లోంచి దాటుకుని కారును లాల్‌బాగ్ వెస్ట్ గేట్‌లోంచి లోపలికి పోనిచ్చి ఆపాడు మహేశ్.

ఇద్దరూ కారు దిగి తోట లోపలి భాగానికి దారితీసే తారురోడ్డు వెంట నడక సాగించారు. ఎదురుగా గ్లాస్‌హవుస్ వెనుకభాగం కనిపిస్తుంది.

కొద్దిదూరం నడిచేసరికే అలసిపోయినట్లుగా కనిపించింది విద్యముఖం. ప్రశ్నార్థకంగా చూస్తున్న మహేశ్‌తో "నా కాళ్ళకి నడక అలవాటు పూర్తిగా తప్పిపోయింది మహేశ్. కొన్నాళ్ళయితే పూర్తిగా పారలైజ్ అవుతా యేమో!" అన్నది.

"ఛీ! ఏం మాటలవి. రా అలా కూర్చుందాం" అని ఒక రాతిబెంచీ చూపించాడు. కాస్త దూరంలో అయిస్‌క్రీమ్ పార్లర్ కనిపిస్తోంది. "నువ్విలా కూచో. నే నేదయినా తీసుకొస్తాను" అని ముందుకు నడిచిన మహేశ్‌వైపు చూస్తూ బెంచీమీద కూర్చుంది విద్య.

అతను కొంచం పొట్టిగా, బొద్దుగా ఉంటాడు. నడిచేటప్పుడు చేతులు ఎక్కువగా ఊపుతుంటాడు. ఒకప్పుడు మిలటరీలో చేరాలని చాలా ఆశపడేవాడు. ఎత్తు చాలక మానుకున్నాడు. శరీరం బాగా బండబారినట్లుగా కనిపిస్తుంది. కానీ లోపలఉన్న మనసెంతటి నవనీతమో విద్యకు తెలిసినంతగా మరెవరికీ తేలీదు.

'మహేశ్ ఏమీ మారలేదు. అలాగే అప్పటిలాగే ఉన్నాడు,' అనుకుంది విద్య.

మొదట చాకోబార్స్ కావాలని అడిగాడు మహేశ్. తర్వాత కౌంటర్ మీద బాక్సులో ఖాళీకోన్‌లు కన్పించాయి. విద్యకు కోన్ అయిస్‌క్రీమ్ అంటే ఇష్టమని గుర్తొచ్చింది. అందుకని మొదటివి వద్దనిచెప్పి, ఇవే రెండు తీసుకుని రెండుచేతుల్లో పట్టుకుని వచ్చాడు.

"ఇక్కడ ఇలా కూచుని ఇది తింటుంటే నీ కేమీ గుర్తురావడంలేదూ?" అడిగాడు విద్యని.

"నీకేం గుర్తొస్తుంది?" అడిగింది విద్య; అంతదూరాన చిన్న పాపను, రెండుచేతులు చెరొకరు పట్టుకుని నడిపించుకొస్తున్న జంటను గమనిస్తున్నాయి ఆమెకళ్ళు.

"సత్యం, నువ్వూ, నేనూ కలిసి మొట్టమొదటిసారి ఈ పార్కుకి ఎప్పుడొచ్చామో గుర్తుచేసుకో" అన్నాడు మహేశ్ నవ్వుతూ.

ఆ అనుభవం గుర్తురాగానే విద్యకి నవ్వొచ్చింది.

* * *

సత్యమూర్తికి అడ్వెంచర్ అంటే ఇష్టం.

ఎండాకాలం మధ్యాన్నం ముగ్గురూ కలిసి విద్యఉంటున్న గదిలో కూచుని అవ్వతో నిమ్మరసం చేయించుకుని తాగుతున్నారు. పరీక్షలు ఒక వారంరోజుల దూరాన ఉన్నాయి.

"ముగ్గురం కలిసి సెలవుల్లో బెంగుళూరుకి వెళదామనుకున్నాం. నువ్వూ రావాలి" అన్నాడు, సత్యం సుశీలామెని అవతలికి వెళ్ళనిచ్చి. ఆమె క్కాస్త చెముడు కదా.

"అదేం అనుకున్నాం అంటున్నావు. నాతో అన్లేదుగా?" ఆశ్చర్యంగా అడిగాడు మహేశ్.

"నే ననుకున్నాను? మనం వెళ్ళాలని. నే ననుకుంటే నువ్వనుకున్నట్లే."

"మీ ఇద్దరూ అనుకోవడం బాగుంది. నా సంగతేమిటి? నే నెట్లా వస్తా ననుకున్నావు?" అంది విద్య కొంటెగా జారుతున్న పమిటమడతలు సరిదిద్దుకుంటూ. ఆ ఏడే వోణీలు వేయటం ప్రారంభించింది.

"ఎలా ఏమిటి? మే మిద్దరం కాలేజీలో చేరితే నువు వచ్చి చేరలే. అలాగే."

"అదీ ఇదీ ఒకటే ఏమిటి? నాన్న పంపించడు. అమ్మకు చెప్తే కాళ్ళు విరిచేస్తుంది."

"ఓహో అలాగా.... పోనీ వాళ్ళకి చెప్పనేవద్దు. అంతే గద" సింపుల్‌గా అన్నాడు సత్యమూర్తి

"అమ్మో" అన్నది విద్య గుండెలమీద చెయ్యి వేసుకుంటూ.

"అమ్మోనో బొమ్మోనో నాకు తెలీదు. మనం బెంగుళూరు వెళుతున్నాం. పరీక్షలు అయిన మరురోజు రాత్రికే మన ప్రయాణం."

"అసలెందుకురా బెంగుళూరుకి?" అనుమానంగా అడిగాడు మహేశ్.

"నీ మొఖం. గాడిదలా ఏళ్ళొచ్చాయి గానీ నీకు బుద్ధిలేదురా. మనకి ఇంత దగ్గరలో, నూటయాభయిమైళ్ళ దూరాన మాత్రమే ఉన్న మహానగరంరా బెంగుళూరంటే. అలాంటి వూరికి సరదాగా వెళ్ళి చూసివద్దాం అని నేను ప్లానువేస్తే మీ రిద్దరేమిటిలా అడ్డంపడిపోతున్నారు"

"మరి డబ్బులు. ...."

"డబ్బులు వొస్తయిరా భాయి ఎవ్వో నీ దగ్గరొక పదిరూపాయ ఉందనుకో. నా దగ్గర పది పదిరూపాయలు, విద్య దగ్గరో అయిదు పదులు ఉండవచ్చు. అంతాకూడేసి లెక్కేద్దాం. సంచీలు సర్దుకుని రైలెక్కేద్దాం. ఏమంటార్రా?" వాళ్ళిద్దరూ అవుననకుండా మరేదయినా అన్నా అతనూరుకోడు.

అందుకని సరే అనుకున్నారు.

తన ఊరెళ్ళిపోతున్నానని అవ్వకు అబద్ధం చెప్పి, ఆఖరి పరీక్షరోజే గుడ్‌బై చెప్పి పంపేసింది విద్య. మళ్ళీ సెలవులయేదాకా రానక్ఖర్లేదని కూడా చెప్పేసింది.

మరురోజు రాత్రి ముగ్గురూ కలిసి బెంగుళూరు రైలెక్కారు.

దొరికిన కొద్ది స్థలంలో ముగ్గురూ సర్దుకుని రాత్రి గడిపారు, నిద్రలో ఒకరి మీదొకరు పడిపోతూ, విసుక్కుంటూ, గొణుక్కుంటూ ఉన్న మిత్రులిద్దర్నీ తమాషాగా చూస్తూ కూర్చుంది విద్య.

తెలతెలవారుతుండగా ముగ్గురూ సిటీస్టేషన్లో దిగారు.

"రోజు తా తిరగటమే. సాయంత్రందాకా మనకు రూం ఎందుకురా?" అడిగాడు సత్యమూర్తి. 'నిజమే' అన్నాడు మహేశ్.

ఎవరి సంచీలు వాళ్ళు వేసుకుని ముగ్గురూ స్టేషనుదాటి సిటీలోకి అడుగు పెట్టారు.

కనుచూపు మేరలో ఎదురుగా కనిపిస్తున్న స్థలం అంతా సముద్రంలో నీటిలా జనంతో నిండిపోయుంది.

సత్యందగ్గిర సిటీ మాప్ ఒకటి, సిటీబస్ టైంటేబిల్ ఒకటీ ఉన్నాయి. వాటికి తోడు అంతకుముందే బెంగుళూరు చూసివచ్చిన మిత్రులద్వారా కొన్ని వివరాలు, సలహాలుకూడా సంపాదించాడు.

పూర్వం అక్కడొక చెరువుండేదట. ఇప్పుడందులో ఒకవయిపు బస్ స్టాండు, మరొకవయిపు కాంగ్రెస్ ఎగ్జిబిషన్ ఉన్నాయి. రెండిటి మధ్యలోనుండి మెయిన్ రోడ్డు ఒకటి.

ఆ రోడ్డువెంబడే అవతలికి, మరి కాస్త ముందుకు నడిచి, చరిత్రాత్మకమయిన కెంపెగౌడ సర్కిల్ చేరుకున్నారు. అక్కడ నిలుచుంటే, దానిచుట్టూ అక్కడికి వచ్చి కలిసిపోయే అయిదురోడ్లు కనిపిస్తాయి. వాటిలో కాస్త విశాలంగా బాగ జనసందోహంతో నిండిఉన్నదే కెంపెగౌడ రోడ్డు. రోడ్డుకి కుడివయిపు అంతా వరసగా సినిమా థియేటర్లు. ఎడమవయిపు పొడవునా బట్టల దుకాణాలు.

సర్కిల్ దాటగానే మొదట కనిపించేదే సంతోష్ సినిమా. ఆ ప్రాంతంలో ఉన్న థియేటర్లన్నింట్లోకీ బాగా పెద్దది. పూర్తిగా గాజు పలకలతో నిర్మించారా అన్నట్లు కనిపిస్తుంది బయటినుంచీ చూస్తే. బయట పెద్దది 'షోలే' సినిమా పోస్టర్ ఒకటి కనిపిస్తుంది.

దాన్ని చూస్తూ నిలుచుండిపోయిన మహేశ్ భుజంమీద తట్టి పిలిచాడు సత్యమూర్తి "దాన్నేం చూస్తావ్ పదరా. సాయంత్రం సినిమానే చూద్దాం గానీ" అన్నాడు.

ప్రతీ బట్టల దుకాణంముందర షోకేసులు, వాటిల్లో మనిషెత్తు బొమ్మలు ఉన్నాయి. వాటికి రకరకాల చీరలు, అందంగా కట్టి నిలుచోబెట్టారు. మరెన్నో రకాల చీరలు బయట ప్రేలాడవేశారు.

వాటివయిపు పరిశీలనగా చూస్తున్న విద్యను గమనించాడు సత్యమూర్తి. జేబునిండా డబ్బున్నవాడిలా, "ఏం చీరొకటి కొందామేమిటీ? చాలా నచ్చినట్లున్నాయి?" అన్నాడు

అతను నిజంగా కొనబోతున్నట్లు, "ఛీ! నా కెందుకు ఇప్పుడే చీరలు. నేను కట్టుకోలేను" అన్నది విద్య.

"పోనీ అదిగో అక్కడ కనిపిస్తున్నాయి చూడు పాంట్లు. అలాంటివి, జీన్స్ ఒక జత తీసుకుంటావేమిటి? ఇక్కడ అమ్మాయిలు చాలామంది అవే వేసేలాగున్నారు."

"బాబోయ్. అవి నేను గనక వేసుకుని ఇంటికివెళితే, మా నాన్నమ్మ చీపురు తీసుకుని వెంటబడుతుంది" అని అలా అయినట్లు ఊహించుకుని పడిపడి నవ్వింది విద్య.

దగ్గరలో బస్‌స్టాప్ మైసూర్‌బాంక్ దగ్గరుందని కనుక్కొని, అక్కడికి వెళ్ళి, బస్సెక్కి కబ్బన్ పార్క్ వెళ్ళారు.

ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఒకటి మ్యూజియంలు రెండూ చూశారు. మధ్యాహ్నం పార్క్‌లోపలే ఉన్న టూరిజంవారి కాంటీనులో భోంచేసారు.

సాయంత్రానికి విధానసౌధ ముందుకు చేరుకుని లాన్స్‌లో కాసేపు విశ్రాంతిగా కూచున్నారు. సిటీ టూరింగ్ గైడ్ పుస్తకంలోంచీ, రాష్ట్రవిధానసభ, విధాన పరిషత్ సమావేశాలు జరిగే, ఆ అధికార నిలయం నిర్మాణాన్ని గురించిన వివరాలు, అందుకు పట్టిన కాలం, ఆ నిర్మాణానికి ఆధారంగా నిలిచిన వ్యక్తుల పేర్లువంటివన్నీ సత్యం చదువుతూఉంటే, మహేష్, విద్య వింటున్నారు. ఆ భవనం మొత్తం నాలుగు అంతస్తులు కలిసి, పైన వరుసగా కనిపిస్తున్న భాగంలో ఎన్ని కిటికీలు, ద్వారాలున్నాయో లెక్కపెడ్తోంది విద్య. ప్రతీసారి ఎక్కడో మధ్యలో లెక్క తప్పుతోంది.

రాత్రికి పడుకునేది ఎక్కడా అన్న సమస్య ఏర్పడింది.

మ్యూజియంలో ఎవరో తెలుగువాళ్ళు కనిపిస్తే పరిచయం చేసుకుని మాట్లాడాడు మహేశ్. సిటీ మార్కెట్ ప్రాంతంలో ఉన్నొక్కవ అద్దెకి గదులిచ్చే లాడ్జింగులు దొరుకుతాయని చెప్పారు వాళ్ళు.

ఆ సలహామీద ముగ్గురూ కలిసి సిటీమార్కెట్‌కి వెళ్ళారు. మార్కెట్‌లో పువ్వులు, పళ్ళు, కూరగాయలు అమ్మే రోడ్లవెంట ఎన్నోచోట్లు తిరిగి చూసి, భోజనాలు చేసుకుని లాడ్జికి వెళ్ళారు. రోజుకి ఐదు రూపాయల చొప్పున గది దొరికింది.

అంత తక్కువలో దొరికిందని ఆనందపడిపోతూ తమ గది నంబరు చూసుకుంటూ వెళ్ళారు. గది తలుపు తీస్తూనే చప్పగా చల్లారిపోయి కళ్ళు తేలవేసారు.

దాన్ని గది అనేకంటే పెద్దసైజు శవపేటిక అంటే బావుంటుంది. ఒక చిన్నమంచం, దానిమీదొక పాత అంతా ఉండలుకట్టిపోయిన పరుపు ఉన్నాయి. మంచంపక్కన మరోమనిషి నిలుచోటానికి మాత్రమే స్థలం ఉంది.

విద్య ఏడుపుముఖం పెట్టేసింది.

జాలేసింది మహేశ్‌కి. "పోనీ ఇంకో రూం కూడా తీసుకుందామా సత్యం?" అన్నాడు.

"ఒద్దొద్దు ఎలాగో సర్దుకుందాం" అంటూ లోపలికి అడుగేసింది విద్య. వాళ్ళ దగ్గరున్న డబ్బు చాలా తక్కువ. దాన్ని మరో గదికోసం వృధాచేయడం ఇష్టంలేదామెకు.

"పోనీ సినిమాకయినా వెళదాం రా. ఈ తాపంలో పడుండే బదులు, హాయిగా ఏర్‌కూల్డ్ థియేటర్లో సగంరాత్రిదాకా గడుస్తుంది" అని సినిమాప్లాను వేశాడు సత్యమూర్తి.

స్నేహితులిద్దరి దగ్గరా వేసుకున్న బట్టలుకాక మరొక్క జత మాత్రమే ఉన్నాయి. ప్రయాణంవల్లా, రోజంతా తిరుగుడువల్లా మాసినబట్టలు వదిలేసి లుంగీలు కట్టుకుని, సెకండ్‌షోకు కదా అని అలాగే బయలుదేరారు.

'షోలే' సినిమా, అందులో మిత్రులిద్దరు పాడుకునే పాట మహేశ్‌కి మరీ మరీ నచ్చాయి. సినిమా చూస్తున్నంతసేపూ, వాళ్ళవెంట తనూ పాడుతున్నాడు.

సినిమా అయేసరికి ఒంటిగంట అయింది. అప్పుడింక బస్సులుండవు. అందుకని ఎవర్నో అడిగి అక్కడినుంచీ లాడ్జికి దగ్గర దారి కనుక్కొని నడక మొదలుపెట్టారు.

మెయిన్‌రోడ్డులో అసలు అర్ధరాత్రి అయినట్లే లేదుకానీ, అది దాటి పక్క రోడ్లలోకి వచ్చేస్తే, కొంచం నిర్మానుష్యంగానే ఉన్నాయి. కొత్తవూరు, అర్ధరాత్రి ముగ్గురూ కొంచం బెరుకుగానే ఉన్నా పయికిమాత్రం బింకంగా, సినిమా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.


పావడా, వోణీ, జానెడు జడ, అమాయకంగా ఉన్న ముఖంలో ఒక అమ్మాయి, అమ్మాయికి రెండువయిపులా లుంగీలూ, బొమ్మల బనియన్లు వేసుకున్న అబ్బాయిలు- వీళ్ళని చూడగానే, అంతదూరంలో వస్తున్న బీట్ కానిస్టేబిల్‌కి అనుమానం వచ్చింది.

"యారయ్యా నీవు?" అని నిలేసి కన్నడంలో అడిగాడు.

అసలే బెదురుగా ఉన్నారేమో, పోలీస్‌నూ, అతని మాటల్నీ అసలు అర్థం చేసుకోలేక, నోరు విప్పలేక బిక్కు నమిలారు స్నేహితులు.

సందేహించకుండా ముగ్గుర్నీ స్టేషన్‌కి లాక్కెళ్ళాడు. అదృష్టంకొద్దీ అక్కడ తెలుగు తెలిసిన ఇన్స్‌పెక్టర్ ఉన్నాడు.

సత్యమూర్తి ధైర్యంచేసి విషయాన్ని వివరించాడు. తాము పెద్దవాళ్ళ




పర్మిషన్‌తోనే బెంగుళూరు చూడవచ్చానన్న ఒక్క అబద్ధంతప్ప మిగతా అంతా ఉన్నది ఉన్నట్లుగా చెప్పేశాడు.

అతను వీళ్ళమాటలే నమ్మాడో, ముఖాలుచూసి జాలిపడ్డాడో కానీ మరి కొన్ని ప్రశ్నలువేసి వాళ్ళు కాలేజి విద్యార్థులే అని నిర్ధారించుకుని వదిలేశారు. "ఆడపిల్లని వెంట తీసుకొచ్చారు. భద్రంగా ఇల్లుచేర్చండి" అని వాళ్ళకి వార్నింగ్ కూడా ఇచ్చాడు.

బ్రతుకు జీవుడా అని ముగ్గురూ బయటపడి గది చేరుకున్నారు. విద్య మంచంమీద పడుకుంది. మంచంకింద సంచులు, చెప్పులు చేర్చాడు. పక్కనున్న కాస్త స్థలంలో మంచంమీదున్న బెడ్‌షీట్‌లాగి క్రింద పరిచారు. మిగిలిన రాత్రిలో, సగంసేపు సత్యం, మిగతా సగం మహేశ్ ఆ స్థలంలో పడుకునేలా ఒప్పందం చేసుకున్నారు.

చాలా సేపు మహేశ్, సీతారాములకు కాపలాగా ఉన్న లక్ష్మణుడిలా తలుపు ఆనుకొని కాచుకునే ఉన్నాడు. ఒప్పందం ప్రకారం అతను సత్యమూర్తిని లేపే అవసరమే రాలేదు. తలుపుకు ఆనుకుని జారగిలబడి అలాగే నిద్రపోయాడు.

పొద్దున్నే ముందుగా నిద్రలేచిన విద్య వీళ్ళిద్దరి స్థితి చూసి బాధపడింది. తను ఏదో ఒక విధంగా రావటం మానుకుని ఉండాల్సింది. తనవల్లే సదా వీళ్ళకి తిప్పలు అవుతుంది. వాళ్ళను లేస్తేతప్ప తను మంచం దిగటానికి వీల్లేదు. అందుకని తప్పనిసరిగా సత్యాన్ని నిద్రలేపింది.

"ఏయ్ మహేశ్. నన్నెందుకు లేపలేదురా. నడుం పట్టుకుపోయి ఉంటుంది. లే లేచి అలా మంచంమీద కాస్సేపు నడుం వాల్చు," అని మిత్రుడ్ని తట్టి లేపాడు సత్యం.

అప్పటికి ఉదయం ఎనిమిదిగంట లయిపోయింది. ముగ్గురు స్నానపానాదులు కానిచ్చుకుని ఊరిమీద పడ్డారు.

ఆవేళ చూసినంత చూసి రాత్రికి రైలెక్కాలి. అంతకన్నా ఎక్కువ రోజు లుండేందుకు డబ్బు చాలదు. బస్సెక్కి సిటీకి చాలాదూరంలో ఉన్న మహాలక్ష్మి లేఅవుట్ అనే ప్రాంతానికి వెళ్ళారు.

అక్కడొక గుట్టమీద రెండంతస్తుల భవనం అంత ఎత్తున్న అంజనేయ స్వామి విగ్రహం ఉంది. విగ్రహంచుట్టూ మందిరం ఇంకా నిర్మాణస్థాయిలో ఉంది. అంత పెద్ద విగ్రహాన్ని చూడటమే ఒక గొప్ప అనుభూతిగా అనిపించింది విద్యకు.

పూజచేసుకుని వచ్చి భోజనం అయినతర్వాత లాల్‌బాగ్‌కి వెళ్ళారు. అప్పుడే గ్లాస్‌హౌస్ వెనక బెంచీలమీద కూచుని, వేయించనగకాయలు, అయిస్ క్రీంలు తిన్నారు. అదే మొదలు విద్య అయిస్‌క్రీమ్ కోన్‌లు చూడటం, తినటం.

రాత్రి పదిగంటలకి రైలుంది. ఏడున్నరకి భోజనాలు కానిచ్చి గదికి వెళ్ళారు. వాళ్ళకోసం అక్కడొక గొప్ప ఆశ్చర్యం కాచుకుని ఉంది. తలుపులు తీయగానే. పాదాలు నేలకు అతుక్కుపోయినవాళ్ళలా నిలుచుండిపోయారు. మూడు సంచీలు మాయం అయినాయి. మంచంమీద మహేశ్, సత్యం వదిలేసిన బనియన్లు; లుంగీలు మాత్రం కుప్పగా అలాగే ఉన్నాయి.

సత్యమూర్తి గుండె గుభేలుమంది. తెచ్చుకున్న డబ్బంతా జేబుల్లో పెట్టుకోవటం భయమేసి కొంత తీసి గదిలో బాగ్‌లో ఉంచాడు. సిటీల్లో జేబు దొంగలెక్కువని విన్నాడు అతను. అందుకనే బయటికి తీసికెళ్ళినదాంట్లో సగం మహేశ్ జేబులో, మిగతాది తన దగ్గర ఉంచుకున్నాడు. ఇద్దరి జేబులూ ఖాళీ అయినాయి.

ముగ్గురూ తలలు పట్టుకుని మంచంమీద కూచున్నారు. విద్య అయితే ఒకేసారి ఏడుపు ప్రారంభించింది.

"ఛ ఊరుకో. మీ ఆడవాళ్ళతో ఇదే తంటా. ఏడిస్తే డబ్బొస్తుందా? ఏం చేయాలి అని ఆలోచించి మార్గం వెతకాలి గానీ."

సత్యం ధైర్యాన్ని చూసి తనూ ధైర్యం తెచ్చుకున్నాడు మహేశ్.

వాళ్ళ దగ్గర విద్య చెవుల్లో ఉన్న బంగారు నక్షత్రాలు తప్ప మరే విలువయిన వస్తువులు లేవు. మహేశ్ దృష్టి వాటిమీదికి వెళ్ళనేలేదు.

మనసులోకి ఆలోచన రాగానే లేచి నిలుచున్నాడు మహేశ్. విద్య ఎదురుగా ఉన్నా సంకోచం లేకుండా పాంటు, షర్ట్ విప్పి, లుంగీ, బనియను వేసుకున్నాడు.

మిగిలిన లుంగీ, బనియను సత్యం చేతికి అందించాడు.

అర్థం అయింది సత్యమూర్తికి. మాట్లాడకుండా అతనూ మిత్రుడు చేసిన పనే చేశాడు.

రెండు షర్టులు, రెండు పాంట్లు మడతలు వేసి పట్టుకుని బయల్దేరాడు మహేశ్. సిటీ మార్కెట్‌లోకి వెళ్ళి గంట లోపల తిరిగివచ్చాడు. బనియన్‌కున్న చిన్న పాకెట్‌లోంచి, బాగా మాసి నలిగిపోయినవి మూడు పది రూపాయలనోట్లు బయటికి తీసాడు. చేతిలో ఉండగా చుట్టితన్న సత్యం షర్టు జేపను ఇచ్చేశాడు.

"ఇదేమిట్రా?" అని సత్యం అడిగితే,

"అమ్మే అవసరం లేకపోయింది. బస్ ఛార్జీకి ముప్పయి చాలుగా?" అన్నాడు చిరునవ్వుతో.

రైలు ఆలస్యంగా వచ్చింది. ఆలస్యంగానే అనంతపూర్ చేరింది.

ఏడు గంటలకి విద్యను ఆమె గది దగ్గర దిగబెడదామనుకుని వెంట సత్యం, మహేశ్ కూడా వెళ్ళారు. వాకిట్లోనే వాళ్ళిద్దరికి స్వాగతం చెప్పారు.

వాళ్ళిద్దరి మాసిన లుంగీలు, పిచ్చి పెరిగిన జుట్టు, బట్టలు, ఖాళీ చేతులు అన్నీ చూసి కోపంతో ఉడికి నరసింహాచారి దాస్తోగారి ఈశ్వరయ్య. పరీక్ష అయిన మర్నాడు కూతురు ఇంట్లో నాలుగోయేసరికి బెంగపెట్టుకుని వచ్చాడాయన. వీళ్ళ గుట్టు బయటపడిపోయింది.

అంతే ఆ దెబ్బతో తరవాత సంవత్సరం మళ్ళీ కాలేజీలో చేరతానని తండ్రిని అడిగే ధైర్యం లేకపోయింది విద్యకు.

* * *

"శ్రీవిద్య అడ్వర్టయిజింగ్ అసోసియేట్స్" కాన్ఫరెన్స్ హాల్లో మీటింగ్ జరుగుతోంది.

హాల్ మధ్యలో ఉన్న పొడవాటి కాన్ఫరెన్సు టేబిల్ ఒక చివరనున్న ఒకే కుర్చీలో కంపెనీ ప్రెసిడెంటు సత్యమూర్తి, టేబిల్‌కి కుడివయిపు లైన్లో, సత్యమూర్తి పక్కనే వైస్‌ప్రెసిడెంట్-సేల్స్ మహేశ్, టేబిల్ రెండో

వయిపులో వరసగా ఉన్న కుర్చీల్లో, కాపీసెక్షన్ హెడ్, ఆర్ట్ డైరెక్టర్, టి.వి. ప్రొడ్యుసర్, మీడియా మేనేజర్, శ్రీవిద్య హైదరాబాదు, మద్రాసు, త్రివేంద్రం బ్రాంచీల మేనేజర్లు కూచుని ఉన్నారు.

చర్చ జరగవలసింది, వాన్‌సన్ కంపెనీ వారి కొత్త ప్రోడక్ట్ సన్‌షైన్ టూత్‌పేస్ట్ గురించి. ప్రతీ ప్రోడక్ట్‌కీ ఆర్డర్ వచ్చిన తర్వాత, అడ్వటయిజ్‌మెంట్ కాంపెయిన్ తయారుచేసే ముందు ఆనవాయితీగా జరిగే సమావేశం ఇది.

మార్కెట్ సర్వేవారు పంపిన రిపోర్ట్‌లోనుండి ముఖ్యమయిన విషయాలను క్లుప్తంగా పైకి చదివాడు మహేశ్.

మొదట మార్కెట్లో ఉన్న కాల్గేట్, బినాకా, ఫోర్‌హాన్స్ వంటి టూత్ పేస్ట్ కంపెనీల సంవత్సర అమ్మకం శాతాలు ఎంతెంత ఉన్నదీ చెప్పాడు.

దేశం మొత్తంలో సంవత్సరానికి అయే మొత్తం టూత్‌పేస్ట్‌ల అమ్మకంలో, పది శాతాన్ని 'సన్‌షైన్' అందుకోవాలన్నది, దాన్ని తయారుచేస్తున్న వారి ఉద్దేశం. ఆ గమ్యాన్ని సాధించేందుకుగాను వారు ఈ సంవత్సరానికి నలభయి లక్షలు ఖర్చుపెట్టబోతున్నారు.

మార్కెట్‌లో అమ్ముడవుతున్న టూత్‌పేస్టుల్లో యాభయి శాతం థిరప్యుటిక్ (రోగ నివారిణి) అపీల్‌నీ, ఇరవయి శాతం ఆయుర్వేదిక్ అపీల్‌నీ, ఇరవయి శాతం కాస్మెటిక్ అపీల్‌నీ, మిగతా పదిశాతం ఇతర రకాలనీ, తమ అడ్వటయిజ్‌మెంట్లలో ఉపయోగించుకుంటున్నాయి.

వాన్‌సన్ వారు, 'సన్‌షైన్'ని థిరప్యుటిక్ అపీల్‌తో ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నారు. దీనికి ఏ విధమయిన రూపాన్ని ఇస్తే బావుంటుందో తమ తమ అభిప్రాయాలు చెప్పమని అడిగాడు సత్యమూర్తి.

నలభయి పేజీల మార్కెట్ సర్వే రిపోర్టు, అక్కడున్నవారందరి దగ్గరికీ వారం రోజులు ముందే వెళ్ళింది. అందులోని ప్రతీ విషయమూ వారందరికీ కూలంకషంగా తెలుసు.

నలుగురు మాత్రం తమ అభిప్రాయాలని చెప్పారు. వాటిలో 'సన్‌షైన్' చిన్నపిల్లల కోసం తయారుచేస్తున్నట్లు, చిన్న పిల్లలున్న తల్లులకు అప్పీల్ చేద్దామన్న సలహా ఒంటి పర్యమూర్తికి నచ్చింది.

తర్వాత బడ్జెట్ మొత్తం నలభయి లక్షల్లో, న్యూస్‌పేపర్లు, మాగజైన్లు, టి.వి., రేడియో, వంటి వివిధ 'మీడియా'లకోసం ఎంతెంత వెచ్చిస్తే బావుంటుందో మీడియా మేనేజర్ సూచించాడు.

న్యూస్‌పేపర్లు, మేగజీన్లకి పంపే అడ్వటయిజ్‌మెంటు కాపీని తను ఏ విధంగా వ్రాయించదలచుకున్నదీ, ముఖ్యమయిన కొన్ని పాయింట్ల ద్వారా వివరించాడు కాపీసెక్షన్ హెడ్.

తర్వాత సత్యమూర్తి ప్రశ్నార్థకంగా టి.వి. ప్రొడ్యూసర్ వయిపు చూశాడు.

"చిన్నపిల్లల కోసమే తయారయిన టూత్‌పేస్ట్ అన్న అప్పీలు చేయాలనుకున్నాం కాబట్టి, షార్ట్‌ఫిల్మ్‌ని కార్టూన్లతో తీస్తే బావుంటుంది సర్... కానీ."

"కానీ... ఏమిటి?" అసహనంగా అన్నాడు, సత్యమూర్తి

"మన దగ్గరున్న కార్టూనిస్ట్ మరో కంపెనీకి వెళ్ళిపోయాడండి."

"అరెరె. ఎందుకు వెళ్ళనిచ్చారు? ... చెప్పలేదేం"

మహేశ్ సత్యమూర్తి దగ్గరికి వొంగి చిన్నగా అన్నాడు.

"అతని రిజిగ్నేషను నీ దగ్గరికి వచ్చింది. నువే అంగీకరించి సైన్ కూడా చేశావు." అని

"కార్టూనిస్ట్ కావాలని ప్రకటించలేదూ?" ఆర్ట్ డైరక్టర్‌ని అడిగాడీసారి.

"ప్రకటించాం సార్. అప్లికేషన్లు రాలేదు."

"మీరు ఏ పదేళ్ళో అనుభవం కావాలని అడిగి ఉంటారు. ఏ అనుభవం అవసరంలేదని మరో ప్రకటన చేయండి. ఒక్కరికి బదులు ఇద్దర్ని తీసుకొని. ట్రయినింగ్ ఇవ్వ. కాస్త ఆలస్యం అయినా బయట మరో కంపెనీలో పని ఇచ్చి చేయించుకోవడం కన్నా నయం కదా?"

మీటింగ్ ముగిసింది.

అంతసేపు అన్యమనస్కంగానే ఉన్నాడు మహేశ్. మనసు లోపల ఏదో ఆరాటంగా ఉంది.

మౌనంగా సత్యమూర్తి వెంట అతని గదికి నడిచాడు.

సత్యం కోటుజేబులోంచి సిగరెట్ పాకెట్ తీసాడు. తెరిచి చూస్తే ఖాళీ. చివరి సిగరెట్ కాల్చినప్పుడు మరిచిపోయి జేబులో వేసుకున్నాడులా ఉంది.

"నీ దగ్గరున్నాయా మహేశ్?" అని స్నేహితుణ్ణి అడిగాడు.

అతని బ్రాండ్ అతనికిచ్చేసి. తనది తీసి వెలిగించుకున్నాడు మహేశ్.

"నిన్నొక మాట అడుగుతా, నువేమీ అనుకోవు గద సత్యం?" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

"ఇదేమిటి కొత్తగా ఇట్లా అడుగుతున్నావు. మన మధ్య ఈ అనుకోవటాలు ఎప్పట్నించీ?"

"అదికాదురా. విద్య ఆరోగ్యం ఈ మధ్య బాగా దిగజారిపోయినట్లుంది ........"

"అనారోగ్యాన్ని కావాలని కోరితెచ్చుకునేవాళ్ళని మనమేం చేయగలం? అయినా నేను తనకేం తక్కువ చేశాను? నీకు తెలీదురా మహేశ్. ఆమెకు చాలా గర్వం. నలుగుర్తో కలవకుండా ఇంట్లో ముడుచుకు కూర్చుంటే, అలా పిచ్చెక్కినట్లే ఉంటుంది ఎవరికయినా."

సత్యమూర్తి మాటలకన్నా, వాటిలో ధ్వనించిన నిర్లక్ష్యం చాలా బాధించింది మహేశ్‌ను.

"ఆమె నిద్రమాత్రలకి బానిసై అలవాటుపడిపోయిందనీ, రోజుకు కనీసం అయిదారు మింగుతూ ఉంటుందనీ నీకసలు తెలుసా సత్యం?"

"అరె. అన్ని నిద్రమాత్రలు తీసుకునే అవసరమేమిటి? అసలు అవి తనకెలా దొరుకుతున్నాయి? నాకు తెలియనే తెలియదీ విషయం."


"నువ్వు తెలుసుకోవాలని అనుకోకపోతే ఏవీ తెలీవు--. ఇప్పటికయినా కళ్ళు తెరు. నీ సమయంలో కొంత భాగాన్ని ఆమెతో కలిసి గడిపేందుకు కేటాయించుకో. మనకు బాగా తెలిసిన ముగ్గురు డాక్టర్ల దగ్గర మార్చి మార్చి వెళ్ళి ప్రిస్క్రిప్షన్ సంపాదించుకుంటోంది. ఈ ఉదయమే వాళ్ళ ముగ్గురికీ ఫోన్‌చేసి గట్టిగా చెప్పాను. ఆమె వస్తే వ్రాయవద్దని."

రెండు చేతుల మధ్య తల ఇరికించుకుని, ఆలోచిస్తూ కూర్చున్నాడు సత్యమూర్తి.

కొన్ని నెలల క్రితం తను ఇక్కడే ఫోన్‌లో విన్న 'బర్త్‌డే పార్టీ విషయం' అడగాలని అనిపించింది మహేశ్‌కి. ఆ విషయం ఆ రోజునుంచే అతని మనసును తొలుస్తూ ఉంది.

పూర్తిగా అలసిపోయిన వానిలా కనిపిస్తున్న మిత్రుడి ముఖం చూస్తే మాటలు పెదవి దాటి బయటకిరాకుండా ఉన్నాయి. కానీ సత్యమూర్తి మనసప్పుడే తను ఫోన్‌లో విన్న స్వరం తాలూకు వ్యక్తి దగ్గరికి వెళ్ళిపోయిందని అతనికి తెలీదు

మహేశ్ చిన్నప్పటినించీ ఒంటరివాడే. పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం




కూడా అతనికెప్పుడూ కలగలేదు. అలాంటివాడికి సోదరి, స్నేహితురాలు అయి ఆప్యాయతను పంచి యిచ్చిన వ్యక్తి, ఆత్మీయురాలు విద్య ఒక్కతే.

ఆమె పరిస్థితి ఇలా అవుతున్నదని తెలిసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న సత్యమూర్తి మీద, పట్టించుకునీ ఏమీ చేయలేని తనమీద అతనికి చాలా కోపంగా ఉంది.

పది సంవత్సరాల క్రితం ఆమె ఇతన్ని కోరి, తనవాళ్ళ నందర్నీ ఒదులుకుని, వలచిన వాణ్ణి నమ్ముకుని వచ్చేసింది. వాళ్ళిద్దర్నీ ఒకటి చేసినవాడు తనే.

ఆ రోజులన్నీ గుర్తొస్తున్నాయి అతనికి.

* * *

సిటీ మార్కెట్‌లో సెకండ్‌హాండ్ బట్టలు అమ్మే ఒక దుకాణం అది. లోపల గల్లాపెట్టె ముందర పెద్ద బొజ్జఉన్న సేఠ్ ఒకతను కూర్చుని ఉన్నాడు.

ముందర బట్టలు అమ్ముతున్న ముగ్గురు అబ్బాయిల్లో మహేశ్ ఒకడు. సాయంత్రం ఆరుగంటలయి ఉంటుంది. అంటే ఆ దుకాణంలో బాగా వ్యాపారం జరిగే సమయం అన్నమాట. కూలిపనులకు వెళ్ళేవారు, చిన్న ఫ్యాక్టరీలలో పని చేసేవారికి ఖాళీగాఉండే సమయం అదే.

రంగు వెలిసిపోయిన అమెరికన్ జార్జెట్ చీరొకటి మడతలు విప్పి, ఎదురుగా నిలుచుని ఉన్న ఇద్దరు అమ్మాయిలకి చూపిస్తున్నాడు మహేశ్. వాళ్ళిద్దరూ వేసుకున్న బట్టలముందర, అతని చేతిలో ఉన్న చీర కొత్తదిలాగే కనిపిస్తోంది.

చీర ఎక్కడా చిరిగిపోలేదు. 'ఏ డబ్బుగల మహాతల్లో ఇది పడేసి ఓ స్టీలుగిన్నె తీసుకునుంటుంది అనుకుంటూ,' "అబ్బో! చూశారా ఎంత బాగుందో. 'ఇళమయి ఊంజలాడుగిరదు' చూశారా మీరు? ఈ చీర మీలో ఎవరు కట్టుకున్నా, ఆ సినిమాలో శ్రీప్రియలా వుంటారు. ఎక్కడా ఒక్క చిరుగు కూడా లేదు. ఫరవాలేదు, చేతికి తీసుకుని చూడండి" అని తమిళంలో చెప్పి, మరో వయిపు తిరిగి కన్నడం ప్రారంభించాడు; చిరుగులు కుట్టినట్టు కనిపించకుండా రిపేర్ చేసిన కోటొకటి ఉంది అతని చేతిలో.

మార్కెట్లోనే మరోవయిపు ఒక కిరాణా అంగడిలో పద్దులు రాసే ముసలాయన, చలికి ఆగలేక, కోటు కొనాలని వచ్చాడు. కోటు అతని చేతికిచ్చేసి, "చూసుకో తాతా నువే. ఇది వేసుకుని అంగట్లో కూర్చుంటే వెచ్చగా బాగుంటుంది. లోపల లయినింగు చూడు. చెక్కు చెదరలేదు. దీన్నేసుకుని అలాగే ఇంటికి పోయావో అంతే ఇక. మా ఆజ్జికి పూలరంగడిలా కనిపిస్తావు. పెద్ద ఎక్కువ ఖరీదేం కాదు. వంద రూపాయలే.... పోనీ నీకోసం అయ్యగారి నడిగి ఓ పది తక్కువకి ఇప్పిస్తాలే.... అరెరే అట్లా పరిగెత్తుతావేం ఉండు ఇంకోటి చూపిస్తాను."

"వద్దురా.... నా కదే బాగుంది."

"నాకు తెలుసు ఒక్కసారి దాన్ని చూపిస్తే వదలవని. అందుకే ముందుగా నీకే ఆ కోటు చూపించింది పోనీ నువ్వెంత ఇస్తావో చెప్పు."

బేరాలు జరిగిపోతూ ఉన్నాయి. కన్నడం, తమిళం, తెలుగు, కొద్దిగా మళయాళం, అప్పుడప్పుడు ఉర్దూ ఇన్ని భాషల్లో కస్టమర్లతో సంభాషణ చేస్తున్నాడు మహేశ్.

టయిం తొమ్మిదయేసరికి వ్యాపారం పలచబడిపోయింది. దుకాణం మూయొచ్చని సేఠ్ హుకుం జారీచేశాడు. సేల్స్‌మెన్ ముగ్గురూ కుప్పగా పడి ఉన్న బట్టలన్నీ మడతలు పెడుతున్నారు.

మహేశ్ తల వంచుకుని, ప్రింటెడ్ పోలీస్టర్ చీరొకటి మడుస్తున్నాడు. తన ఎదురుగా ఎవరో వచ్చి నిలుచున్నారు. కాళ్ళకు చెప్పులు, ఇస్త్రీ మడతలో ఉన్న టెరికాట్ పాంటు మాత్రమే చూసి, "ఏం కావాలి సార్?" అంటూ తల ఎత్తి చూశాడు.

అంతే! అవాక్కైపోయాడు.

భుజానికి ఏర్‌బాగ్ ఒకటి తగిలించుకుని నిలుచుని ఉన్నాడు సత్యమూర్తి.

"అరె నువ్వెప్పుడొచ్చావురా. ఉత్తరమయినా రాయలేదేం? అసలిక్కడి కెలా వచ్చావ్?"

"అవన్నీ తర్వాత. అయిందా పని ఇవాళ్టికి."

"అయింది. ఇదిగో దుకాణం మూసేస్తున్నాం"

అయిదు నిముషాల తర్వాత ఇద్దరూ అవెన్యూరోడ్‌లో నడుస్తున్నారు.

"ఉద్యోగం అంటే, ఏ ఆఫీసులోనో అనుకున్నాను. ఇదేంట్రా నువు చేస్తున్నది." బాధగా అడిగాడు సత్యమూర్తి.

"నా ఇంటర్మీడియేట్ చదువుకి ఆఫీసరుద్యోగం ఇస్తారనుకున్నావా? అయినా ఇది ఉద్యోగం కాదా? బ్రతుకుతెరువుకోసం ఏ పని చేస్తే ఏంరా?"

ఇంటర్మీడియేట్ పాసయిన తర్వాత సత్యమూర్తి ఒక్కడే కాలేజీలో చేరాడు. విద్య రాలేదు. మహేశ్‌కి చదువులో ఆసక్తి తగ్గిపోయింది. వాళ్ళ తాత కూడా పోయాడు.

ఉద్యోగాన్వేషణలో బెంగళూరు చేరుకున్నాడు.

బియ్యే చివరి సంవత్సరం పరీక్షలు అయిన తర్వాత స్నేహితుణ్ణి చూద్దామని వచ్చాడు సత్యమూర్తి. అతని కింతవరకూ మిత్రుడిక్కడ చేస్తున్న పనేమిటో తెలీదు.

అవెన్యూ రోడ్‌కి రెండు వయిపులా ఉన్న అసంఖ్యాకమయిన చిన్న సందుల్లో ఒక దాన్లో చిన్న హోటలుకు తీసుకెళ్ళాడు మహేశ్. అతను రోజూ భోంచేసేది అక్కడే. ఇద్దరూ సాంబారు అన్నం, పెరుగన్నంతో భోజనం అయిందనిపించి మహేశ్ గదికి బయలుదేరారు.

"ఏమిటో అనుకున్నా మంచి సేల్స్‌మన్‌విరా నువు అసలిన్ని భాషల్లో ఇంత బాగా మాట్లాడటం ఎప్పుడు నేర్చుకున్నావు"

"బాగానా నాబొందా? ఏదో అంతా మిక్స్‌చేసి మాట్లాడుతుంటాను. నా కస్టమర్లకి సరిపోతుంది. ఏ భాషలో ఎన్ని తప్పులు మాట్లాడుతుంటానో, ఏ రోజయినా ఏ భాషయినా బాగా తెలిసినవాళ్ళొస్తే, నా మాటలకి తన్నులు తింటానేమో అని భయంగా ఉంటుంది ఈ ఊళ్ళో ఎన్ని భాషలు తెలుసుంటే అంత సులభంగా సామాన్లు అమ్మకం చేయొచ్చన్నమాట."

"ఇక్కడికి వచ్చి చేరినప్పట్నించీ ఈ దుకాణంలోనే పనిచేస్తున్నావా?"

"అబ్బో ఎన్ని మార్చానో లెక్కలేదు. ఇక్కడ పనిచేసేవి ఇంకా మూడు మార్కెట్లున్నాయి. మూడింట్లో, దాదాపు అన్ని రకాల దుకాణాల్లో పనిచేశాను."

"అన్ని రకాలు అంటే...."

"ఒకటనేమిటి, కూరగాయలు, పూవులు, పళ్ళు, ఫాన్సీ సామాన్లు, పూజ సామాన్లు, ఫోటో ఫ్రేముల అంగళ్ళు, హోల్‌సేల్ గోడవున్లు ఇట్లా ఎన్నోచోట్ల చేశాను."

"ఏం ప్రతీచోటా పోట్లాటలా?"

"ఎందుకు పోట్లాట. ఎక్కడా ఇంతదాకా గొడవలవల్ల పని వొదలలేదు నేను. ఎక్కడ ఎక్కువ జీతం ఇస్తారని తెలిస్తే అక్కడికి పోవడం, అంతే. అనుభవం వచ్చిన తర్వాత భయమేముంది? ఎక్కడ మర్యాద తక్కువగా ఉంటే అక్కడ ఒక్కక్షణంకూడా నిలిచేది లేదు."

* * *

సత్యమూర్తి వచ్చాడని ఆవేళ మహేశ్ దుకాణంలో పనికి వెళ్ళలేదు. ఎదురుగా ఉన్న టీకొట్లో బన్నులు తిని, టీ తాగి గదిలోనే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"ఏం సినిమాకి పోదాంరా? పోనీ సాయంత్రం మెజస్టిక్ వయిపు పోదాం. అక్కడ నువేదంటే అదే."

"ఇవాళ మానేశావు గదా? రేపెళితే సేఠ్ ఏమీ అనడా?"

"ఎందుకంటాడు? మే మేవన్నా పర్మనెంట్ ఉద్యోగులమా? అతని కేమయినా కాంట్రాక్టు రాసిచ్చామా? ఇంకెవరన్నా దొరికితే నా ఖాళీలో ఈ రోజే చేర్చేసుకు నుంటాడు. ఎవరూ దొరక్కపోతే రేపటికి నా ఉద్యోగం నాకు సంతోషంగా ఇస్తాడు, అంతే"

"ఇవాళే అతని కింకెవరన్నాదొరికితే..."

"దొరికితే ఏముంది? నా కొకవూటో, రోజో నిరుద్యోగం, ఇంకో చోట మరొకటి దొరికేదాకా."

ఇద్దరూ మాట్లాడుకుంటూ కూచుని ఉండగానే, పోస్ట్‌మేన్ మహేశ్ కొక ఉత్తరం ఇచ్చిపోయాడు.

"నువ్వు కాకుండా, నాకు ఉత్తరాలు రాసేవారెవర్రా? చూసి నువ్వే. ఏ దూరం బంధువయినా మన అడ్రస్ తెలుసుకున్నాడేమో" అని ఉత్తరాన్ని సత్యానికే ఇచ్చాడు మహేశ్.

ఉత్తరం విప్పి, అక్షరాలు చూడగానే, అది విద్య రాసిందని తెలిసిపోయింది

సత్యమూర్తికి ఉత్తరం చాలా చిన్నది. గబగబా నాలుగు లయిన్లు రాసి, పోస్ట్ చేసినట్లుంది.

తను చదివి ఉత్తరాన్ని మహేశ్ కిచ్చాడు.

"మహేశ్

మా ఇంట్లో నాకు సంబంధాలు చూస్తున్నారు. ఒకటి దాదాపు కుదిరేలాగే ఉంది. ఎలా తప్పించుకోవాలో అర్థంకావడం లేదు. సత్యమూర్తిని చేసుకుంటానని నాన్నతో చెప్పే ధైర్యం లేదు. చెప్పినా ప్రయోజనం కూడా ఉండదు.

సత్యం కిప్పుడు పరీక్షలేమో! అతనికి వ్రాయలేక, నీకు రాస్తున్నాను. అతన్ని కాకుండా మరెవర్తో నా పెళ్ళయినా నేను బ్రతకను. అతను లేని జీవితాన్ని, నేను కలలో కూడా ఊహించుకోలేను. పరీక్షలవగానే సత్యం నీ దగ్గరి కొస్తాడేమో! అతనికి చెప్పు ఈ విషయం.

మళ్ళీ నిన్ను కలుసుకునే అదృష్టం నాకుందో లేదో, సెలవ్" అని ఉంది ఆ ఉత్తరంలో.

"ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"ఆలోచించాలి గదరా."

"నువ్విక్కడ ఆలోచిస్తూ కూచుంటే, విద్య పరిస్థితి ఏమవుతుందో ఆలోచించావా?"

"అయితే నన్నేం చేయమంటావ్?"

"ఏముంది? నువెళ్ళి విద్యను తీసుకొచ్చెయి. నేను మీ ఇద్దరికీ పెళ్ళి చేస్తాను."

"బావుంది. తర్వాత.. "

"తర్వాత ఏముంది? ఇదేం కథ అనుకున్నావా పెళ్ళితో సుఖాంతం అయిపోవడానికి?"

"అదేరా నా బాధ. నాకు మాత్రం విద్య అంటే ఇష్టం లేదనుకొన్నావా? ఈ క్షణం వెళ్ళి ఆమె దగ్గర వాలుదామా అని ఉంది. కానీ ఇంకా నాకు ఉద్యోగం, సద్యోగం లేదు. మేం పెళ్ళిచేసుకుంటే కులాంతరం అని మా వాళ్ళు ఇంట్లోకి రానియ్యరు."

"మీ ఇంటి కెవరు వెళ్ళమన్నారు? ఇక్కడే నా దగ్గరే ఉండండి. ఈ ఒంటి గది వదిలేసి రెండు రూములున్న ఇల్లు చూస్తాను. అంతో ఇంతో కూడేసిన

డబ్బుంది నా దగ్గర. అది అయిపోయేలోగా నీకూ ఏదో ఒక ఉద్యోగం వచ్చేస్తుంది. ఇంకేం ఆలోచించొద్దు.... ఈ రోజు రాత్రి రైలుకే వెళ్ళిపో. విద్యను తీసుకురా."

ఆ రోజు వెళ్ళి, మూడవ రోజుకు విద్యను తీసుకునివచ్చాడు సత్యమూర్తి. ఆ వేళే సాయంత్రం ఇద్దర్నీ ధర్మరాజాకోయిల్‌కి తీసుకెళ్ళి పెళ్ళి జరిపించాడు మహేశ్.

నెల రోజుల్లోపల ఈ గది నుండీ రెండు గదులు వసారా ఉన్న చిన్న ఇంటికి మారారు ముగ్గురూ, మారినరోజు నుంచే కొద్దిగా వంట సామాను తెప్పించి వంట ప్రారంభించింది విద్య.

విద్య, ఇంటర్మీడియేట్ తర్వాత మూడు సంవత్సరాలు ఇంట్లో ఊరికే ఉండకుండా టైప్, షార్ట్‌హాండ్ క్లాసులకి వెళ్ళేది దానివల్ల ఉద్యోగం ముందుగా విద్యకే వచ్చింది.

విద్య ఉద్యోగం చేయటం మహేశ్‌కిష్టం లేదు. ఆమెకూ ఇంత పెద్ద సిటీలో, ఉద్యోగం అంటే భయంవేసింది సత్యమూర్తి బలవంతాన అప్లైచేసింది. అతని బలవంతంతోనే ఉద్యోగంలో చేరింది.

మహేశ్ ఒక్కడిది సంపాదన ముగ్గురికి ఏ మూలకీ చాలకుండా ఉంది.... మహేశ్ దగ్గరున్న సేవింగ్స్ అంతా కరిగిపోయాయి. అందుకని తమ ఇద్దర్లో ఎవరి కుద్యోగం వచ్చినా నయమే అనిపించింది సత్యమూర్తికి. అందుకే విద్యనీ, మహేశ్‌నీ ఒప్పించాడు. వారంరోజులదాకా విద్యని తనే బస్‌లో తీసుకెళ్ళి ఆఫీస్ దగ్గర దించి, సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేవాడు.

* * *


విద్యకు పిచ్చెత్తినట్లుగా ఉంది.

నిద్రమాత్రలన్నీ అయిపోయాయి. ఏ డాక్టర్ దగ్గర ప్రయత్నించినా ప్రిస్క్రిప్షన్ ఇచ్చారు కాదు.

అవి లేకుండా అయినప్పటినుంచీ, వాటికి తనెంతగా అలవాటుపడిపోయిందీ ఆమెకు అర్థంకాలేదు.

అప్పుడు, అంతవరకూ ఆమె నిద్రపుచ్చుతూ వొచ్చిన బుర్ర పనిచేయడం ప్రారంభించింది. అంతకు రెండు రోజులు ముందు మహేశ్ వచ్చినప్పుడు అతనన్న మాటలు కూడా ఆమెను ఆలోచింపజేస్తున్నాయి.

"నువే సత్యాన్ని నీ నుంచి దూరంచేసుకుంటున్నావేమో ఆలోచించు. అతనికి మాత్రం నువూ, నేను కాకుండా ఎవరున్నారు?" అన్నాడు మహేశ్.




అతనన్నది నిజమా? అవునేమో. రెండు చేతులు తడితేనే కదా శబ్దం వచ్చేది. సత్యం తన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడు. నిజమే? తనూ అదే పనిచేయడం లేదూ? తామిద్దరూ మళ్ళీ ఒకరంటే ఒకరు ప్రేమగా సన్నిహితంగా ఉంటే తనకు ఏ నిద్రమాత్రలూ అవసరం లేదు.

అతను స్వంతంగా వ్యాపారంచేయటం మొదటినుంచీ తనకు ఇష్టం లేదు. అందువల్ల, ఆ అయిష్టంతోనే, తనే అతన్ని దూరం చేసుకుంటుందా? అనిపించింది విద్యకు.

అప్పట్లో అతనొక అడ్వర్టయిజింగ్ ఏజన్సీలో 'కాపీ సెక్షన్' హెడ్‌గా ఉండేవాడు. నెలకు పదహేను వందలు జీతం వచ్చేది. తనూ మరో ప్రైవేట్ కంపెనీలో స్టెనోగ్రాఫరు. జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా హాయిగా సాగి పోతూ ఉన్నదనుకుంది తను. మహేశ్ తన స్వశక్తితోనే, కొత్తగా సెకండ్ హాండ్ బట్టల దుకాణం ఒకటి ప్రారంభించాడు.

అలాంటి పరిస్థితుల్లో ఒకరోజు, సత్యమూర్తి సాయంత్రం ఇంటికొరాగానే, ముగ్గురూ కూచుని కాఫీ తాగుతూ ఉండగా, ఒక విషయం బయటపెట్టాడు.

"మీ కిద్దరికీ ఒక మంచి వార్తరా. ఎల్లుండితో నా ఉద్యోగం ఆఖరు."

ఇతనికి పిచ్చేమయినా పట్టిందా అన్నట్లు చూసింది విద్య.

"ఉద్యోగం పోతే మంచి వార్తంటావేమిట్రా?" అరిచినట్లే అడిగాడు మహేశ్.

"నేనే స్వంతంగా ఒక ఏడ్ ఏజన్సీ ప్రారంభించాలనుకున్నా మహేశ్, అందుకు మీ రిద్దరూ సహాయం చేయాలి."

"కలగాని కంటున్నావా ఏం? కాస్త భూమ్మీదికి దిగిరా సత్యం."

అప్పుడు తన ప్లాను పూర్తిగా వివరించాడు సత్యమూర్తి.

అతను పనిచేసే ఆఫీస్ మేనేజింగ్‌పార్ట్‌నర్ ఒకరు ఆవేళ సత్యమూర్తిని పిలిచి మాట్లాడారు సత్యమూర్తి ఉన్న పోస్ట్‌లో మరెవర్నో కావలసిన వాళ్ళకి తీసుకురావాలట. వ్యాపారంలో ఎక్కువ షేర్లున్న పార్ట్‌నర్ జాన్‌రాబిన్సన్‌కి ఇష్టం సత్యమూర్తి. అందువల్ల అతన్ని టెర్మినేట్ చేసే వీలులేదు. అందుచేత అతనంత అతనే రాజీనామా ఇచ్చి ఉద్యోగం వదులుకుంటే, ఒక సంవత్సరం జీతం బోనస్‌గా ఇచ్చి పంపుతానని లోపాయికారీగా ఒప్పుకున్నారు.

అంతే సాయంత్రం అయేసరికి, సత్యమూర్తి చేతికి పద్దెనిమిది వేలకి చెక్ వచ్చింది. అతని రాజీనామా జాన్ రాబిన్సన్ టేబిల్‌మీదికి వెళ్ళింది.

"నువ్ నీ షాప్ అమ్మేయి. ఎంతొస్తుందో చూద్దాం. ఇంకా విద్యవి నగలున్నాయి కదా. అంతా కలిపితే బిజినెస్‌కి సరిపోతుందనుకుంటా. ప్రారంభంలో మనం ఇద్దరమే, మన కంపెనీలో ఉద్యోగులు కూడా-నిదానంగా వ్యాపారం వృద్ధిఅయితే కొత్తవాళ్ళని తీసుకోవచ్చు. ఏమంటావ్‌రా?"

మహేశ్‌కి బిజినెస్ అంటే భయంలేదుకానీ, అతనికీ లైను కొత్త, షాపు అమ్ముకుని వచ్చినంత డబ్బు, సత్యంకివ్వటం తప్ప, అటుపయిన వ్యాపారంలో తను అతనికేం సహాయం చెయ్యగలనా? అనుకున్నాడు

విద్య కసలు ఈ ప్రణాళికే నచ్చలేదు,

సత్యంకీ ఉద్యోగం పోతే ఏమంటుంది? మరో ఏజన్సీలో సులభంగా ఇంకోటి వస్తుంది. స్వంత వ్యాపారం అని ఇంత రిస్క్ తీసుకోవాలా? అనిపించింది ఆమెకు.

ఆవేళ ఆ విషయంలో చాలా చర్చ జరిగింది.

సత్యమూర్తి తనకన్నా తెలివయినవాడనీ, ఏ పని చేయాలన్నా బాగా ఆలోచిస్తాడనీ నమ్మకం మహేశ్‌కి. అందుకే అతను సత్యమూర్తి ప్రపోజల్‌కి సులభంగా ఒప్పుకున్నాడు.

తామిద్దరూ సెటిల్ అయ్యాయి కనుక, మహేశ్ పెళ్ళిచేసుకుంటే బావుంటుందని, తన ఆఫీసులో, స్నేహితుల్లో వాకబుచేస్తోంది విద్య. సత్యమూర్తి పట్టుదల చూస్తూఉంటే, ప్రశాంతంగా ఉన్న సరస్సులాంటి జీవితంలో, గులకరాళ్ళు విసరబోతున్నాడా అనిపిస్తోంది.

సత్యమూర్తి మాత్రం ఎవరి ఇష్టాయిష్టాలూ పట్టించుకోలేదు. తను చెయ్య దలచుకున్నది చేశాడు.

విద్య పనిచేసే ఆఫీసులో, కామెర్స్ అకౌంట్సు, బుక్‌కీపింగ్‌లో కూడా అనుభవం ఏర్పడింది. అందుకని చేస్తున్న ఉద్యోగం రిజైన్‌చేసి, తనకు సహాయం చేయాలని సత్యమూర్తి కోరిక. ఇందుకోసం కూడా కొంత వాదోపవాదాలు జరిగాయి. చివరికి సత్యమూర్తి కోపాన్ని భరించలేక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసింది

ఆస్టిన్ టవున్‌లో మూడు గదులలో ఆరంభమయిన "శ్రీవిద్య అడ్వటయిజింగ్ అసోసియేట్స్," మామూలుగా ఏ కొత్త కంపెనీ అయినా ఎదుర్కొనే ఒడిదుడుకులకు లోనయినా, మూడు సంవత్సరాలు దాటేసరికి బాగా పుంజుకుంది. అయిదో సంవత్సరానికి సిటీ సెంటర్‌లో ఉన్న 'జనార్దన్ టవర్స్' నాలుగో అంతస్తుని ఆక్రమించింది

ఆఫీసు ఇక్కడికి మారిన తర్వాత విద్యను ఉద్యోగం మాన్పించాడు సత్యమూర్తి. 'శ్రీవిద్య'కిప్పుడు, మూడు ఇతర రాష్ట్ర రాజధానుల్లో బ్రాంచీలేర్పడినాయి. బెంగుళూరు హెడ్ ఆఫీస్‌లో యాభయిమందికి పైగా ఉద్యోగులున్నారు ఈ పరిస్థితిలో ఇంకా కంపెనీ ప్రెసిడెంటు భార్య అయిన విద్య ఉద్యోగం చేయటం సత్యమూర్తికి నచ్చలేదు. అందుకనే మానెయ్యమన్నాడు.

అది మొదలు ఇద్దరి మధ్యా తెర లాంటిదేదో ఏర్పడి ఎవరి ప్రపంచం వాళ్ళదయింది.

ఆ తెరని తనే ఛేదిస్తే ఏం? ఆ ప్రయత్నం తను ఎందుకు చేయకూడదు. అతనికి వ్యాపారం వల్ల ఎక్కువ తీరిక ఉండటంలేదు. ఉన్న కాస్త సమయమైనా, అతనితో తను సయోధ్యగా ఉండటం లేదు.

విద్య మనసులోకి పశ్చాత్తాపం ప్రవేశించింది

సత్యమూర్తి బొంబాయి వెళ్ళాడు. అతను చెప్పివెళ్ళిన ప్రకారం అయితే, ఈ రోజు సాయంత్రం రావాలి. ఇవాళ ఏమయినా అతనికి దూరంగా ఉండదు తను. పాతరోజులు, తామిద్దరూ ఒకరంటే ఒకరు ప్రాణంగా ఉన్న రోజులు గుర్తుచేస్తుంది. తన మనసు విప్పి అతని ముందు పరుస్తుంది. అతనికి ఆసక్తి కలిగించే విషయాలు మాట్లాడుతుంది. అతనతో ఏ పార్టీకి రమ్మనా బోర్ అనుకోకుండా వెళుతుంది.

అతనికి మాత్రం తనంటే ప్రేమ లేదా? కావాలనీ తన్నుంచీ ఎందుకు దూరం అవుతాడు?

సాయంత్రం ఆరింటికి ఫ్లైట్ వస్తుంది. అంటే ఆరున్నరకంతా సత్యం ఇంటికి వస్తాడు.

తలారా స్నానంచేసి, మేకప్ చేసుకుందామని డ్రస్సింగ్ టేబిల్ముందర కూర్చుంది. సత్యం ఎప్పుడో బొంబాయినుండీ తెచ్చిఇచ్చిన ఇంపోర్టెడ్ మేకప్ క్రీములు అన్నీ ఎండిపోయి గట్టిబడిపోయాయి. అప్పటికప్పుడు చప్రాసీని పంపి కావలసిన సామగ్రి తెచ్చుకుంది. కొద్దిగా లిప్స్టిక్ కూడా వేసుకుంది. 'హేర్డూ' చేయించుకుందుకు బ్యూటీపార్లర్కి వెళితే బావుండేది. గానీ ఇప్పుడు టయిం లేదు. అందుకని వదులుగా జడ అల్లుకుని, కనకాంబరాలు ముడుచుకుంది. పడకగదిలో తన మంచంమీదుండే బేబీ ఫోటో తీసి, తన పెట్టెలో దాచేసుకుంది. అదే స్థలంలో తమ ఇద్దరి పెళ్ళిఅయిన కొత్తలో తీయించుకున్న ఫోటో ఉంచింది.

ఆరూపది అయినప్పుడు సరిగ్గా ఫోన్ మోగింది. మహేశ్ అనుకుని, రాత్రి డిన్నర్కి ఆహ్వానిద్దామని, ఉత్సాహంగా ఫోన్ తీసింది.

మాట్లాడుతున్నది సత్యమూర్తి.

అతను మళ్ళీ రాత్రి 9 గం. ఫ్లైట్కి బొంబాయి వెళ్ళాలట అర్జంటుగా. ఇప్పుడు నేరుగా ఆఫీస్కి వెళ్ళి, అటునుంచీ అటే వెళ్ళిపోతాడట. కొన్ని ముఖ్యమయిన పేపర్స్ చూసుకుని సర్దుకోవాలి కాబట్టి ఇంటికి రాలేనన్నాడు.

విద్య ఎన్నో చెప్పాలనుకుంది. 'ఇంటికి వచ్చి ఒక గంటసేపు నాతో గడుపు సత్యం' అని అర్థించాలనుకుంది. కానీ ఏమి చేయలేకపోయింది. సత్యం హడావిడిగా ఎప్పుడు ఫోన్చేసినా, అతను చెప్పేది తను వినటమేగానీ, తను మాట్లాడటం అలవాటు లేదు. అందుకు అతను అవకాశమూ ఇవ్వడు. ఇప్పుడూ అదే జరిగింది.

ఉత్సాహమంతా పంచంపెద వాలిపోయింది. గాలి తీసేసిన బెలూన్లా అయింది విద్యమనని.

పోనీ తనంతట తను అతనికి ఫోన్చేసి మాట్లాడితే ఏం? ఒక్క మాటయినా ప్రేమగా మాట్లాడి, కొన్ని నిముషాలయినా తనకు కనిపించి వెళ్ళమని అర్థిస్తుంది అతన్ని. అలా అనుకున్న కొంచెంసేపటికి ఆఫీస్కి ఫోన్చేసింది.

ఒకసారి కాదు. అయిదు నిమిషాల కొకసారి చొప్పున మూడుసార్లు

చేసింది. అక్కడ ఫోన్ తీయటమే లేదు ఎవరూ. అంటే....అంటే.... అతను ఆఫీస్‌లో లేడన్నమాట మరి....మరి.... ఏమో ఎటయినా వెళ్ళి ఉండొచ్చు, తనకు అన్నీ చెబుతాడా? అసలు ఇంటికి రావటం ఇష్టంలేకే అలా చెప్పాడేమో! అఖరుకు తన ముఖం చూడటమే అతనికి అసహ్యం అయిందా? అసలు అతను మళ్ళీ బొంబాయినుంచి ఎప్పుడొస్తాడో అడగనేలేదు తను.

కళ్ళు మూసుకొని ఆలోచిస్తూ పడుకుంది విద్య. సన్నగా కణతల దగ్గర నొప్పి మొదలయింది. రెండు నిద్రమాత్రలు వేసుకుంటే బావుండు. హాయిగా నిద్రపోవచ్చు. కానీ లేవుగా మాత్రలు. ఏ డాక్టరూ రానివ్వటంలేదు. వెధవలు. వందలకి వందలు ఫీజులు గుంజుతారు. ఒదిగిన మాత్రలు రాసివ్వ టానికికేం రోగం!

పోనీ తనే వెతుక్కుంటూ వెళ్ళి, మారుమూల మందుల అంగడిలోనో అడిగి చూస్తే. ఏ సేల్స్‌మన్‌కో లంచం పెడితే ఇవ్వడూ! "చూద్దాం". అను కుని వానిటీబాగ్ చేతికి తీసుకుని, చెప్పులేసుకుని బయల్దేరింది గబగబా ఇంట్లోంచి బయటపడి, గేటు దాటుతున్న విద్యకేసి వాచ్‌మన్ నోరువెళ్ళబెట్టి చూస్తూ ఉండిపోయాడు. రాత్రి ఏనిమిది గంటలకి అమ్మగారిలా ఒక్కర్తే రోడ్డునబడిపోవటం వాడికి విచిత్రంగా ఉంది.

మరో అరగంటలో తిరిగి ఆటోలో వచ్చి ఇంటిముందు దిగేసింది విద్య. ఆమె బాగ్‌లో పోయేటప్పుడున్న వంద రూపాయల నోటు స్థానే ఇప్పుడు, ఎర్రటి కాప్సూల్స్ ఉన్న చిన్న సీసా ఒకటుంది. ఆటోవాడి సంగతికూడా మరచి ఆమె ఇంట్లోకి పరిగెత్తిపోతే, వాచ్‌మెన్ డ్రైవర్‌కు డబ్బులిచ్చి పంప వలసొచ్చింది.

*  *  *

'రాహుల్ ఫర్నిషర్స్'తో కాంట్రాక్ట్ విషయం మాట్లాడి, మహేశ్ ఆఫీసుకు వచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది.

"సర్! ఎమ్.డీ.గారి ఇంటినుంచి మీకు మూడుసార్లు కాల్ వచ్చింది" అని చెప్పింది రిసెప్షనిస్ట్.

"మిసెస్ మూర్తి చేశారా!" అని అడిగాడు రిసెప్షన్ దాటి లోపలికి వెళ్ళ బోతూ.

"కాదు సర్. ఇంట్లో సర్వెంట్ అనుకుంటా"

మహేశ్ అడుగులు అక్కడే ఆగిపోయాయి. ఎందుకో అతని గుండె

వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. అలాగే గిరుక్కున వెనుదిరిగి, బయటికి పార్కింగ్ స్పేస్ దగ్గరకి వెళ్ళిపోయాడు.

వాచ్‌మన్, తోటమాలి, వంటమనిషి, మరో నౌకరు వరండాలోనే నిలుచుని గుంభాగా ఏదో మాట్లాడుకుంటున్నారు.

"తెల్లవారినుంచీ అమ్మగారు పడకగదిలోంచి బయటకి రాలేదయ్యా. తలుపులు బిడాయించుకున్నారు. ఎంత పిలిచినా పలకడం లేదు" వంటమనిషి చెప్పింది.

ఒక గునపం తెప్పించి, మిగతా ముగ్గురి సహాయంతో తలుపులు పగుల గొట్టించాడు మహేశ్. నైట్‌గౌనులో అస్తవ్యస్తంగా పడిఉంది విద్య. నోట్లోంచి నురగ వస్తున్నది. ఒకవయిపు బుగ్గ, దిండుగలేబు తడిసిపోయాయి. పక్కనే టీపాయ్‌మీద ఆమె వానిటీబాగ్ ఉంది. మహేశ్ అనుమానంగా అందులో చేయిపెట్టి వెతికాడు. ఎరుపు రంగు కాప్స్యూల్స్ ఉన్న సీసా దొరికింది. తీసి జేబులో వేసుకున్నాడు. వెంటనే నర్సింగ్ హోమ్‌కి అంబులెన్స్ కోసం ఫోన్ చేశాడు.

విద్యను ఎమర్జెన్సీలో చేర్చి, జేబులో ఉన్న కాప్సూల్స్ డాక్టర్‌కి అందించాడు మహేశ్. చాలా ఆలస్యం చేశారని అంటూనే, డాక్టరు అవసరమయిన ట్రీట్‌మెంట్ అంతా ఏర్పాటుచేశాడు

బయట కూచునిఉన్న మహేశ్ దగ్గరికొచ్చి, "ఆవిడకి నిద్రమాత్రలు అలవాటా?" అని అతగాడు.

మహేశ్ తనకు తెలిసిందీ, తను చేసిందీ అంతా చెప్పాడు.

"ఓహో! తప్పనిసరిగా ఏ మారుమూల డ్రగ్గిస్ట్ దగ్గరకో వెళ్ళుంటుంది వాటికోసం. ఊరు, పేరు లేని ఫేక్ కంపెనీ తయారుచేసిన కాప్సూల్స్ ఇవి. ఇలాంటి వాటికి బిల్స్‌కూడా ఇవ్వరు కాబట్టి మనమేం చేయలేం. మామూలు నిద్రమాత్రలు, తన అలవాటు లాగా, రెండో మూడో వేసుకుంటారు. అందుకు ఇలా అయింది" అనుకుంటూ పైకి అన్నాడు డాక్టరు.

ఆ రాత్రి అంతా మహేశ్ అక్కడే, విద్యకు సెలైన్ పెట్టిన సూది చేతి మీద కదలకుండా పట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు.

మూడవరోజు సత్యమూర్తి వచ్చేసరికి లేచి కూచుని ఉంది విద్య. వెళ్ళి మంచంమీద కూర్చుని, ఆమె చేతిని పట్టుకుని, "విద్యా! ఎందుకిలా చేశావ్?"

అనడిగాడు. అతని కళ్ళు నీళ్ళు నిండుతున్నాయి. అతని గుండెల్లో తల దాచుకుని వెక్కి-వెక్కి ఏడ్చేసింది విద్య.

"అయామ్ సారీ! నన్ను క్షమించవూ? నన్ను దూరం చెయ్యొద్దు. నాకు పిచ్చెక్కిపోతుంది. నేనేం చేస్తున్నదీ నాకు తెలీదు." అంటోంది మధ్య మధ్యలో.

అంతలో మహేశ్ వచ్చాడు.

సన్నిహితంగా కూర్చుని ఉన్న వాళ్ళద్దర్నీ చూడగానే సంతోషం వేసింది ఆతనికి. "నువ్వు లేవు, విద్య ఎంత కంగారుపెట్టిందో తెలుసా? ముప్పు తిప్పలు



పెట్టింది నన్ను" అని నవ్వుతూ సత్యానికి చెప్పి. "ఇదుగో నమ్మా నీ కోసం మంచి పుస్తకాలు తెచ్చా చూడు. హాయిగా ఇవి చదువుకుంటూ విశ్రాంతి తీసుకో" అంటూ చేతిలో ఉన్న పాకెట్ విప్పి అయిదు పుస్తకాలు తీసి, విద్య ముందర పరిచాడు. ఒకటి ఆచార్య రజనీష్‌ది "ది ఎవల్యూషన్ ఆఫ్ మాన్," రెండోది ఇర్వింగ్ వాలస్ వ్రాసిన "సెవెన్ మినిట్స్." మూడవది నార్మన్ విన్సెంట్ పీలేది, "ఫ్లవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్," మరోటి పురాణం సీత

"ఇల్లాలి ముచ్చట్లు" వ్యాస సంపుటి. ఆఖరుది డా॥ వేన్ డయర్ వ్రాసిన "స్కై ఈజ్ ది లిమిట్."

మహేశ్ సెలక్షన్ చూసి ఆశ్చర్యపోయాడు సత్యమూర్తి.

"ఈ పుస్తకాలన్నీ నువ్వు చదివినవా" అడిగాడు.

"అబ్బే నాకేం అర్థమవుతాయిరా? షాపువాడిస్తే తీసుకొచ్చాను. విద్యకు నచ్చుతాయేమోనని"

ముగ్గురూ ఒకచోట కూర్చుని అలా కబుర్లు చెప్పుకుంటూ ఉంటే పాత రోజులు గుర్తొచ్చాయి విద్యకు.

వారం తర్వాత విద్యను డిస్‌ఛార్జ్ చేసారు.

అంతకుముందే విద్య సత్యంకి, మహేశ్‌కి తెలియకుండా ఒక నిర్ణయం తీసుకుంది. ఇంటికి వెళ్ళినప్పట్నించీ, ఇంట్లో అర్జంట్ పేపర్స్ ఏవయినా టైపు చేసుకుందుకు సత్యమూర్తి ఉంచుకున్న పోర్టబుల్ మిషన్ బయటకి తీసి దుమ్ము దులిపింది. పేపర్లో స్టెనోగ్రాఫర్ కావాలని వేస్తున్న ప్రకటనలకి అప్లికేషన్లు వేసి, జవాబులకోసం చూస్తూ, టైప్ ప్రాక్టీసు చేస్తోంది. షార్ట్‌హాండ్ పుస్తకాలు కూడా బయటికితీసి పెట్టుకుంది. అయితే ఇవన్నీ సత్యమూర్తి ఇంట్లో లేనప్పుడు మాత్రమే.

సత్యం ప్రవర్తన మామూలే. అతి తక్కువ సమయం ఇంట్లో ఉంటున్నాడు. కానీ ఆ కాస్సేపు అయినా వృధా అవకుండా, అతన్ని అంటిపెట్టుకుని తిరుగుతోంది విద్య.

* * *

ఆవేళ శనివారం.

విద్య షాపింగ్ చేయాలి, త్వరగా ఇంటికి రమ్మని ఫోన్‌చేసింది సత్యమూర్తికి. ఎప్పటిలా మహేశ్‌కో, పూర్ణిమకో, చేస్తే సరి అని వెంటనే అనుకోలేకపోయాడు సత్యం. ఈ మధ్య కొంచం హుషారుగా ఉంటోంది. ఆమెను నిరుత్సాహ పరచడమా? మరి సులభతో ఉన్న వీక్లీ ప్రోగ్రాం?

చేతిలో ఉన్న పెన్‌తో తెల్లకాయితం మీద పిచ్చిగీతలు గీస్తూ కూచున్నాడు. ఫోన్ మోగుతోంది.

మాట్లాడుతున్నంతలో సులభ "హలో సత్యం మీరేగా నా కారు గారేజీకి వెళ్ళింది. మీరు వస్తూ నన్ను పికప్ చేసుకుంటారుగా. నే వెయిట్ చేస్తాను.

అన్నట్లు ఈవేళ 'చౌదప్ప మెమోరియల్‌లో' మంచి ఇంగ్లీషు డ్రామా ఉంది. టికెట్స్ రెడీగా ఉన్నాయి. కాస్త త్వరగా వచ్చేయండి" అంటోంది.

అతి కష్టంమీద "అలాగే" అని ఫోన్ పెట్టేశాడు.

విద్య తనకోసం కూడా బట్టలు కొనాలని అన్నట్లు గుర్తుంది. అలాంటప్పుడు సలహా ఇవ్వటానికి, పూర్ణిమకన్నా మహేశ్ అయితే నయమేమో. ఇంటర్‌కమ్‌లో మాహేశ్‌ని పిలిచి చెప్పాడు, ఇంటికి వెళ్ళమని.

విద్య మేకప్ చూడగానే బ్యూటీపార్లర్‌కి వెళ్ళి వచ్చిందని తెలిసిపోయింది మహేశ్‌కి. గాడీగాఉన్న మైసూర్ సిల్క్ చీర కట్టుకుని మెరిసిపోతూంది. చాలారోజుల తర్వాత ఆమెను అలా చూడటం అతనికి చాలా సంతోషాన్ని కలిగించింది. పైపెచ్చు సత్యం బదులు తను వచ్చినా నిరుత్సాహపడినట్లు కనిపించలేదు.

"మహేశ్! నువ్ నన్ను కంగ్రాచులేట్ చేయాలి. అన్నట్లు ఇది రహస్యం. ఎవరికీ, ముఖ్యంగా నీ స్నేహితుడికి అసలు చెప్పొద్దు."

"అసలు విషయం చెప్పకుండా, రహస్యంగా ఉంచటం ఏమిటి?"

"నా కుద్యోగం వచ్చింది. ఇంట్లో బోర్‌తో పిచ్చిపట్టిపోవడంకన్నా నయం కదూ? సత్యాన్ని అడిగితే ఒప్పుకోడని చెప్పకుండానే అప్లయిచేసి ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చాను. ఎల్లుండి చేరిపోతున్నా."

"అది సరే! ఏ కంపెనీలో ఏం ఉద్యోగం నువ్ చెప్పనేలేదు సుమా."

"అయ్యో! నా మతి మండినట్లుంది. అదే మహేశ్ నీకు తెలిసే వుంటుంది, 'లాంగ్వేజ్ కోఆర్డినేటర్స్, ఇంటర్నేషనల్ అనే కంపెనీలో, స్టెనోగ్రాఫర్‌గా. మేనేజింగ్ డైరెక్టర్ స్వయంగా ఇంటర్వ్యూ చేసింది. అన్నట్లు ఆవిడ నా కన్నా వయసులో చిన్నదే ఉంటుందేమో. ఎంత డైనమిక్ లేడీయో అంత మంచి మనిషి. స్మార్ట్‌గా ఉంటుంది. స్వీట్‌గా మాట్లాడుతుంది. అసలు నిన్నే చేరిపోదామనుకున్నా. ఆవిడే చెప్పింది సోమవారం మంచిరోజు, ఆవాళ జాయిన్ అవు అని. అలాంటి నమ్మకాలు ఆవిడకి చాలా ఎక్కువట."

గుక్కతిప్పుకోకుండా చెబుతోంది విద్య.

"ఆవిడ పేరేమిటి విద్యా?"

"మిస్ శర్మ.... మిస్ సులక్షణశర్మ అనుకుంటాను...."

మహేశ్ తలలో ఎక్కడో గంటలు మ్రోగినట్లయింది. ఎక్కడో

విన్నాడు పేరు. 'లాంగ్వేజి ఇంటర్నేషనల్' తనకు వ్యాపారరీత్యా పరిచయమే. 'సులభ' అన్న పేరే అతనిలో ఏవో జ్ఞాపకాలని తిరగదోడుతోంది.

'ఓహ్ గుర్తొచ్చింది. ఆ వేళ బర్త్‌డే పార్టీకి సత్యాన్ని మాత్రమే ఆహ్వానించానని చెప్పిన వ్యక్తి. ఆమె సులభ ... సత్యంతో ఆమె స్నేహం ఏ దశలో ఉన్నదో! మొదటిసారి తానాపేరు విని ఆరునెలలు పయినే అయింది.... ఇప్పుడేం చేయాలి? నువీ ఉద్యోగం చేయద్దు– అని విద్యకు చెబితే కారణం చెప్పాల్సి వస్తుంది. ఏమని చెబుతాడు. ఇన్నాళ్ళకి, తనకు తాను సంపాదించుకుని, విద్య తన స్వశక్తితో, తనకో వ్యాపకాన్ని ఏర్పరచుకుంటే తను అడ్డుపడటం ఎలా?' మహేశ్ ఆలోచనలు తెగటంలేదు.

పరధ్యానంగానే విద్య వెంట బజారుకు వెళ్ళాడు.

*  *  *

కాపీసెక్షన్ హెడ్ కామరాజు మరో నెల రోజుల్లో రిజయిన్ చేయదలచుకున్నానని నోటీస్ ఇచ్చాడు.

వాన్‌సన్ వారి 'సన్‌షైన్'. మరియ 'చిన్నకారు' ప్రాజక్టుల వర్కు మంచి పట్టులో సాగుతున్నది. ఇలాంటి సమయంలో కామరాజు నిష్క్రమణవల్ల చాలా సమస్యలున్నాయి.

కాపీ సెక్షనలో ఉన్నవాళ్ళంతా ఎక్కువ అనుభవం ఉన్నవాళ్ళు కాదు, వాళ్ళని ఎవరిని హెడ్‌చస్తే బావుంటుందో నిర్ణయించటం కష్టమే.

ఆలోచిస్తూ తను ప్రత్యేకంగా కోరినమీదట, తని అప్రూవల్ కోసం వచ్చిన, 'సన్‌షైన్' మాగజయిన్ అడ్వటయిజ్‌మెంట్ కాపీ చదువుతున్నాడు సత్యమూర్తి. అది ఇంగ్లీష్ కింది అర్థం వచ్చేలాగా ఉంది.

*చిన్నపిల్లలున్న తల్లులందరికీ ఒక గొప్ప వార్త!*

చాలామంది పిల్లలు సరిగ్గా పళ్ళు తోముకోరు. అందుకని వాన్‌సన్ కంపెనీవారు, వీరికోసం కొత్త ఫ్లోరైడ్‌టూత్‌పేస్ట్ ఒకదాన్ని తనిపెట్టారు. మీరు పిల్లలున్నవారయితే, ఈ ప్రకటన పూర్తిగా చదవండి

మార్కెట్లో ఫ్లోరైడుయుక్త టూత్‌పేస్ట్‌లు చాలా ఉన్నాయి. అయితే మరి సన్‌షైన్ ప్రత్యేకత ఏమిటి? పళ్ళ డాక్టర్లు 'ఫాస్ట్ డిస్పర్సల్ రేట్' కలిగిన టూత్‌పేస్ట్ మంచిదని అనటం వింటూ ఉంటారు. దీనికి అర్థం, పళ్ళమీద టూత్‌పేస్ట్ కరిగి, వ్యాపించేందుకు పట్టే సమయం అని.

(ఇక్కడ సన్‌షైన్ టూత్‌పేస్ట్ ట్యూబ్ ఫోటో ఒకటి ఉంటుంది ఫోటో క్రింద) సన్‌షైన్‌లో స్టానస్ ఫ్లోరైడ్‌తోబాటు, ఒక నీలిరంగు జెల్ ఉంటుంది. ఇది పేస్ట్‌ను అతి తక్కువ సమయంలో కరగనిచ్చి, అతి వేగంగా పంటిపొరలపై వ్యాపించేలా చేస్తుంది.

ఈ జెల్‌లోని ఒక ప్రత్యేక ఫార్ములా ప్రభావంవల్ల, 'సన్‌షైన్' పళ్ళ మీద ఎనామిల్‌ని పోగొట్టకుండా, మృదువుగా పనిచేయగలదు.

*పిల్లలకోసం ప్రత్యేకమయిన రుచి!*

(ఇక్కడ పళ్ళుతోముకుంటున్న చిన్నపిల్లవాడి ఫోటో బస్ట్ వరకూ వస్తున్నది, దాని తర్వాత),

పళ్ళను ఎంత ఎక్కువసేపు, ఎక్కువసార్లు తోమితే, అంత శుభ్రం అవుతాయనీ డాక్టర్లు చెబుతారు. కానీ టూత్‌పేస్ట్ రుచి నచ్చకపోతే, పిల్లలు ఎక్కువసేపు తోమడానికి ఇష్టపడరు.

అందుచేతనే, ప్రత్యేకించి పిల్లలకి నచ్చే రుచిగల రసాయనిక పదార్థాలను సమ్మేళన పరచి, అతి జాగ్రత్తగా తయారు చేయబడింది, సన్‌షైన్.

వెయ్యిమంది పిల్లలతో జరిగిన సర్వేలో, ప్రతీ ముగ్గురిలో ఇద్దరుపిల్లలు, ఇతర ఫ్లోరైడ్ టూత్‌పేస్టుల కన్నా, సన్‌షైన్ రుచి బావుందని అంగీకరించారు.

*సన్‌షైన్ గురించి మీ డాక్టర్ని అడగండి.*

స్టానస్ ఫ్లోరైడు కలిగి, 'ఫాస్ట్ డిస్పర్సల్ రేటు', పిల్లలకి అత్యంత ప్రీతిపాత్రమయిన రుచిగల 'సన్‌షైన్' టూత్‌పేస్ట్‌ను గురించి, మీ పళ్ళ డాక్టర్ని సంప్రదించండి.

(ఇక్కడ డాక్టర్‌గారి ఫోటో వద్దు, ఎందుకంటే, ఇతర ఫ్లోరైడు పేస్ట్ ఏడ్స్ అన్నింట్లోనూ డాక్టర్ల ఫోటోలున్నాయి. అందువల్ల ప్రత్యేకత లోపిస్తుంది).

*సన్‌షైన్‌తో మీ పిల్లల పళ్ళు పాడయిపోకుండా కాపాడుకోండి.*

(సన్‌షైన్ ఎకానమీసైజ్ పేస్ట్, సన్‌షైన్ టూత్‌బ్రష్ కలిపి తీసిన ఫోటో)

శ్రద్ధగా కాపీని మొదటి అక్షరంనుంచీ చివరిదాకా చదివాడు సత్యమూర్తి. మళ్ళీ ఇంకొకసారి చదివాడు.

వెంటనే ఇంటర్‌కమ్‌లో కామరాజును పిలిచి అడిగాడు, "సన్‌షైన్ కాపీ వ్రాసిందెవరు?" అని.

"నారాయణరావు సర్."

"అతన్ని వెంటనే నా దగ్గరికి పంపించు" అన్నాడు.

తను కంపెనీ ప్రారంభించి, కాపీరైటింగ్ స్వయంగా చేయటం మాను కున్న తర్వాత, చూసిన వందలాది కాపీల్లో, పూర్తిగా 'పర్ఫెక్ట్'గా కనిపిస్తున్నది తన ఎదురుగా ఉన్నదే అనిపిస్తోంది సత్యమూర్తికి. అతని సమస్య తీరిపోయింది.

నారాయణరావు వచ్చాడు. కుర్చీలోంచి లేచి ఇవతలికి వచ్చి, నారాయణ రావు చేయి అందుకుని, "కంగ్రాచులేషన్స్" అన్నాడు సత్యమూర్తి.

అతని అయోమయాన్ని అర్థంచేసుకుని, మళ్ళీ తనే, "మీ హెడ్ వెళ్ళి పోతున్నాడు తెలుసు కదూ. వచ్చే నెల ఫస్టునుంచీ నువే కాపీసెక్షన్కి హెడ్వి. యువర్ కాపీ ఫర్ 'సన్షైన్' ఈజ్ బ్యూటిఫుల్," అన్నాడు చిరునవ్వుతో.

నారాయణరావు సంతోషానికి అవధుల్లేవు.

అతను జీతంకోసం ఉద్యోగం అన్నట్లు కాకుండా, కాపీరైటింగ్లో ఒక ప్రత్యేకమయిన శ్రద్ధ, ఆసక్తితో పనిచేస్తూ వచ్చిన వ్యక్తి. అందువల్ల ఈ మెప్పుదల అతన్ని అపరిమితంగా సంతోషపెట్టింది.

"థాంక్యూ సర్ థాంక్యూ వెరీమచ్" అంటూ బయటికి నడిచాడు.

సత్యమూర్తికి ఏవో జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. నారాయణరావు స్థానంలో తన్నూహించుకున్నాడు. ఎందుకంటే దాదాపు మూడు వందల పదాలు మాత్రమే గల ఏడ్కాపీని తయారుచేయటానికి. నారాయణరావు ఎన్ని గంటలు, రోజులు శ్రమించి ఉంటాడో అతనూహించగలడు.


విద్యలో తను పెళ్ళిఅయిన మొదటి సంవత్సరం అంతా తను నిరుద్యోగి. మహేశ్ మార్కెట్లో విద్య ఆఫీసులో పనిచేస్తోంటే, తను ఉద్యోగాల కోసం ఊళ్ళో ఉన్న ఆఫీసులన్నీ, రోజుకొక ప్రాంతం చొప్పున సర్వే చేసేవాడు.

ఆ రోజుల్లో సత్యమూర్తికి మాగజీన్లలో, పేపర్లలో అడ్వర్టయిజ్మెంట్లు చూడటమే గానీ, వాటిని తయారుచేసేందుకు ప్రత్యేకంగా కొన్ని ఏజన్సీలు, కంపెనీలు ఉంటాయని కూడా తెలీదు

అలాంటప్పుడే 'అక్షర' అని బోర్డ్ వేసి ఉన్న ఒక ఆఫీసులోకి వెళ్ళి, ఖాళీలేమయినా ఉన్నాయేమో అని అడగబోయాడు. నిజానికి 'అక్షర' అంటే ఏమిటో, అది ఏ ఆఫీసో అతనికి తెలీదు.

చాలా చిన్న ఆఫీసు. బయట రిసెప్షనిస్ట్ కూడా లేడు.

నేరుగా లోపల హాల్లోకి వెళ్ళాడు అక్కడొక టేబిల్ దగ్గర, దాదాపు




నలభయి సంవత్సరాల వయసుగల కళ్ళజోడువ్యక్తి కూర్చుని ఉన్నాడు. చూడగానే తమిళుడని తెలుస్తోంది.

సత్యమూర్తి అసలేమీ మాట్లాడకముందే, "నీకు తెలుగు వచ్చా?" అని అడిగాడు. ఇంగ్లీష్‌లో తెలుసనన్నాడు సత్యమూర్తి.

"ఇలా కూర్చో చెప్తా" అని సత్యమూర్తిని కూచోబెట్టాడు.

అయోమయంగా తన వయపు చూస్తూ కూర్చునిఉన్న సత్యం వయపు, మూడు కాయితాలు జరిపాడు ఆయన.

"ఇదుగో దీన్ని లేఅవుట్ అంటారు. ఇది ఒక మేగజయిన్లో రావలసిన అడ్వటయిజ్‌మెంటు. దీన్ని ఈ కాపీనుంచీ తయారుచేశారు. ఈ కాపీకి ఇంగ్లీషు మాతృక ఈ కాయితంలో ఉంది. తర్జుమా అయిన కాపీలో ఉన్న విషయం, లేఅవుట్‌లో సరిగ్గా ఉందో లేదో చూసి చెప్పు."

అదొక సాఫ్ట్‌డ్రింక్ అడ్వటయిజ్‌మెంటు. సత్యమూర్తి ఇకేం ఆలోచించకుండా, రెండిట్నీ పోల్చిచూసాడు.

"మూడు చోట్ల తప్పులున్నాయి" అని సూచించాడు, పెన్సిల్‌తో వెంటనే.

ఆయన లోపలున్న మరొక వ్యక్తిని పిలిచి, ఆ తప్పులు చూపించి సరిదిద్దుకుని రమ్మన్నాడు.

"రక్షించావు. మరొక్క అరగంటలో వాటికోసం మా క్లయింటు వస్తాడు. నేను తమిళం, కన్నడం అర్థంచేసుకోగలను. తెలుగు మాత్రమే రాదు."

"అయితే ఆ తర్జుమా చేసిందెవరు?"

"ఆ పనిచేసే కంపెనీలు కొన్ని ఉంటాయి. అక్కడ చేయిస్తాం. ఇప్పుడు దీన్నక్కడికి చెకింగ్‌కి పంపిస్తే, రేపటిగ్గానీ రాదు.

లోపలినుంచీ మరొక వ్యక్తి బిల్‌బుక్ ఒకటి తీసుకొచ్చాడు. అందులోంచి ఒక కాయితం చింపి పదిరూపాయలకి రసీదు రాసి సత్యమూర్తిని సంతకం పెట్టమన్నాడు. కాయితం వెంబడే పదిరూపాలకి చెక్ ఇచ్చాడు.

అప్పుడు అడిగాడా అయోమయం వ్యక్తి, "అసలు నువ్వెవరు. నిన్నెవరు రమ్మన్నారు?" అని.

సత్యమూర్తి చెప్పిందంతా విని, "నువ్వొక పని చెయి. రోజుకు గంట సేపు మా ఆఫీసుకు వచ్చి పనిచేస్తూ ఉండు. ఇంగ్లీష్‌నుండి తెలుగుకు తర్జుమా చేయటం, చేసిన లేఅవుట్లను చెకింగ్‌చేయటం ఈ పని చేస్తూఉండు. నీకు కన్నడం వచ్చా?" అనడిగాడు.

"బాగా రాదు. నేర్చుకుంటున్నా" నన్నాడు సత్యమూర్తి.

"త్వరగా నేర్చుకో. ట్రాన్స్‌లేటర్స్‌కి ఎన్ని భాషలు వస్తే అంత ఉపయోగం."

అప్పటికప్పుడు పార్ట్‌టయిం ట్రాన్స్‌లేటర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ సత్యమూర్తి చేతికి వచ్చింది.

మరుసటి రోజే కొన్ని లీడింగ్ ఏడ్‌కంపెనీల చిరునామాలు సంపాదించాడు సత్యమూర్తి. ఒక్కొక్క రోజు ఒక్కొక్క చోటికి వెళ్ళి, ట్రాన్స్‌లేటర్‌గా చేస్తానని ఆఫర్‌చేసాడు. అతను పని కంపెనీల దగ్గరికి వెళితే మూడింట్లో అపాయింట్ చేసుకున్నారు. నాలుగు ఆఫీసులకీ రోజూ ఒకటి తర్వాత ఒకటి వెళ్ళేలా టయిమింగ్స్ ఏర్పరుచుకున్నాడు.

ఆరునెలలు ఈ రకంగా చేసేసరికి, ఏడ్‌ఏజన్సీల వర్క్ అంతా ఎలా జరుగుతుందో అర్థంఅయింది సత్యమూర్తికి. ప్రత్యేకించి, అతనికి కాపీరైటింగ్ మీద ఆసక్తి హెచ్చింది

ఆరునెలలు గడిచేసరికి, 'జే ఆర్ పబ్లిసిటీస్'లో కాపీరైటర్‌గా ఉద్యోగం

సంపాదించాడు సత్యమూర్తి. ఒక సీనియర్‌కి అసిస్టెంటుగా వేసారు ఇతన్ని. అతను చాలావరకు కొన్ని పాయింట్లు ఇచ్చి, కాపీలన్నీ సత్యాన్నే వ్రాయమనే వాడు. కాపీ చివరికి అందులో సగానికి సగం మార్చివేయటమో, ఇది బాగులేదని మళ్ళీమళ్ళీ సత్యాన్నే వ్రాయమనటమో చేసేవాడు. ఎన్నిసార్లు వ్రాయవలసి వస్తే, అన్ని రకాలుగా, తన ఊహలను బయటపెట్టడం నేర్చుకుంటున్నట్లు భావించే వాడు కనుక, సత్యమూర్తికి విసుగనిపించేది కాదు.

ఒకసారి 'డెయిలీ న్యూస్' అనే దినపత్రిక సేల్స్ ప్రమోషన్ కోసం అడ్వటయిజ్‌మెంటు తయారుచేయవలసి వచ్చింది. దాని కాపీ సత్యమూర్తి ఇలా రాశాడు.

*ఒక రూపాయి ఖరీదుచేసే న్యూస్‌ప్రింట్‌ని అరవయి అయిదు పైసలకి ఎందుకు అమ్ముతున్నాం?*

(హెడింగ్ కింద న్యూస్‌పేపర్ ఫోటో ఒకటి వస్తుంది)

మీరు ప్రతీరోజూ చదివే 'డెయిలీ న్యూస్' పేపరు పదహారు పేజీలు అంటే దాదాపు ఒక రూపాయి ఖరీదుచేసే న్యూస్‌ప్రింట్ పేపరుతో తయారు అవుతుంది. ఈ రూపాయికి ప్రింటింగ్, ఇంకు, మిగతాఖర్చులు అన్నీ చేర్చిచూడండి.

అయినా మీరు కేవలం 65 పై. మాత్రం ఖర్చుచేసి 'డెయిలీ న్యూస్' చదువుతున్నారు. ఇది ఎలా సాధ్యం ?

'డెయిలీ న్యూస్'ని రోజుకు కొన్ని లక్షలమంది చదువుతారు. ఇందులో ఎన్నోరకాల అభిరుచులు. ఇన్ని అభిరుచులను సంతృప్తిపరిచేందుకే మామూలు వార్తలతోబాటు సంగీతం, నృత్యం, చిత్రకళవంటి లలితకళలు, క్రీడారంగం, విజ్ఞానం, వ్యాపారం, వాణిజ్యంవంటి వివిధ రంగాలపైన వార్తలు, వ్యాసాలతో వారంలో ఒక్కొక్కరోజు ఒక ప్రత్యేకతను సంతరించుకుని మీ చేతుల్లోకి వస్తోంది 'డెయిలీ న్యూస్.'

ప్రకటనదారులు తమ ఉత్పత్తులు, వస్తువులు, సినిమాలు ఉద్యోగాలు, కార్లు, యాత్రాస్థలాలు వంటి వాటిని గూర్చి, 'డెయిలీన్యూస్' చదువరులకు తెలియజేయడానికి పోటీపడుతుంటారు. ఇందుకోసం వీరు కొన్ని లక్షల రూపాయలు వెచ్చిస్తారు. ప్రకటనదారుల లిస్ట్‌లో ప్రథమస్థానం 'డెయిలీ న్యూస్'దే ఎందుకంటే జాతీయ వార్తాపత్రికలో అత్యధికంగా చదవబడే పత్రిక 'డెయిలీ న్యూస్' కనుక.

అందుకే మేం ఒక రూపాయి ఖరీదుచేసే న్యూస్‌ప్రింట్‌ని, 65 పైసలకే అమ్ముతున్నాం. ఈ రోజుల్లో ఇంతకన్నా ఎక్కువ ఉపయోగం తక్కువ ఖరీదు గల మరే వస్తువునయినా మీరు కొనగలరా?

(క్రింద 'ది డెయిలీ న్యూస్' అని పెద్ద అక్షరాల్లో వస్తుంది).

సమయానికి సత్యమూర్తి సీనియర్ లీవ్‌లో ఉన్నందువల్ల కాపీ మరే మార్పులు, చేర్పులు లేకుండా అలాగే ప్రెస్ కంపోజింగ్‌కి పంపించాడు. లేఅవుట్ కూడా అయిపోయింది.

మరురోజు ఉదయం సత్యమూర్తి ఆఫీస్‌కి రాగానే, జేఆర్ (జాన్ రాబిన్సన్‌కి పొడి అక్షరాలు) నుంచీ పిలుపు వచ్చింది.

తను పంపిన లేఅవుట్‌లో పెద్ద పొరపాటేదో జరిగి ఉంటుంది. అది క్లయింటికి వెళ్ళిపోయింది కూడా. 'అంటే ఇవాల్టితో నా ఉద్యోగం ఆఖరు అయినట్లే' అనుకుంటూ నిస్పృహగా లోపలికి వెళ్ళాడు

జేఆర్ ఆంగ్లోఇండియన్. సైడ్ బర్న్స్‌తో కలిసేంత పెద్ద పెద్ద మీసాలు. భారీమనిషి, పెద్దపులిలా ఉంటాడు. ఎదురుగా నిలుచుని మాట్లాడేవాళ్ళెవరూ ఆయన కళ్ళలోకి చూడలేరు.

"'డెయిలీ న్యూస్' ఏడ్ కాపీ వ్రాసింది నువ్వేనా?" ఆయన మామూలుగానే అడిగినా గర్జించినట్లే ఉంది సత్యమూర్తికి.

"యస్ సర్."

"నువ్విక్కడ చేరి ఎన్ని సంవత్సరాలయింది."

"ఆరునెలలు అయింది సర్."

"నీ జీతం ఎంత?"

"నాలుగు వందలు సర్."

"నీ కాపీ సుపర్బ్‌గా ఉంది యంగ్‌మాన్. వచ్చే నెలనుంచీ నీ జీతం ఆరు వందలు. ఆర్ యూ హేపీ?"

"ఎక్స్‌ట్రీమ్లీ సర్! థాంక్ యూ సర్ థాంక్ యూ వెరీమచ్ సర్."

* * *

ఆ వేళ సులభాశర్మ పర్సనల్ సెక్రెటరీ రాలేదు

అందుకని ఆ సీట్లో విద్య కూర్చుంది. పనిలో ఆమె చూపించే శ్రద్ధవల్ల అతిత్వరలో ఆమె సులభ అనుభవాన్ని సంపాదించుకుంది.

మధ్యాహ్నం మూడుగంటలకి మిస్ శర్మకోసం ఎవరో వచ్చారు. వచ్చిన



వ్యక్తి ఆవిడకి బాగా దగ్గరిమనిషి కావచ్చు. అక్కడ తనో మనిషి ఉన్నట్లు కూడా గుర్తించకుండా అతను నేరుగా లోపలికిపోవడం టైప్‌చేసుకుంటూ కూర్చుని ఉన్న విద్య గమనించింది.

అతను వెళ్ళిన కొన్ని నిముషాలకి లోపలనుండి పిలుపు వచ్చింది. "విద్యా, ప్లీజ్ రెండు కప్పులు కాఫీ తెప్పించి పంపిస్తావా?" అని చెప్పింది ఆవిడ.

చప్రాసీతో కాఫీ తెప్పించి రెండు కప్పుల్లో సర్దింది విద్య. మామూలుగా పి.ఎస్. వందన ఎన్నోసార్లు స్వయంగా కాఫీలు ట్రేలో లోపలికి తీసుకు వెళ్ళడం తనకు తెలుసు. అందుకని ట్రే తనే చేతపుచ్చుకుని, సంకోచంతో మెల్లిగా తలుపును తోసింది.

తలుపు సందులోంచి కనిపిస్తున్న దృశ్యం విద్యను ముందుకు అడుగు వేయనీయలేదు.

తన కళ్ళ ఎదురుగా తనదృష్టిని తప్పించుకుని లోపలికి వెళ్ళినవ్యక్తి సత్యమూర్తి కావడంలో ఆశ్చర్యం ఏమీలేదు కానీ అతను కూచునిఉన్న కుర్చీ చేతిమీద మిస్ శర్మ అతన్ని ఆనుకుని కూర్చుని ఉండటం, అతని చేయి ఆవిడ నడుంచుట్టూ ఉండటం చూసి తన కళ్ళను తానే నమ్మలేకపోయింది విద్య.

"అయితే ఈ శనివారం నాగ పెళ్తున్నానని, ఇవాళ నన్ను కాకాపట్టాలని వచ్చారన్నమాట. శనివారాలు, ఆదివారాలతో విసుగ్గాఉంది ఎటయినా ఒక నాలుగురోజులు తీరుబాటుచేసుకుని ఇద్దరం వెళ్ళొద్దాం సత్యం. నందీహిల్స్ అయితే బావుంటుంది కదూ?" అంటోంది ఆమె.

సత్యమూర్తి ఏమని జవాబు చెప్పాడో విద్యకు వినిపించలేదు. చేతిలో వణుకుతున్న ట్రేలోంచీ కాఫీకప్పులు రెండూ పెద్దగా శబ్దంచేస్తూ క్రింద పడటం మాత్రమే ఆమెకు తెలుసు ఒక్కక్షణం కూడా మరి అక్కడ నిలువలేకపోయింది. అరక్షణంలో తన బాగ్ చేతికితీసుకుని ఆఫీస్‌దాటి బయటపడింది.

కప్పుల శబ్దానికి వెనుదిరిగి చూసిన సత్యం, "విద్య.... విద్య.... ఇక్కడి కెలావచ్చింది?"

"సత్యం ఏమయింది మీకు? ఎందుకలా అప్‌సెట్ అవుతున్నారు? విద్య మా ఆఫీస్‌లో స్టెనోగ్రాఫరు. చేయి జారిందేమో పాపం.."

"మైగాడ్. ఎంత పనయింది. విద్య ఎవరో నీకు తెలీదుకదూ. అసలిక్కడ ఎప్పట్నుంచీ పనిచేస్తోంది . ఆమె ఎవరో తెలుసా . . ఆమె నా భార్య సులభా... షి ఈజ్ మై వైఫ్ యు నో... నే నిప్పుడేం చేయను?"

* * *

సాయంత్రం నాలుగు గంటలనుంచీ కారు వేసుకుని బెంగుళూరంతా తిరుగుతున్నారు సత్యమూర్తి, మహేశ్.

సులభ అఫీసునుంచీ నేరుగా సత్యమూర్తి ఇంటికివెళ్ళి చూసాడు. విద్య లేదు. వెంటనే మహేశ్‌కి ఫోన్‌చేశా అది మొదలు స్నేహితులిద్దరూ కలిసి విద్యకోసం వెతకడం ప్రారంభించాడు.

రాత్రి ఎనిమిదిగంటలయినా విద్య జాడలేదు. సత్యమూర్తికి ముచ్చెమటలు పోసేస్తున్నాయి. విద్యను మళ్ళీ ప్రాణాలలో చూడగలనా లేదా అనిపిస్తోంది అతనికి.

"విద్య అక్కడ పనిచేస్తోందని నీకు తెలుసా? అసలెప్పుడు ఉద్యోగంలో చేరిందో కూడా నాకు తెలీదు"

స్టీరింగ్ దగ్గరున్న మహేశ్, హార్న్ శబ్దంలో వినిపించదేమో అన్నట్లు "నాకు తెలుసు" అన్నాడు గట్టిగా. అతనికి చాలా కోపంగా ఉంది. సత్యమూర్తి తన ప్రాణమిత్రుడయి సరిపోయింది. లేకపోతే ఏంచేసిఉండేవాడో!

"మరి నాకు చెప్పనే లేదేం?"

"నాకేం తెలుసు? నువ్వక్కడ ఆఫీసులోనే విద్యకి, నీ రాసక్రీడలు చూపిస్తావని నే నూహించానా? ఆవిడతో నీ స్నేహాన్ని గురించి నాకు నువ్వేమయినా చెప్పావా? ఇన్ని మాటలెందుకులే సత్యం. నువ్ చేసిందొక పెద్ద నేరం! కానీ ఏ న్యాయస్థానమూ నిన్ను శిక్షించదులే!" మహేశ్ కసిగా అన్నాడు.

అతని కెందుకో, ఇంక విద్య మళ్ళీ తనకు కంటికి కన్పించదని నమ్మకంగా అనిపిస్తోంది. అందుకే మరీ బాధగా ఉంది. కళ్ళు మూసినా తెరిచినా, 'నాకు ఉద్యోగం వచ్చింది మహేశ్' అని ఆనందంగా చెబుతున్న విద్య ముఖమే కనిపిస్తోంది.

పక్కన సత్యమూర్తి కళ్ళకి చేతులు అడ్డం పెట్టుకుని లోలోపలే రోదిస్తుండటం తెలుస్తూనే ఉంది. అయినా మహేశ్ అతన్ని ఓదార్చే ప్రయత్నం ఏమీ చేయలేదు.

"విద్య దగ్గర డబ్బేమయినా ఉందా?" అడిగాడు సాలోచనగా.

"ఆమె అకౌంట్‌లో ముప్ఫయివేల దాకా ఉండొచ్చనుకుంటాను. సరిగ్గా గుర్తు లేదు."

"ఏ బ్యాంక్‌లో?"

"కెనరా బ్యాంక్, టవున్‌హాల్ బ్రాంచ్‌లో."

"ఆ బ్రాంచ్‌కి ఈవెనింగ్ కౌంటర్ ఉంది కదూ?"

"అవును."

కారు ఇరవయి నిముషాల్లో కెనరా బ్యాంక్ ముందర ఆగింది.

"ఆమె బ్యాంక్ కేమయినా వచ్చి వెళ్ళిందేమో లోపల అడిగిరా" అని ఆర్డర్ ఇచ్చినట్లే అన్నాడు మహేశ్.

పదినిముషాల్లో తిరిగివచ్చాడు సత్యమూర్తి.

"ఓహో. ఎంత ఫస్ క్లాసో చెప్పటానికి విజిటింగ్‌కార్డ్ చూశాక చెప్పారు. ఒక గంట ముందు విద్య వచ్చి, ఇరవయివేలు డ్రా చేసుకుని వెళ్ళిందట."

"ఇహ లాభంలేదు సత్యం. అది ఈ పాటికి ప్లేన్‌లోనో, ట్రెయిన్‌లోనో ఈ ఊరు వదిలి చాలా దూరం వెళ్ళిపోయుంటుంది. పద పోదాం."

ఇంటి ముందర కారు ఆగినా సత్యమూర్తి దిగలేదు.

"నన్నింకా ఎందుకు చిత్రవధ చేస్తావురా? నేనా ఇంట్లోకిప్పుడు వెళ్ళలేను. ప్లీజ్ నన్ను నీ ఇంటికి తీసికెళ్ళు మహేశ్" అన్నాడు సత్యం, మహేశ్ చేతులు రెండూ పట్టుకుని.

మహేశ్, 'శ్రీవిద్య'కి వైస్‌ప్రెసిడెంట్‌గా అపాయింట్ అయిన రోజు తనకంటూ ఒక అపార్ట్‌మెంటు తీసుకుని చేరిపోయాడు.

బాగా చిన్న ఇల్లు. ఉన్నవి రెండే గదులు.

శ్రీవిద్య స్టేటస్ పెరిగింది. సత్యమూర్తి బెన్‌సన్ టవున్‌లో స్వంతానికి ఇల్లు కట్టుకున్నాడు. మహేశ్ జీతం రెండువందల నుంచీ, నాలుగు వేలకి పెరిగింది. అయినా అతను రెండుగదుల అపార్ట్‌మెంటు వదల్లేదు.

సత్యమూర్తి కోరినట్లుగా కారును తన ఇంటికే పోనిచ్చాడు. సత్యమూర్తి ఇన్ని సంవత్సరాలలో, ఒక్కసారి అయినా ఇక్కడికి రాలేదు. రావలసిన అవసరం కూడా ఎప్పుడూ ఏర్పడలేదు.

తనవే పైజమా, చొక్కా ఇచ్చి సత్యాన్ని బట్టలు మార్చుకోమన్నాడు మహేశ్. గదిలో ఉన్నది ఒక్కటే మంచం. దానిమీద పరుపు, శుభ్రమయిన తెల్లని బెడ్‌షీటు పరిచిఉన్నాయి దిండు గలీబులు కూడా తెలుపువే.

గదిలో ఒక వయిపు గోడనిండూ బుక్‌షెల్ఫులు. వాటి నిండుగా రకరకాల పుస్తకాలు ఉన్నాయి మహేశ్ అవసరంలేని వస్తువేదయినా కొనే అలవాటులేదు. అంటే అతనీ పుస్తకాలలో చాలావరకు చదివేసి ఉండాలి. మహేశ్ వంట గదిలోకి వెళ్ళాడు.

సత్యమూర్తి పుస్తకాలని చూస్తూ నిలుచున్నాడు. ప్రపంచ చరిత్ర, సైన్స్, ఫిక్షన్, సైకాలజీ, సెల్ఫ్-హెల్ప్, తెలుగు ఇంగ్లీషు నవలలు, ఇలా వివిధ విషయాల మీద కొన్ని వందల పుస్తకాలున్నాయి. ఆశ్చర్యంవేసింది సత్యమూర్తికి. మహేశ్‌కి ఇలాగా పుస్తకాలు చదివే అభిరుచి ఉందని తనకు తెలీదు.

ఆనాడు వర్కింగ్‌హోంలో, విద్యకూ ఇతను పుస్తకాలు తెచ్చి ఇచ్చినప్పుడు తను అడిగిన ప్రశ్న, మహేశ్ సమాధానం గుర్తొచ్చాయి ఇన్నాళ్ళూ తానెరుగని మహేశ్ ప్రతిబింబాన్ని కొత్తగా చూస్తున్నట్లుంది సత్యానికి

రెండు గ్లాసుల్లో వేడి పాలు, రెండు అరటిపళ్ళు తీసుకుని లోపలినించీ వచ్చాడు మహేశ్.




"నా దగ్గరున్నదింతే. ఆకలిగా ఉంటే చెప్పు. హోటలు ఎదురుగానే ఉంది. ఫోన్ చేస్తే పంపుతారు."

"వద్దు మహేశ్. నా కసలేమీ వద్దురా. కడుపులో ఏదో వికారంగా ఉంది."

"ఏమీ తీసుకోకపోతే ఇంకా ఎక్కువవుతుంది" అని బలవంతంగా సత్యం చేత పాలు తాగించాడు.

"నువ్ మంచంమీద పడుకో. నేను దీంట్లో సర్దుకుంటాలే" అని పడక కుర్చీలో సర్దుకున్నాడు మహేశ్.

మహేశ్ పైజమా, చొక్కా సత్యమూర్తికి చాలా వదులుగా ఉన్నాయి.

పొడవు చాలకపోవటంవల్ల, మోకాలినుంచీ కొంచం క్రింద భాగం అంతా బయటికే ఉంది. కాళ్ళు చాచుకుని మంచంమీద పడుకున్న సత్యమూర్తికి, తాము ముగ్గురూ మొదటిసారి బెంగుళూరు చూడటానికి వచ్చినప్పుడు, లాడ్జింగ్ గదిలో, తను మంచంపక్కనున్న స్థలంలో పడుకుంటే, తలుపు దగ్గర అనుకునే నిద్ర పోయిన మహేశ్ గుర్తొచ్చాడు.

పడకకుర్చీలో పడుకుని ఉన్న అతని వయిపు చూసి, 'మహేశ్ ఏమీ మారలేదు.... తనో.... తనలో మార్పు శరవేగంతో వచ్చేసింది.... ఆ వేగానికి తట్టుకోలేకే విద్య తనకు దూరమవుతూ వచ్చింది' అనుకున్నాడు.

సులభ గుర్తొచ్చింది. 'తప్పంతా తనదే. అనవసరంగా సులభ నీ గొడవ లోకి లాగింది తనే. మొదటినుంచే ఆమెకు దూరంగా ఉండాల్సింది. రెండు రకాలుగా ఇద్దరికీ అన్యాయమే చేశాను తను' అనుకున్నాడు.

* * *

నెలరోజుల తర్వాత మహేశ్ పేరున ప్రయాగనుంచీ ఉత్తరం ఒకటి వచ్చింది.

విప్పి చూశాడు. అతను అనుకున్నట్లుగా అది విద్య నుంచే.

"ప్రియమిత్రుడు మహేశ్‌కు

మిమ్మల్నందర్నీ బాధించి ఉంటే నన్ను క్షమించండి.

నే నిప్పుడు ఇండియా అంతా టూర్ చేస్తున్నాను. ఇప్పటిదాకా నాలుగయిదు ఆశ్రమాలు చూశాను. మొత్తం యాత్ర అయిన తర్వాత నాకు నచ్చిన ఆశ్రమం చూసుకుని స్థిరపడిపోతాను.

నేను ఆత్మహత్య చేసుకున్నానని నువ్వు అనుకుని ఉండవని తెలుసు. ఎందుకంటే నే నంత పిరికిదాన్ని కాదని నీకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు.

నీ స్నేహితుని కిప్పుడు నా అవసరం లేదు. అయినా అతని కెప్పుడూ ఎవరి అవసరమూ లేదు. ఎంత కష్టాన్నయినా ఒంటరిగా ఎదుర్కొనగల శక్తి అతనికి ఉంది. నాకు మిస్. శర్మ గురించి బాగా తెలుసు. ఆవిడంటే నాకు చాలా గౌరవం ఉంది సత్యం ఆమెను పెళ్ళిచేసుకోవటం నాకే విధంగానూ అభ్యంతరం కాదనీ, నేను శాశ్వతంగా అతనితో తెగతెంపులు చేసుకుంటున్నాననీ, నేను స్టాంప్ పేపర్ మీద వ్రాసి సంతకంచేసి ఈ ఉత్తరంతో జతపరుస్తున్నాను. దాన్ని అతనికి అందజెయ్యి.

నువ్ మిత్రుడివి మాత్రమే కాదు ఒక్కొక్కసారి అన్నయ్యలాగా

సలహాలు ఇచ్చి నన్ను సరిదిద్దేవాడివి. మరోసారి తమ్ముడిలా, నా అభిమానాన్ని, అప్యాయతనూ కోరేవాడివి. ఇందుకు ప్రతిగా, వచ్చే జన్మంటూ ఉంటే, ఈ సారి నీ స్వంత చెల్లెలిగా పుట్టాలని కోరుకుంటున్నా మహేశ్.

సెలవ్, 'విద్య'"

మహేశ్ విద్య కోరినట్లే చేశాడు.

నెల రోజులకు సత్యమూర్తి సులభను పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళి అయిన మూడవరోజు సత్యమూర్తి ఆఫీస్‌లో అడుగుపెట్టేసరికి, ముందే మహేశ్ వచ్చి కాచుకు కూచునిఉన్నాడు.

"నీతో ఒక విషయం చెప్పాలిరా" అన్నాడు.

సత్యానికెందుకో ఆదుర్దాగా ఉంది. ఏమిటన్నట్లు చూశాడు.

"నేను రిటైర్ అవుదామనుకుంటున్నా సత్యం."

"రిటైర్ అవుతావా? నీ వయసెంతరా మహేశ్?"

"నలభయి రెండు. ముసలివాళ్ళయాకే రిటైరవాలనేం రూలు లేదే.... నాకెందుకో చాలా అలసిపోయినట్లుగా ఉంది సత్యం. హాయిగా విశ్రాంతి తీసుకుందామని ఉంది."

"ఉద్యోగం మానేసి ఊరికే కూచుంటే ఎలా తోస్తుంది? ఏం చేస్తావ్?"

"సెకెండ్‌హాండ్ బట్టల షాపొకటి ఓపెన్ చేద్దామనుకున్నా."

"నీకు పిచ్చేమయినా పట్టిందా మహేశ్."

"పట్టకూడదనేరా తప్పుకుందామనుకున్నది. నీ పుణ్యమా అని నాకు డబ్బుకు లోటులేదు. నువ్విస్తూ వచ్చిన జీతంలో, సగంపైనే మిగుల్తూ వచ్చింది. అది నాకు చచ్చేదాకా సరిపోతుంది. ఊరికే వ్యాపకంకోసం దుకాణం పెట్టాలని అనుకున్నా. నాకు లాభం వద్దు. పొద్దుపోతే చాలు."

"పొద్దుపోవటానికి సెకండ్‌హాండ్ దుకాణమే పెట్టాలా? ఏమిట్రా ఈ పిచ్చి?"

"పన్నెండేళ్ళక్రితం ఆ వ్యాపారం చేసే రోజుల్లో ఉన్నంత ప్రశాంతంగా, సంతోషంగా ఇంకెప్పుడూ ఉండలేదనిపిస్తుందిరా సత్యం."

ఉతికేసిన ఖాదీలాల్చీ, పైజమాలో వెళ్ళి, పాత బట్టల దుకాణంలో కూర్చునే మహేశ్‌ని, 'నాకేం తెలీదు మొర్రో' అంటున్నా వినకుండా, చక్కని సూటు కుట్టించివేసి, 'శ్రీవిద్య' ఆఫీస్‌లో, 'సేల్స్ మేనేజర్' అని నేమ్‌ప్లేట్ ఉన్న టేబిల్‌ముందర చేర్‌లో కూర్చోబెట్టినవాడు సత్యమూర్తే.

"నాకు తెలుసురా! నువ్వొక 'గుడ్ సేల్స్‌మాన్'వి. అందుకే నిన్నీ కుర్చీలో కూర్చోబెట్టింది" అన్నాడు.

"నిజమేరా! ఈ ప్రపంచంలో నీకు కనిపించిన ఏ వస్తువయినా సరే పగిలిన గాజు పెంకులు మొదలుకొని, పాతబట్టలవరకూ, పళ్ళు, పూవులు మొదలుకొని, చింతపండు దాకా...."

"ఆటబొమ్మలు మొదలుకొని, బంగారం నగలదాకా ఏమి ఇచ్చినా నువ్వు అమ్మగలవు. అసలు 'అడ్వర్టయిజ్‌మెంట్' అంటే ఏమిటో భూతంలా కనిపిస్తోందిలా ఉంది నీకు. వస్తువుల్ని మనం అమ్మనక్కరలేదు. ఎవరో అమ్ముతారు. ఎవరో కొంటారు. ఈ అమ్మకానికి మనం పబ్లిసిటీ ద్వారా సహాయం చేస్తాం. అంతే! మన కమీషన్ మనకు వస్తుంది. ఇక్కడ నీ స్థానం ఏమిటో తెలుసా? అమ్మకందారుకీ, కొనేవారికీ మధ్య వంతెనలాగా పనిచేయాలి."

శ్రద్ధగా వింటున్నాడు మహేశ్.

"ఇక్కడ నువ్వు వస్తువులని అమ్మనక్కరలేదు. మొదట మన కస్టమర్ల దగ్గర మన పేరును అమ్మాలి. తర్వాత మన కస్టమర్ కంపెనీల పేర్లని, ఉత్పత్తుల పేర్లనీ అమ్మాలి. ఇంతే ఇది సేల్స్ కాదంటావా?"

ఒప్పుకోక తప్పలేదు మహేశ్‌కి.

ఆ రోజు, ఈ రోజు ఒకటి కాదు. ఇప్పుడు మహేశ్ తన మాట వినే స్థితిలో లేడు. అతను చాలా రోజులుగా ఆలోచించుకునే నిర్ణయించుకున్నట్లున్నాడు.

ఆఖరుగా అన్నాడు సత్యమూర్తి.

"అయితే నన్నొంటరివాణ్ణి చేసిపోతావా మహేశ్?"

"నేనెక్కడికి పోతాను? ఈ ఊళ్ళోనే ఉంటాను గదా! నీ కెప్పుడే సహాయం కావాలన్నా, కాకితో కబురంపితే వచ్చెయ్యనూ? ఎప్పుడయినా మార్కెట్ వయిపు వస్తే ఒకసారి నా కొట్లోకి చూసి వెళ్ళు. అన్నట్లు చెప్పటం మరిచా. మునుపు నేను మకాంపెట్టిన రైల్లో ఉన్న దుకాణాలన్నీ మొన్నొక అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అటువయిపు హోల్‌సేల్ గోడవున్లకి దగ్గర్లో కొత్త మార్కెట్ నిర్మాణం కొంతవరకూ అయిందిట."

లేచి నిలుచున్నాడు మహేశ్.

ఇద్దరూ ఒకరికొకరు శుభాభివందనలు చెప్పుకున్నారు.

మహేశ్ చేతిని వదిలేసిన సత్యమూర్తి చెయ్యి కోటుజేబులో దేన్నో వెతుకుతోంది.

"సిగరెట్లు లేవా? ఇదుగో నా దగ్గరున్నాయి" అంటూ పాకెట్ తీసి అందించాడు మహేశ్.

"ఇప్పట్నించీ నేను సిగరెట్లు తెచ్చుకోవటం మరచివస్తే నా కెవరిస్తార్రా మహేశ్?"

"మరచిపోకుండా తెచ్చుకో మరి" అంటూ బయటికి నడిచాడు మహేశ్.

*　　　*　　　*

మూడు సంవత్సరాల తర్వాత....

ఒకరోజు మహేశ్ సిటీమార్కెట్‌లో తన దుకాణంలో కూర్చుని ఉన్నాడు.

నారాయణరావు అతన్ని చూడవచ్చాడు.

"హాయ్ నారాయణా రావ్. ఏమిటిలా వొచ్చావే. అసలు నీ కెలా తెలుసు నేనిక్కడున్నానని?"

"మూర్తి సార్‌ని అడిగి కనుక్కున్నాను సర్" చిరునవ్వుతో అన్నాడు అతను.

"ఏమిటి విశేషం?"

"నేను మరో పార్ట్‌నర్‌తో చేరి ఏడ్. కంపెనీ ఒకటి ప్రారంభించబోతున్నాను సర్. మీతో చెప్పి మీ సలహా తీసుకోవాలని వచ్చానండి"

పెద్ద జోక్ విన్నట్లుగా గలగలమని నవ్వాడు మహేశ్.

"సలహానా? నేనేం సలహా ఇవ్వగలను. నాకేం తెలుసని?"

"అలా అనకండి సర్.... పోనీ నన్ను ఆశీర్వదించండి చాలు" బొద్దుగా, కదలటమే కష్టమేమో అనిపించేలా ఉండి, కంప్యూటర్ మాదిరిగా పనిచేయగల మహేశ్ అంటే, నారాయణరావుకు ఎంతో భక్తి, అతని మాటంటే ఎంతో గురి కూడా.

"చూడు బాబూ; నీకు పెళ్ళయిందా?"

"అయిందండి ఒక పాప కూడా"

"మంచిది. అయితే బిజినెస్‌మాన్‌వి కాబోయేముందు, నువ్వొక ఫామిలీ మాన్‌వి అనీ, ఒక స్త్రీకి భర్త, ఒక పాపకు తండ్రి అన్న విషయం బాగా గుర్తుంచుకో. నీ టయింలో కొంతయినా. వాళ్ళకోసం వెచ్చించవలసిన బాధ్యత నీకుంది. వాళ్ళకా హక్కు ఉంది ఈ విషయాన్నెప్పటికీ మరవొద్దు. ఇదే నే నిచ్చే సలహా" అన్నాడు మహేశ్.

నడిచి వెళ్ళిపోతున్న నారాయణరావు వంక కనుమరుగయేదాకా చూస్తూ ఉండిపోయాడు మహేశ్.

— —